ప్రతిపక్షం

www.prathipaksham.in

బుధవారం 03.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 253 పేజీలు:12 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



నేడే రెండో వన్డే.. టార్గెట్ సిరీస్ 12

‘సంచార్ సాథీ’ కేంద్రం వేగు

వినియోగదారులపై నిఘా పెట్టడమే

వ్యక్తిగత గోప్యతకు తీవ్ర విఘాతం



- పార్లమెంటులో మండిపడిన విపక్షాలు
- ఉభయసభలను కుదిపేసిన అంశం
- ఇదొక ‘డిస్టోపియన్ టూల్’ అన్న కాంగ్రెస్
- ఇది దారుణమని రేణుకా చౌదరి మండిపాటు
- నియంతృత్వానికి దారి: శివసేన ఎంపీ ప్రియాంక
- ప్రజల గోప్యతను హరిస్తుంది: టీఎంసీ ఎంపీ సాగరిక
- అవసరం లేకుంటే యాప్ ను తొలగించుకోవచ్చు
- స్పష్టతనిచ్చిన సమాచార మంత్రి జ్యోతిరాదిత్య

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, డిసెంబర్ 2 : భారత్‌లో విక్రయించే అన్ని కొత్త స్మార్ట్ ఫోన్లలో 'సంచార్ సాథీ' యాప్‌ను ఫ్రీ ఇన్‌స్టాల్ చేయాలంటూ కేంద్రం వెలువరించిన ఉత్తర్వులపై దుమారం రేగుతోంది. పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు ఈ ఉత్తర్వులపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. తప్పనసరిగా ఫోన్‌లో ఉండాలనే ఆదేశాలు రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత గోప్యత హక్కును ఉల్లంఘించడమేనని, వినియోగదారుల కదలికలపై నిఘా పెట్టడమేనని విమర్శించాయి. దీంతో అవసరం లేదనుకుంటే యాప్‌ను తొలగించుకోవచ్చని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పష్టం చేశారు. ‘సంచార్ సాథీ’ అంశం మంగళవారం పార్లమెంట్‌ను కుదిపేసింది. ఇండియా కూటమి పార్టీల ఆందోళనతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ అంశంపై వాయిదా తీర్మానం పెట్టిన కాంగ్రెస్ ‘సంచార్ సాథీ’పై విస్తృత చర్చ జరపాలని డిమాండ్ చేసింది. ఇదొక ‘డిస్టోపియన్ టూల్’ అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ దుయ్యబట్టారు. ప్రతి భారతీయుడిపైనా నిఘా పెట్టడమే కాకుండా వారి ఆర్థిక హక్కులపై దాడిగా అభివర్ణించారు. దీని అమలు

...:: మిగతా 2లో



కేసులు పెడితే భయపడం

ధైర్యంగానే ఎదుర్కొంటాం

సోనియా, రాహుల్ ఏ తప్పూ చేయలేదు

ఎప్పుడో మూతపడిన నేషనల్ హెరాల్డ్ పత్రిక సిబ్బందిని మంచి ఆలోచనతో ఆర్థికంగా ఆదుకున్నారని సీఎం రేవంత్ పేర్కొన్నారు. పత్రికను తిరిగి నడిపించాలంటే ‘బోర్డు ఆఫ్ డైరెక్టర్లు’గా కొంతమంది కాంగ్రెస్ నాయకులను తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక పత్రిక ఉండాలని ‘నేషనల్ హెరాల్డ్’ను పునరుద్ధరించే ప్రక్రియ చేపట్టారని అన్నారు. మానసిక ధైర్యం కోల్పోకుండా సోనియా, రాహుల్ గాంధీ కేసులను ధైర్యంగా ఎదుర్కొన్నారన్నారు. దేశం కోసం ప్రాణాలిచ్చిన కుటుంబం నుంచి వచ్చారని,ఇలాంటి కేసులకు భయపడబోరని తేల్చి చెప్పారు. దేశస్థాయిలో ఓట్ల చోరీ కార్యక్రమాన్ని బయటపెట్టే సరికి భయపడే వేధింపులు మొదలుపెట్టారని సీఎం ఆరోపించారు.

- ‘నేషనల్ హెరాల్డ్’ సిబ్బందిని ఆదుకున్నారు
- మానవత్వం చూపితే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారా!
- ‘ఓట్ చోరీ’కి భయపడే కేసులతో వేధింపులు
- రాహుల్ ను ప్రధానిగా చేసే వరకు నిద్రపోవద్దు
- త్వరలోనే రాష్ట్రానికి నాలుగు విమానాశ్రయాలు
- ప్రపంచంలో మేటి యూనివర్సిటీగా ‘ఉస్మానియా’
- కాలుష్యం నుంచి హైదరాబాద్ కు విముక్తి కల్పిస్తాం
- సంక్షోభంలో ఉన్న తెలంగాణ ఇక సంక్షేమం దిశగా
- పదేండ్లలో బీఆర్ఎస్ సర్కారు చేసిందేమీ లేదు
- డీసీసీ అధ్యక్షులు బాధ్యతగా పని చేయాలి
- టీపీసీసీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 2: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీలపై కేసులు పెడితే భయపడేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ దేశం కోసం గాంధీ కుటుంబం త్యాగం చేసిందని గుర్తు చేశారు. నేషనల్ హెరాల్డ్ సిబ్బందికి వారు ఆర్థిక సాయం మాత్రమే అందించారని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన మంగళవారం గాంధీభవన్ లో పీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రయివేటు సంస్థలలో పనిచేసే వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ లాంటి సౌకర్యాలు ఉండవని, వారి కోసం మంచి ఆలోచనతో ఆర్థికంగా ఆదుకునేందుకు షేర్ క్యాపిటల్‌కు సంబంధించి కాంగ్రెస్ పార్టీ నుంచి నిధులు బదిలీ చేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇచ్చారని తెలిపారు. ఏ ఒక్క రూపాయి ప్రభుత్వానికి సంబంధించినది కాదని, ఎవరూ జేబులో ఒక్క రూపాయి కూడా వేసుకోలేదని తెలిపారు. ఆస్తులన్నీ నెహ్రూవేనని వారసత్వంగా ఉన్న పత్రికను నడపాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించినట్లు చెప్పారు. మనీలాండరింగ్ కేసు, ఈడీ కేసులు పెట్టి మానసికంగా

...:: మిగతా 2లో



ఆరోపణలతో రాజకీయ ప్రతీకార చర్య

షనల్ హెరాల్డ్ కేసులో కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేయడం రాజకీయ ప్రతీకారమే అని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. చేయడానికి కొత్త ఆరోపణలేమీ లేకపోవడంతో పాత కేసులను తెరపైకి తీసుకువస్తున్నాయ

11



అధికార మార్పిడి ఉండబోదు!!

కర్ణాటక ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య కొనసాగుతోన్న వివాదానికి త్వరలోనే శుభం కార్డు పడనుందా? అంటే అవుననే సమాధానం వస్తోంది.

11

ఉద్యమకారుల హక్కుల కోసం పోరాటం



- భూముల పంపిణీపై వెంటనే స్పష్టత ఇవ్వాలి
- 9లోగా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలి
- ఉద్యమకారులను తగురీతిలో గౌరవించాలి
- లేకపోతే తీవ్ర ఆందోళనలకు సిద్ధమవుతాం
- జాగృతి అధ్యక్షురాలు కవిత హెచ్చరిక
- అమరవీరుల స్మృతిలో రక్తదాన శిబిరం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 2: ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నిలబెట్టుకోవాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. డిసెంబర్ 9 నాటికి భూముల పంపిణీపై స్పష్టమైన ప్రకటన రాకపోతే జాగృతి భూపోరాటాలు ప్రారంభిస్తుందని హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో అమరవీరుల స్మరణార్థం మెగా రక్తదాన శిబిరాన్ని తెలంగాణ

...:: మిగతా 2లో



పార్లమెంటులో ‘సర్’ మంటలు

- సమగ్ర చర్చకు విపక్షాల డిమాండ్
- పదేపదే ఉభయ సభలకు అంతరాయం
- కీలక నిర్ణయం తీసుకున్న కేంద్ర సర్కార్
- చర్చలకు రావాలని ప్రతిపక్షాలకు పిలుపు
- ప్రతిష్ఠంభన ముగింపునకే అన్న కిరణ్ రిజిజు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, డిసెంబర్ 2 : 'ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ'పై పార్లమెంటులో చర్చ కోసం విపక్షాలు పట్టుబట్టడం, ఉభయ సభలకు మాటిమాటికీ తీవ్ర అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఓ ముందడుగు వేసింది. పార్లమెంట్‌లో నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించేందుకు విపక్ష పార్టీల నేతలను చర్చలకు ఆహ్వానించింది. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మంగళవారం వెల్లడించారు. శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి విపక్షాలు 'ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' చర్చకు డిమాండ్ చేస్తున్నాయి. దీనితో పదేపదే పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా పడుతూ వస్తున్నాయి. అందుకే విపక్ష పార్టీల నేతలను చర్చలకు ఆహ్వానించామని కిరణ్ రిజిజు లోక్‌సభలో చెప్పారు. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో చేపట్టిన ఎస్ఐఆర్‌పై చర్చ జరగాలని విపక్షాలు సభలో నినాదాలు చేయడంతో కిరణ్ రిజిజు మాట్లాడుతూ ప్రభుత్వం దేనిమీద అయినా చర్చించడానికి సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఎస్ఐఆర్ అనే ఒక అంశంపై చర్చించడానికి పార్లమెంట్ కార్యకలాపాలకు అంతరాయం కలిగించలేమన్నారు. చిన్న చిన్న పార్టీలు కూడా తమకు అత్యంత ముఖ్యమైన అంశాలపై సభలో చర్చించాలనుకుంటున్నాయని, వాటికంటే ఎస్ఐఆర్‌పై చర్చ ఎక్కువేమీ కాదని రిజిజు వ్యాఖ్యానించారు. ‘కొన్ని పార్టీలు పార్లమెంట్ కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజం. కానీ, ఓటమి వల్ల కలిగిన కోపాన్ని వెళ్లగక్కకూడదు. కానీ కాంగ్రెస్ పార్టీ నేతలు ఇలా సభకు అంతరాయం కలిగిస్తూ, ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నారు’ అని రిజిజు అన్నారు. సభా మర్యాదను కాపాడాలని, చిన్న పార్టీల నేతలు చెప్పే సమస్యల గురించి కూడా వినాలని అన్నారు.



హమాస్ తరహాలో దాడికి ప్రయత్నం

దేశ రాజధాని ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపై దర్యాప్తులో విస్మయానికి గురిచేసే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా, సహ- నిందితుడు ఫోన్‌లోని డ్రోన్ ఫొటోలు హమాస్ తరహా ఆయుధాల ఆధారాలను బయటపెట్టాయి.

11

పీఎంఓ భవనం ఇక ‘సేవాతీర్థ్’

- సంచలన నిర్ణయం తీసుకున్న కేంద్రం
- నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- బ్రిటిష్ కాలం నాటి చిహ్నాలు తుడిచే యత్నం



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, డిసెంబర్ 2 : కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎంఓ) పేరును ‘సేవాతీర్థ్’గా మార్చింది. దశాబ్దాల కాలం నుంచి ప్రధానమంత్రులు

...:: మిగతా 2లో

రెండు దశలలో జనగణన

- దాంతో దేశమంతా కులగణన
- నిపుణుల సలహాలతో ప్రశ్నాపత్రం
- డిజిటల్ వేలో జనాభా లెక్కల సేకరణ
- లోక్ సభలో వెల్లడించిన మంత్రి నిత్యానంద్‌రాయ్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో



న్యూఢిల్లీ, డిసెంబర్ 2 : దేశంలో జనగణన రెండు దశలలో జరుగనుంది. కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. 2026 ఏప్రిల్- సెప్టెంబర్ మధ్య మొదటి దశ, 2027 ఫిబ్రవరిలో రెండో దశ జన గణన జరుగుతుందని మంగళవారం లోక్‌సభలో వెల్లడించింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వేసిన ప్రశ్నకు, హోమ్ వ్యవహారాల సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానం ఇచ్చారు. జనగణన మొదటి దశలో హౌస్‌లిస్టింగ్, సెన్సెస్, రెండో దశలో జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని చెప్పారు. రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల సౌలభ్యానికి అనుగుణంగా 30 రోజుల వ్యవధిలోనే సెన్సెస్ నిర్వహణ ఉంటుందని పేర్కొన్నారు. లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో మంచుతో కప్పపడే ప్రాంతాలలో జనగణన 2026 సెప్టెంబర్ నుంచి అక్టోబర్‌ఒకటి మధ్య జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియకు ముందు వివిధ మంత్రిత్వశాఖలు, విభాగాలు, సంస్థలు, సెన్సెస్ డేటా యూజర్ల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నామని, దాని ఆధారంగా జన గణన ప్రశ్నాపత్రాన్ని రూపొందించామని నిత్యానంద్ రాయ్ చెప్పారు. కులగణన కూడా ఈ జనాభా గణనలోనే జరుగుతుందని నిత్యానంద్ రాయ్ తెలిపారు. ఈసారి జనాభా లెక్కింపు డిజిటల్ వేలో జరుగుతుందని కూడా ఆయన వెల్లడించారు. మొబైల్ యాప్‌ల ద్వారా డేటాను సేకరిస్తామని, స్వీయ గణనకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. దేశంలో సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో సేకరించారు. కొవిడ్ కారణంగా 2021లో నిలిచిపోయింది. ఇపుడు చేపట్టనున్నది 16వ జనాభా గణన. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత లెక్కవేసుకుంటే ఇది ఎనిమిదవది అవుతుంది.



తిండి, నీరు అన్నీ అక్కడి నుంచే

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ నెల 4, 5 తేదీలలో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా ఆయన భద్రత కోసం ఏర్పాటు చేస్తున్న ఏర్పాట్లు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

11

రాజకీయం



ఖర్గేను కలిసిన సీఎం రేవంత్

- గ్లోబల్‌సమ్మిట్‌కు రావాలని ఆహ్వానం

ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్2: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యూఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డిసెంబర్ 8,9 తేదీలలో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగబోయే "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025"కు కావాల్సిందిగా ఆయనను ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి విజన్, భవిష్యత్తు ప్రణాళికలను ప్రపంచానికి పరిచయం చేయడానికి గ్లోబల్ సమ్మిట్ ఒక కీలక వేదికగా నిలవనుంది. రాష్ట్రంలో చేపట్టనున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెట్టుబడి అవకాశాలు, దీర్ఘకాలిక లక్ష్యాలతో కూడిన "తెలంగాణ రైజింగ్ 2047" రోడ్‌మ్యాప్‌ను కూడా గ్లోబల్ సమ్మిట్ వేదికపై ఆవిష్కరించనున్నారు. సీఎం వెంట ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు పార్లమెంటు సభ్యులు పాల్గొన్నారు.

ప్రపంచంతోనే తెలంగాణ పోటీ

- అందుకే విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నాం
- నెహ్రూ, మన్ మోహన్ ఇందుకు దారులు వేశారు
- కొత్తగూడెం సభలో సీఎం రేవంత్ రెడ్డి



ప్రతిపక్షం ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 2: ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కు కంచుకోట అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ను సంపూర్ణంగా ఆశీర్వదించి ప్రభుత్వానికి అండగా నిలబడ్డారని కొనియాడారు. మంగళవారం నాడు ఆయన జిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ కోసం రైతులు వందలాది ఎకరాలు ఇచ్చారని, ఉద్యోగాలు మాత్రం ఇతర ప్రాంతాలవారికి దక్కాయని ఆరోపించారు. అందుకే తెలంగాణ ఉద్యమం పాల్వంచలోనే ప్రారంభమైందని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమానికి తగు స్ఫూర్తినిచ్చిన ప్రాంతం కొత్తగూడెం అని వివరించారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షను నెరవేర్చి రాష్ట్రాన్ని ఇచ్చిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు ఎర్త్ యూనివర్సిటీ కి పెట్టడం గొప్ప అవకాశమని అన్నారు. దేశంలో ఉన్న ఆకలి కేకలను చూసి, ప్రపంచంతో పోటీ పడాలనుకుని తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్ పాలసీ తీసుకువచ్చి గొప్ప గొప్ప వర్సిటీలను ప్రారంభించారని పేర్కొన్నారు. దేశంలో ఆహార ఉత్పత్తులు పెంచడానికి బాక్రానంగల్ నుంచి శ్రీశైలం , నాగార్జున సాగర్ వరకు అనేక ప్రాజెక్టులను నెహ్రూ కట్టించారన్నారు. విద్య మాత్రమే తెలంగాణ ను ఉన్నతస్థానంలో నిలబెడుతుందని, అందుకే ఆ వైపు ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం వివరించారు. సింగరేణి లాంటి సంస్థలను పెంచాలంటే ఎర్త్ యూనివర్సిటీ లాంటి వి అవసరమన్నారు. మంచి పాలన ఉంటే ఉచిత కరెంటు, రేషన్ కార్డుల పంపిణి, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ చీరలు లాంటి వస్తాయన్నారు. అందుకే గ్రామాలలో సర్పంచ్ లు మంచోళ్లు ఉండాలని, మంత్రులతో కలిసి పనిచేసే వాళ్లు కావాలని వివరించారు. అభివృద్ధి కోసం మంచి సర్పంచ్ లను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు రఘురామారెడ్డి, ఎంపీ పోరిక బలరాం నాయక్, అటవీశాఖ అభివృద్ధి చైర్మన్ పొదెం వీరయ్య, ఎమ్మెల్యేలు కునంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, సత్తుపల్లి మట్టారాగమయి, తెల్లం వెంకట్రావు, రామ్ దాస్ నాయక్, జారే ఆదినారాయణ పాల్గొన్నారు.



'డిఫెన్స్ స్ట్రాటజిక్ హబ్ ఆఫ్ ఇండియా'గా తెలంగాణ

- డ్రోన్ మాన్యుఫ్యాక్చరింగ్, టెస్టింగ్ కారిడార్ కు ప్రణాళికలు
- రూ.850 కోట్లతో 'జేఎస్ డబ్ల్యూ యూఏవీ ఫెసిలిటీ'
- యేటా 300 వీబీఏటీ డ్రోన్ల ఉత్పత్తి: 300 మందికి ఉద్యోగాలు
- 'భూమి పూజ' కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 2: తెలంగాణను 'డిఫెన్స్ స్ట్రాటజిక్ హబ్ ఆఫ్ ఇండియా'గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ రూపొందిస్తున్నట్లు ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. అడ్వాన్స్ డ్ అన్ మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్, డిఫెన్స్ ఇన్నోవేషన్ లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా మార్చేలా 'ఎకో సిస్టం'ను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో డ్రోన్ మాన్యుఫ్యాక్చరింగ్, టెస్టింగ్ కారిడార్ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. మంగళవారం ఆయన జేఎస్ డబ్ల్యూ, షీల్డ్ ఏఐ సంయుక్తంగా రూ. 850 కోట్లతో మహేశ్వరం ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చర్ క్లస్టర్ (ఈఎంసీ)లో ఏర్పాటు చేయనున్న 'జేఎస్ డబ్ల్యూ అన్ మ్యాన్డ్ ఏరియల్ వెహికిల్ (యూఏవీ) ఫెసిలిటీ'కి భూమిపూజ చేవారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రోన్లు, శాటిలైట్లు, సైబర్ సిస్టమ్స్, ఏఐ అనేవి ఇకపై భవిష్యత్తు సాంకేతికతలు కావని, అవి ఇప్పటికే ఆధునిక యుద్ధాల నిర్వహణ వ్యవస్థగా మారాయని అన్నారు. ఇప్పుడున్న పరిస్థితులలో డ్రోన్ల తయారీలో స్వయం సమృద్ధిని సాధించడం జాతీయ భద్రతకు అత్యంత అవసరమన్నారు. 2030 నాటికి దేశీయ డిఫెన్స్ యూఏవీ, డ్రోన్ మార్కెట్ వాల్యూ 4.4 బిలియన్ డాలర్లు, 5 బిలియన్ డాలర్లకు పెరిగే అవకాశముందని అన్నారు. ఈ పరిస్థితులను మనకు అనుకూలంగా మార్చుకునేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేఎస్ డబ్ల్యూ డిఫెన్స్ ఫౌండర్ పార్థ్ జిందాల్, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ వ్యాఖ్యలు అప్రజాస్వామికం

- సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్2: దేశ ప్రధాని నరేంద్ర మోదీ నేడు ప్రతిపక్షాలను, పార్లమెంట్ సమావేశాలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యల్ని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ తప్పుపట్టారు. చట్టసభల్లో ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తితే.. అది ఎందుకు డ్రామా అవుతుందో మోదీ సమాధానం చెప్పాలన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా మంగళవారం రామకృష్ణ మాట్లాడుతూ, పార్లమెంట్‌లో మోదీ ప్రతిపక్షాలను ఉద్దేశించి డ్రామాలు ఆడవద్దని, అభివృద్ధిపై చర్చించాలంటూ వ్యాఖ్యలు చేయడం అపహాస్యమన్నారు. 11 ఏళ్ల మోదీ హయాంలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ దేశంలో ఏ రంగాల్లో మనం ముందుకు పోయాం?, ఏ రంగాల్లో వెనుకబాటుకు గురయ్యాం?, మోడీ హయాంలో దేశానికి ఏం అభివృద్ధి జరిగిందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాలలోను భారత్ ముందుకు పోతోందని మోదీ చెబుతున్నారని, ఇవాళ ప్రపంచ మార్కెట్ లో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గిపోయిందన్నారు. 2014లో మోదీ ప్రధాని అయ్యే నాటికి ఒక డాలర్‌కు రూ.60 ఉంటే, ఇవాళ రూ.89.65 పైసలకు చేరుకుందంటే, రూపాయి విలువ ఎలా పడిపోయిందో తెలుస్తుందన్నారు. మోదీ స్పష్టంగా పార్లమెంట్‌ను, ప్రతిపక్షాలను అవమానిస్తున్నారని మండిపడ్డారు. వామపక్ష, ప్రజాస్వామ్య వాదులంతా ప్రధాని చర్యల్ని తూర్పారబట్టాలన్నారు. ప్రజాస్వామ్యానికి ఇలాంటి చర్యల ద్వారా ప్రమాదం ఏర్పడుతోందని రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు.

కేసులు పెడితే భయపడం

మొదటిపేజీ తరువాయి

సోనియా, రాహుల్ గాంధీలను వేధిస్తారా? అంటూ బీజేపీపై మండిపడ్డారు.

పార్టీకి ఒక పత్రిక ఉండాలనే

ఎప్పుడో మూతపడిన నేషనల్ హెరాల్డ్ పత్రిక సిబ్బందిని మంచి ఆలోచనతో ఆర్థికంగా ఆదుకున్నారని సీఎం రేవంత్ పేర్కొన్నారు. పత్రికను తిరిగి నడిపించాలంటే 'బోర్డు ఆఫ్ డైరెక్టర్లు'గా కొంతమంది కాంగ్రెస్ నాయకులను తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక పత్రిక ఉండాలని 'నేషనల్ హెరాల్డ్'ను పునరుద్ధరించే ప్రక్రియ చేపట్టారని అన్నారు. మానసిక ధైర్యం కోల్పోకుండా సోనియా, రాహుల్ గాంధీ కేసులను ధైర్యంగా ఎదుర్కొన్నారన్నారు. దేశం కోసం ప్రాణాలిచ్చిన కుటుంబం నుంచి వచ్చారని,ఇలాంటి కేసులకు భయపడబోరని తేల్చి చెప్పారు. దేశస్థాయిలో ఓట్ల చోరీ కార్యక్రమాన్ని బయటపెట్టే సరికి భయపడే వేధింపులు మొదలుపెట్టారని సీఎం ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ ప్రచారాలను అడ్డుకోవాలనే సోనియా, రాహుల్‌పై మళ్లీ కేసులు పెట్టారని విమర్శించారు. సోనియా, రాహుల్‌పై పెట్టిన అక్రమ కేసులను ఖండిస్తూ ప్రధానికి లేఖ రాస్తున్నట్లు ప్రకటించారు. సోనియా, రాహుల్‌కు తెలంగాణ ప్రజల తరఫున అండగా నిలబడతామన్నారు.

త్వరలో నాలుగు విమానాశ్రయాలు

నగరం లోపల కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను బయటకు తరలిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్‌ఎకానమీ, పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ వృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు అవతల రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమీ వస్తోందని సీఎం చెప్పారు. తెలంగాణకు రాష్ట్రానికి మరో నాలుగు విమానాశ్రయాలు వస్తున్నాయన్నారు. వాటికి త్వరలోనే శిలాఫలకాలు వేసుకుందామన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడి మచిలీపట్నం పోర్టు తీసుకున్నామని అక్కడి నుంచి రహదారులు, రైల్వే లైన్లు వస్తున్నాయని అన్నారు. వాటితో పాటే తెలంగాణకు బుల్లెట్ రైలు కూడా వస్తోందని అన్నారు. గుజరాత్‌కు ఇచ్చేవన్నీ తెలంగాణకు ఇవ్వాలని మోడీని కలిసి విజ్ఞప్తి చేయనున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం నుంచి నిధులను ఒకటికి వంద సార్లు అడుగుతామని, ఒకటికి 50 సార్లు ఢిల్లీ వెళ్తామని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న పనులను డీసీసీ అధ్యక్షులే ప్రజలకు చెప్పాలని కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులకు సూచించారు. దేశంలో కోసం గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను ఆయన సోదాహరణంగా వివరించారు.

ప్రపంచస్థాయిలో 'ఉస్మానియా'

ఈ నెల ఏడున ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్తామని సీఎం చెప్పారు. ఈ వర్సిటీ అభివృద్ధికి ఎంత ఖర్చు అయినా నిధులు కేటాయిస్తామన్నారు. ఓయూను ప్రపంచస్థాయిలో నిలబెడతామని ప్రకటించారు. డిసెంబర్ 8, 9 తేదీలలో ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామన్నారు. 9న తెలంగాణ 2047 పాలసీ డాక్యుమెంట్ ఆవిష్కరణ చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి దిగ్గజ నేతల సలహాలు సైతం తీసుకున్నామని పేర్కొన్నారు. గత పదేండ్లలో తెలంగాణకు ఒక్క ఎయిర్‌పోర్టు కూడా తేలేదంటూ బీఆర్ఎస్ పార్టీపై సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు ఎయిర్‌పోర్టులు తెచ్చామన్నారు. సంక్షోభంలో ఉన్న తెలంగాణను సంక్షేమం దిశగా తీసుకెళ్తున్నామని వివరించారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమీ రాష్ట్రంగా చేయడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. అందరి కృషితో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి ఏఐసీసీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, సచిన్ సావంత్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, వాకాటి శ్రీహరి, అజారుద్దీన్, డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

TELANGANA
RISING
GLOBAL SUMMIT

సీఎంలను ఆహ్వానించనున్న మంత్రులు

- బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో: హైదరాబాద్, డిసెంబర్ 2: ఈ నెల 8,9 న జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రత్యేకంగా ఆహ్వానించే బాధ్యతను సీఎం రేవంత్ రెడ్డి మంత్రులకు అప్పగించారు. జమ్మూకశ్మీర్, గుజరాత్ కు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పంజాబ్, హర్యానాకు మంత్రి దామోదర రాజనర్సింహ, ఆంధ్రప్రదేశ్ కు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి. కర్ణాటక, తమిళనాడుకు శ్రీధర్ బాబు, ఉత్తరప్రదేశ్ కు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజస్థాన్ కు పొన్నం ప్రభాకర్, ఛత్తీస్ గడ్ కు కొండా సురేఖ, వెస్ట్ బెంగాల్ కు మంత్రి సీతక్క, మధ్యప్రదేశ్ కు తుమ్మల నాగేశ్వర్ రావు, అసోంకు జూపల్లి కృష్ణారావు . బిహార్ కు వివేక్ వెంకటస్వామి, హిమాచల్ ప్రదేశ్ కుఅడ్లూరి లక్ష్మణ్ .ఒడిశాకు వాకిటి శ్రీహరి .మహారాష్ట్రకు అజారుద్దీన్ వెళతారు. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎంపీలను కలిసి గ్లోబల్ సమ్మిట్ కు ప్రత్యేకంగా ఆహ్వానాలు అందిస్తారు.

'సంచార్ సాథీ' కేంద్రం వేగు

మొదటిపేజీ తరువాయి

రాజ్యాంగ విరుద్ధమని ఆయన విమర్శించారు. ఈ అంశంపై రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ రేణుక చౌదరి వాయిదా తీర్మానం ఇచ్చారు. ఇది దారుణ పరిణామని, భవిష్యత్తులో నియంతత్వానికి దారితీస్తుందని శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది ధ్వజమెత్తారు. ప్రజల గోప్యతను హరిస్తుందని దుయ్యబట్టారు. అలాగే, టీఎంసీ ఎంపీ సాగరిక ఘోష్ కూడా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

అవసరం లేదనుకుంటే తొలగించవచ్చు

ఈ నేపథ్యంలో కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పష్టతనిచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ అవసరం లేదనుకుంటే యూజర్లు సంచార్ సాథీ యాప్‌ను తొలగించుకోవచ్చని పేర్కొన్నారు. 'దాన్ని యాక్టివేట్ చేయకండి యాప్‌ను మీ ఫోన్‌లో ఉంచడం, తొలగించడం అంతా మీ ఇష్టం. ఉదాహరణకు మీరు ఫోన్ కొన్నప్పుడు, చాలా యాప్‌లు ముందే ఇన్‌స్టాల్ అయి ఉంటాయి. గూగుల్ మ్యాప్స్ కూడా వస్తుంది. గూగుల్ మ్యాప్స్‌ను వాడకూడదనుకుంటే దాన్ని తొలగించుకోవచ్చు' అని అన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ల నుంచి గూగుల్ మ్యాప్‌లను డిలీట్ చేయడం సాధ్యం కాదు. కానీ, దాన్ని డిసేబుల్ చేయవచ్చు. ఐ ఫోన్లలో మాత్రం గూగుల్ మ్యాప్స్‌ను పూర్తిగా డిలీట్ చేయొచ్చు. మంత్రి మాత్రం సంచార్ సాథీకి సంబంధించిన అపోహలను తొలగించడానికి తాను ప్రయత్నిస్తున్నానని చెప్పారు. 'ఇది వినియోగదారుల భద్రతకు సంబంధించిన అంశం. ఇందులో ఏదీ తప్పనిసరి కాదు. ఇష్టం లేకుంటే మీరు రిజిస్టర్ చేసుకోవద్దు. అది అలా డార్మెంట్‌గా ఉంటుంది. మీకు డిలీట్ చేయాలనిపిస్తే, డిలీట్ చేయండి. కానీ దేశంలోని ప్రతి వ్యక్తికి మోసాల నుంచి తమను రక్షించడానికి ఒక యాప్ ఉందని తెలియదు. అందుకే ఈ సమాచారాన్ని విస్తృతంగా తెలియజేయడం మా బాధ్యత' అని ఆయన మార్గదర్శకాలపై వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు.

పీఎంఓ భవనం ఇక 'సేవాతీర్థ్'

మొదటిపేజీ తరువాయి

సౌత్‌బ్లాక్‌లోని పీఎంఓ నుంచి విధులు నిర్వహించారు. ఇపుడు ఆ కార్యాలయం కొత్త భవనంలోకి మారనుంది. ఈ నేపథ్యంలోనే పేరు మార్పుపై కేంద్రం ప్రకటన చేసింది. సెంట్రల్ విస్టా అభివృద్ధిలో భాగంగా నిర్మిస్తున్న ఈ కాంప్లెక్స్ పనులు పూర్తి కావచ్చాయి. ఇంతకుముందు ఈ భవనాలన్నింటినీ ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్‌గా పిలిచేవారు. ఆక నుంచి 'సేవాతీర్థ్' అని పిలుస్తారు. కొత్తగా నిర్మించిన ఈ భవన సముదాయంలో పీఎంఓతో పాటు కేబినెట్ కార్యదర్శి ఆఫీసు, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్, ఇండియా హౌస్ ఉండనున్నాయి. పరిపాలన అనేది అధికారాన్ని ప్రదర్శించే స్థలం కాదని, అది ప్రజలకు సేవలందించే కేంద్రం కావాలని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. భారత పరిపాలనలో పేర్లలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం యత్నిస్తోంది. గవర్నర్ నివాసం రాజ్ భవన్, ఇక లోక్ భవన్‌లుగా మారుతుంది. కేంద్ర ప్రభుత్వం గతంలో కూడా పలు ప్రదేశాలకు కొత్త పేర్లు పెట్టింది. రాజ్ పథ్‌ను కర్తవ్య పథ్‌గా పేరు మార్చింది. ప్రధాన మంత్రి అధికార నివాసానికి 2016లో లోక కళ్యాణ్ మార్గ్ అనే పేరు పెట్టారు.

తెలంగాణ రాజ్‌భవన్ పేరు మార్పు

ఈ క్రమంలోనే తెలంగాణ రాజ్ భవన్ పేరును మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. రాజ్‌భవన్‌ను లోక్‌భవన్‌గా మార్చింది. గవర్నర్ల అధికారిక నివాసాలకు పేరు మార్చాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. బ్రిటిష్ కాలనికి సంబంధించిన రాజ్ పదాన్ని తొలగించి, ప్రజలకు దగ్గరగా ఉండే లోక్ అనే పేరుతో మార్చాలని నిర్ణయించారు. ఈ మేరకు కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు లేఖలు రాసింది. రాజ్ భవన్ , రాజ్ నివాస్ పేర్లను లోక్ భవన్, లోక్ నివాస్ గా మార్చాలని సూచించింది. ఇప్పటికే అధికారిక కార్యక్రమాలలో 'ఇండియా'కు బదులు 'భారత్' ఉపయోగిస్తున్నారు. బీటింగ్ రిట్రీట్ సెరిమోనీలో ఆంగ్ల గీతాలను తొలగించడం వంటి చర్యలు తీసుకుంటున్నారు.

సోనియా, రాహుల్ పై ఎఫ్ఐఆర్ ప్రతీకార చర్య

- మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్2: నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై కొత్త ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయడాన్ని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. రాజకీయ ప్రతీకార చర్యగా దీన్ని అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో భిన్న అభిప్రాయాలు వ్యక్తపరచడం నేరం కాదు. ప్రజల కోసం, దేశ భవిష్యత్తు కోసం పోరాడుతున్న నాయకులపై ఇలా కేసులు నమోదు చేయడం అంగీకారయోగ్యం కాదు అన్నారు. ఇది ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీయడానికి చేసిన రాజకీయ ప్రయత్నం. కాంగ్రెస్ పార్టీ, నాయకుల పట్ల ప్రజల్లో ఉన్న అపారమైన విశ్వాసాన్ని దెబ్బతీయాలని చేసే నిష్ఫల ప్రయత్నమిది. న్యాయం తప్పకుండా గెలుస్తుంది అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అన్యాయ చర్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు.

ఉద్యమకారుల హక్కుల కోసం పోరాటం

మొదటిపేజీ తరువాయి

జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు, కార్యకర్తలతో పాటు సంస్థ అధ్యక్షురాలు కవిత స్వయంగా రక్తదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను జాగృతి తరపున స్మరించుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్రం కోసం విద్యార్థులు, ప్రజలు, ఉద్యమకారులు మహత్తరమైన త్యాగాలు చేసిన ఫలితంగానే తెలంగాణ ఏర్పడిందని ఆమె గుర్తుచేశారు. కేసీఆర్ దీక్ష నుంచి అమరుల బలిదానాల దాకా జరిగిన ఉద్యమం వల్లే తెలంగాణ జన్మించిందని తెలిపారు. అయితే,కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పటికీ ఉద్యమకారుల పట్ల అప్పటి కొంతమంది ఎమ్మెల్యేలు, మంత్రులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. ఉద్యమ సమయంలో 1200 మంది అమరులయ్యారని ప్రకటించినప్పటికీ, కేవలం 540 కుటుంబాలకు మాత్రమే సాయం అందించగలిగామని, వారికి సరైన గౌరవం కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రావతరణదినోత్సవం వంటి ముఖ్యమైన రోజున కూడా అమరుల కుటుంబాలకు శాలువ కప్పి గౌరవించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

రెండేండ్లుగా కాలయాపన

ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, పెన్షన్లు, 250 గజాల భూమి అందిస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని కవిత గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసెంబర్ 9న హామీలపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రెండేండ్లుగా అప్లికేషన్ల పేరిట కాలయాపన జరుగుతోందని విమర్శించారు. 'మేము డిమాండ్ చేయకపోతే అమరుల స్థూపం వద్దకు కూడా వెళ్లదు ప్రభుత్వం. జై తెలంగాణ అని కూడా అనలేదు. ఉద్యమకారుల పోరాటం వల్లే నేడు రాష్ట్రానికి మీరు ముఖ్యమంత్రి అయ్యారన్న సత్యాన్ని ప్రభుత్వం గుర్తించాలి' అని కవిత పేర్కొన్నారు. డిసెంబర్ 9న ఉద్యమకారులకు భూముల పంపిణీపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే జాగృతి తరపున భూపోరాటాలు ప్రారంభిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ భూములు ఉన్నచోట ఉద్యమకారులను తీసుకెళ్లి భూపంపిణీ చేపడతామని, ఆ భూములపై జాగృతి జెండాలు కూడా పాతుతామని స్పష్టం చేశారు. 'మా రక్తం, చెమట ధారబోసి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యమకారులందరికీ చట్టబద్ధంగా భూములు దక్కాల్సిందే' అని కవిత స్పష్టం చేశారు.



యూరప్ దేశాలతో యుద్ధం చేయాలని రష్యా కోరుకోవట్లేదు. ఒకవేళ తమపై పోరాటం చేస్తామంటే యుద్ధానికి సిద్ధం. ఉక్రెయిన్ వార్ ముగించడానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను ఆ దేశాలు అడ్డుకుంటున్నాయి. రష్యాకు ఆమోదయోగ్యంకాని ప్రతిపాదనలు తెచ్చి శాంతి ఒప్పందానికి తూట్లు పొడుస్తున్నాయి.. వాటికి శాంతియుత ఎజెండా లేదు.

- రష్యా అధ్యక్షుడు పుతిన్

రాష్ట్రీయం

డీసీసీల ఎంపికలో సామాజిక న్యాయం

- ఏఐసీసీ రాష్ట్ర ఇన్చార్జి మీనాక్షి నటరాజన్
- పది రోజులలో నామినేటెడ్ పోస్టుల భర్తీ
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 2: రాష్ట్రంలో డీసీసీ అధ్యక్షుల ఎంపికలో సామాజిక న్యాయం జరిగిందని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్అన్నారు. గాంధీభవన్ లో మంగళవారం టీపీసీసీ కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు బొమ్మా మహేశ్ కుమార్ గౌడ్అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మీనాక్షి మాట్లాడుతూ కాంగ్రెస్అంటేనే పేదల పార్టీ అని తెలిపారు. రాహుల్ గాంధీ, ఖర్గే సూచన మేరకు డీసీసీ అధ్యక్షుల ఎంపిక జరిగిందన్నారు. అణగారినవర్గాలకు తగిన ప్రాధాన్యం లభించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరో పదేండ్ల పాటు అధికారంలో కొనసాగేందుకు డీసీసీ అధ్యక్షులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందజేయడంతో పాటు నిత్యం ప్రజలలో ఉంటూ వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూనే పార్టీని మరింత పటిష్టం చేయాలన్నారు.

'స్థానిక' ఎన్నికలపై దృష్టిపెట్టాలి

స్థానిక సంస్థల ఎన్నికలలోనూ, సీఎం జిల్లాల పర్యటనలలోనూ డీసీసీలు ముఖ్య భూమిక పోషించాలని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కోరారు. డీసీసీల ఎంపికలో ఇటు నిష్ణాతులైన ఏఐసీసీ పరిశీలకులు, సీఎం, మీనాక్షి నటరాజన్ అణగారిన వర్గాల కోసం పాటుపడుతున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ ఆకాంక్ష మేరకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కుల సర్వే నిర్వహించామని, మోదీ జనగణనలో కుల సర్వే నిర్వహిస్తామని ప్రకటించారని తెలిపారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారంటూ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. డీసీసీలు పార్టీ నిర్మాణం పై దృష్టి పెట్టాలని కోరారు. వారం పది రోజులలో కార్పొరేషన్ పదవులతో పాటు పెండింగ్ లో ఉన్న పదవుల భర్తీ పూర్తి అవుతుందన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్లు భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్'.. ఆరు వారాల పాటు అవగాహన

- ప్రారంభించిన డీజీపీ శివధర్ రెడ్డి
- రాష్ట్రంలో 8శాతం తగ్గిన సైబర్ నేరాలు: టీజీసీఎస్బీ డీజీ శిఖా గోయల్
- 58 వేల ఎఫ్ఐఆర్లు, రూ.350 కోట్లు రిఫండ్



రాష్ట్రంలో 8 శాతం తగ్గిన సైబర్ నేరాలు

ప్రతిపక్షం సేట్బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్2: సైబర్ నేరాల నియంత్రణ పై అవగాహన కలిగించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) ఆధ్వర్యంలో 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాఫ్' ప్రచార కార్యక్రమాన్ని డీజీపీ శివధర్ రెడ్డి ప్రారంభించారు. బంజారాహిల్స్ లోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో సైబర్ సెక్యూరిటీ డీజీ ఆధ్వర్యంలో సైబర్ నేరాల పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఫ్రాడ్ కా ఫుల స్టాప్' కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 6 వారాల పాటు నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనిట్లు పాల్గొనాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే అనుమానస్పద లింకులకు, ఆర్థిక ఆఫర్లకు దూరంగా ఉండాలని సూచించారు.

దేశ వ్యాప్తంగా సైబర్ నేరాలు 29 శాతం పెరిగాయని, అదే సమయంలో రాష్ట్రంలో 8శాతం తగ్గాయని టీజీసీఎస్బీ డీజీ శిఖా గోయల్ వెల్లడించారు. ఆర్థిక నష్టం దేశ వ్యాప్తంగా 6శాతం తగ్గితే రాష్ట్రంలో 30శాతం తగ్గినట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పడిన నాటి నుంచి 244లక్షల ఎన్సీఆర్పి ఫిర్యాదులు అందాయని, 58,244 ఎఫ్ఐఆర్లు నమోదు అయినట్లు వెల్లడించారు. సైబర్ బాధితులకు రూ.350కోట్ల రిఫండ్ చేసినట్లు తెలిపారు. సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో విద్యార్థుల కోసం స్టూడెంట్ ప్రోగ్రామ్ ఫర్ అవేర్ నెస్ అండ్ రెస్పాన్సిబుల్ సైబర్ స్పెస్(స్పార్క్ సైబర్ క్లబ్స్) ప్రారంభించమన్నారు. ఎస్బీఐ భాగస్వామ్యంతో సిబ్బందితో సైబర్ డిఫెండర్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీజీపీఏ డైరక్టర్ అబిలాష బిస్త్, ఇంటిలిజెన్స్ ఏడీజీపీ విజయ్ కుమార్, టీజీ నాబ్ డైరక్టర్ సందీప్ శాండిల్యా, హైదరాబాద్ సీపీ సజ్జనార్ , సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐసీసీసీ డైరక్టర్ కమల్ హసన్ రెడ్డి, మాజీ ఐపిఎస్ ఎఆర్ శ్రీనివాస్ , ఐజీ రమేష్ నాయుడు, ఈగల్ డీఐజీ అభిషేక్ మహంతి, డీసీపీలు అరవింద్ బాబు, సుధీంధ్ర, నాగలక్ష్మీ, ఎస్పీలు హర్షవర్ధన్, సాయిశ్రీ పాల్గొన్నారు.



గ్లోబల్ సమ్మిట్ పనులు చురుకుగా సాగాలి

- వార్ రూమ్ ను సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 2: గ్లోబల్ సమ్మిట్ వార్ రూమ్ ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంగళవారం సందర్శించారు. విజన్ డాక్యుమెంట్ రూపకల్పన తోపాటు ఈనెల 8, 9న భారత్ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ సమ్మిట్ విజయవంతానికి ఏర్పాటు చేసిన కమిటీలు, వాటి పనితీరు, ప్రగతి తదితర అంశాల గురించి కూలంకషంగా చర్చించారు. ఇన్విటేషన్, హాస్పిటాలిటీ, వేదిక, లాజిస్టిక్స్, ట్రాన్స్పోర్ట్, ప్రోగ్రాం, కల్చరల్ ఈవెంట్స్, కమ్యూనికేషన్, డిజిటల్ మీడియా కమ్యూనికేషన్ కమిటీల అధ్యక్షులు, టీం సభ్యులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సమీక్ష నిర్వహించిన అనంతరం ప్రతి విభాగంలో పని చేస్తున్నవారి వద్దకు వెళ్లి మాట్లాడి పనులు జరుగుతున్న తీరును, వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పనులలో వేగం పెంచడంతోపాటు నాణ్యత, స్పష్టత ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా, సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వార్ రూమ్ ను సందర్శించారు. బుధవారం నుంచి మంత్రులు సైతం వార్ రూమ్ ను సందర్శించి పనులను పర్యవేక్షించనున్నారు. డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశంలో సీనియర్ అధికారులు జయేశ్ రంజన్, సవ్యసాచి ఘోష్, సంజయ్ కుమార్, సందీప్ కుమార్ సుల్తానియా, అజిత్ రెడ్డి, ప్రభుత్వ మీడియా సలహాదారు శ్రీరామ్ కర్రీ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్

- ప్రధాని మోదీ, రాహుల్ గాంధీకి గ్లోబల్ సమ్మిట్ఆహ్వానం



ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 2: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రి 8 గంటలకు ఢిల్లీకి బయలుదేరారు. నేటి ఉదయం నుంచి సీఎం హైప్రొఫైల్ భేటీల షెడ్యూల్ లో ఉంటారు. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇంకా పలువురు కేంద్ర మంత్రులను కలిసి.. హైదరాబాద్‌లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ 2026కు అధికారికంగా ఆహ్వానం పత్రిక అందజేయనున్నారు. ఈ సమ్మిట్ ను అంతర్జాతీయ స్థాయిలో ఘనంగా నిర్వహించి, తెలంగాణను గ్లోబల్ ఏఐ హబ్‌గా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలోనే దేశ రాజకీయ నాయకత్వం మొత్తాన్నీ ఒకే వేదికపై చేర్చేందుకు సీఎం రేవంత్ స్వయంగా ఢిల్లీలో పర్యటిస్తారు. అదనంగా కొన్ని కేంద్ర పథకాలు, రాష్ట్రానికి కేటాయింపులు, పెండింగ్ ప్రాజెక్టులపైనా చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. బుధవారం అంతా ఢిల్లీలోనే గడిపి, సీఎం రేవంత్ రెడ్డి, రాత్రి తిరిగి వస్తారని సమాచారం.



ఎస్సీ, ఎస్టీల పైనా మీ ప్రతాపం

- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు రాంచందర్ మండిపాటు
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి సంఘటనలపై విచారణ

ప్రతిపక్షం, సికింద్రాబాద్, డిసెంబరు 2: డేకాయిట్లను, రౌడిలను వదిలి ఎస్సీ, ఎస్టీ అదివాసీ పేదల పైనా మీ ప్రతాపపం అని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ పోలీసులపై అగ్రహన్ని వ్యక్తం చేశారు. జాతీయ ఎస్సీ కమిషన్ అధ్వర్యంలో మంగళవారం దిల్ ఖుష్ గెస్ట్ హౌజ్లో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ కు సంబంధించిన తొమ్మిది ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి సంఘటనలపై విచారణ చేపట్టారు. కోదాడ పట్టణానికి చెందిన దళిత యువకుడు కర్ల రాజేష్ జ్యుడీషియల్ మృతి పై విచారణ చేశారు. మృతుడు రాజేష్ తల్లి లలిత, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పోలీసుల లాకప్ చిత్ర హింసలకు పాల్పడటంతోనే మరణించారని వివరించారు. ఇందుకు స్పందించిన కమిషన్ సభ్యులు రాంచందర్ చట్టాలకు విరుద్ధంగా చిన్న నేరాలకు ఎందుకు లాకప్ లో వుంచుకున్నారని రాష్ట్ర అడిషనల్ డీజీ మహేష్ భగవత్, నల్గొండ ఎస్పీ లను నిలదీశారు. రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్.ఐ సురేష్ రెడ్డి కి షోకాజ్ నోటిసు జారి చేసి సమగ్ర విచారణ జరిపించాలని సూచించారు. శ్రీ కాకుళం ఐఐటి దళిత విద్యార్థి సృజన్ హత్య కేసులో మిగతా అయిదుగురిని ఎందుకు అరెస్టు చేయలేదని ఎస్పీ, డీఎస్పిల ను ప్రశ్నించగా విచారణ చేస్తున్నామని, తదుపరి అరెస్టు చెస్తామన్నారు. సంచలనం సృష్టించిన సూర్యపేట మాల బంటి హత్య పై విచారణ చేసి బాధిత కుటుంబానికి ఉద్యోగం, పెన్షన్ ,ఇల్లు మంజూరు చేయాలని అదేశించారు. కూకట్ పల్లిలో దారుణ హత్యకు గురైన చిన్నారి బాలిక సహస్ర కుటుంబానికి ఉద్యోగం, ఇల్లు,పెన్షన్ మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరిని ఆదేశించగా కలెక్టర్ స్పందిస్తూ రెండవ దశ నష్టపరిహారం త్వరలో చెల్లించి పునరావసం కింద ఇల్లు, ఉద్యోగం, పెన్షన్ మంజూరు చెస్తామన్నారు. ఈ విచారణలో జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ కుమార్, అర్ఓ తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర రాజశేఖర్ హత్యపై సమగ్ర దర్యాప్తు చేయాలి: డీబీఎఫ్

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీపంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు ఎర్ర రాజశేఖర్ కుల దురంహంకార హత్య పై సమగ్ర విచారణ జరిపించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ కు వినతిపత్రం సమర్పించారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే హత్య జరిగిందని శంకర్ వివరించగా విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు.



ఫ్యూచర్ సిటీ ఎవరిని అడిగి కడుతున్నారు!

- సీఎం రేవంత్ పై స్టేట్ బీజేపీ చీఫ్ ఆగ్రహం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 2 : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మండిపడ్డారు. ఫ్యూచర్ సిటీకి నిధులు ఇవ్వకపోతే బీజేపీని భూస్థాపితం చేస్తామని రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజమే రేవంత్ రెడ్డి సర్కార్‌ను భూస్థాపితం చేస్తుందని అన్నారు. ఇప్పటివరకూ కేంద్రం ఏ సిటీకి నిధులు ఆపలేదని తెలిపారు. ఫ్యూచర్ సిటీ ఎవరిని అడిగి కడుతున్నారని ప్రశ్నించారు. నేషనల్ హెరాల్డ్ కేసు గురించి మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ భూముల లెక్కలు ఎవరికీ తెలియదని, సుప్రీంకోర్టు తీర్పు ద్వారానే కుంభకోణం వెలుగులోకి వచ్చిందన్నారు. డిజిటల్ ఇండియాలో అనేక మార్పులు జరుగుతాయని తెలిపారు. 'సంచార్ సాథీ' కూడా డిజిటల్ ఇండియాలో భాగమే అని ఏ యాప్ తెచ్చినా అది ప్రజల సంక్షేమం కోసమే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ.తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.





పవన్ వ్యాఖ్యలపై మంత్రుల ఫైర్

- రాజకీయ అవగాహన లేదన 'కోమటిరెడ్డి'
- సినిమాలు ఆడనివ్వమంటూ 'పొన్నం' హెచ్చరిక

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 2: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ కన్నెర్ర చేసింది. పవన్ కు రాజకీయ అనుభవం లేదని మంత్రి కోమటి రెడ్డి వ్యాఖ్యానించగా, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే పవన్ సినిమాలు తెలంగాణలో ఆడనివ్వబోమని మరో మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. 'తినే తిండి తెలంగాణది, పాడే పాట ఆంధ్రదంటూ' ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మండిపడ్డారు. పవన్ కళ్యాన్‌కు రాజకీయాలు తెలియవని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అందుకే తెలిసీతెలియకుండా మాట్లాడుతున్నారన్నారు. పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే సినిమాలు ఆడవని హెచ్చరించారు. ఏపీ డిప్యూటీ సీఎం తెలంగాణ ప్రజల గురించి చేసిన వ్యాఖ్యలకు ఏపీ సీఎం చంద్రబాబు స్పందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. పవన్ వ్యాఖ్యలు తెలంగాణ ప్రజలకు అవమానకరమని అన్నారు. కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోతే 'తెలంగాణ దిష్టి' అనడం అవివేకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ బీజేపీ నేతలు స్పందించాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి బాధ్యతగా మాట్లాడాలన్నారు.

కాంగ్రెస్ భూ కుంభకోణంపై పోరుబాట

- 'హిల్టిప్' నిజనిర్ధారణ కోసం క్షేత్రస్థాయిలోకి గులాబీ దళం
- ఎనిమిది నిజ నిర్ధారణ బృందాల ఏర్పాటు
- నాయకులకు దిశానిర్దేశం చేసిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 2: హైదరాబాద్ మహానగర పరిధిలోని 5లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను, 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ' పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు భారత రాష్ట్ర సమితి సిద్ధమైంది. దీనిలో భాగంగా పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ నాయకులతో కూడిన 'నిజనిర్ధారణ బృందాలను' నియమించారు. ఈ మేరకు పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ గారు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయి పర్యటనలపై దిశానిర్దేశం చేశారు.

నిజాలను ప్రజల ముందుంచాలి

టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపన కోసం, ఉపాధి కల్పన కోసం అతి తక్కువ ధరకే కేటాయించిన భూములను, ఇప్పుడు 'మల్టీ యూజ్ జోన్' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మారుస్తున్నారని ఆరోపించారు. సుమారు 9,300 ఎకరాల భూములను మార్కెట్ విలువ కంటే అతి తక్కువకు, కేవలం ఎస్ఆర్ఓ రేటులో 30 శాతానికే రెగ్యులరైజ్ చేసి, సుమారు రూ. 5 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టడానికి, కనీసం స్మశాన వాటికలకు కూడా స్థలాలు లేవని చెబుతున్న ప్రభుత్వం, వేల కోట్ల విలువైన భూములను మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందని మండిపడ్డారు.

3,4 తేదీల్లో పారిశ్రామిక వాడల్లో బృందాల పర్యటనలు

ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వాడలను 8 క్లస్టర్లుగా విభజించి, పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో బృందాలు పర్యటించనున్నాయి. అక్కడ స్థానిక నాయకులను, ప్రజలను కలుపుకొని వాస్తవ మార్కెట్ విలువకు, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఉన్న భారీ వ్యత్యాసాన్ని ప్రజల ముందు ఉంచనున్నారు. వీటితోపాటు అక్కడి పారిశ్రామిక వాడల ద్వారా ప్రజా ఉపయోగ కార్యక్రమాలు ఏమేమి చేయవచ్చు అక్కడి స్థానిక ప్రజల సుదీర్ఘకాలం డిమాండ్లను ఆకాంక్షలను కూడా పార్టీ నేతలు తెలుసుకోనున్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయక విజయోత్సవాలా?

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఫైర్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 2: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా విజయోత్సవాలు జరుపుకోవడం హాస్యాస్పదమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలన సందర్భంగా నిర్వహించిన విజయోత్సవాలపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. తెలంగాణ భవన్లో జరిగిన మీడియా సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం విజయోత్సవాల ప్రారంభ సభకు జనాలు హాజరుకాకపోవడం ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రజలకు చూపించడానికి తమ ప్రభుత్వం చేసిన పనులేమీ లేకపోవడంతోనే సీఎం సభలు ఖాళీగా కనిపిస్తున్నాయని ఆయన అన్నారు. కేసీఆర్ పాలనలో జిల్లా అభివృద్ధికి చేసిన కార్యక్రమాలను గుర్తు చేసిన శ్రీనివాస్ గౌడ్, "ఐదు కొత్త జిల్లాలు, ఐదు మెడికల్ కాలేజీలు, కల్వకుర్తి-నెట్టెంపాడు ప్రాజెక్టుల పూర్తి, పెండింగ్ ప్రాజెక్టుల ద్వారా పది లక్షల ఎకరాలకు నీరందింపు, కొత్త రిజర్వాయర్లు, చెరువుల అభివృద్ధి, రోజువారీ తాగునీటి సరఫరా, ఇవి అన్నీ కేసీఆర్ పాలనలోనే సాధ్యమయ్యాయి" అని పేర్కొన్నారు. కేసీఆర్‌ను విమర్శించడం తప్ప సీఎం రేవంత్ పాలనలో ప్రగతిశీలమైన ఒక్క కార్యం కూడా కనిపించడం లేదని అన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా విజయోత్సవాలు జరుపుకోవడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కేవలం పదిహేను శాతం పనులు మిగిలి ఉన్నప్పటికీ పూర్తి చేయలేకపోవడం ప్రభుత్వం వైఫల్యమని ఆయన అన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వలేకపోవడం, రెండు లక్షల ఉద్యోగాలు నెరవేర్చలేకపోవడం, కేంద్ర నిధుల ఒనగూర్చడంలో విఫలమవడం ప్రభుత్వ వైఫల్యమేనని పేర్కొన్నారు.

"విజయోత్సవాల తొలి సభ అట్టర్ ఫ్లాప్" : పట్నం నరేందర్ రెడ్డి

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మక్తల్‌లో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన విజయోత్సవాల తొలి సభ పూర్తిగా విఫలమైందని అన్నారు. కొడంగల్-నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి రెండు సార్లు శంకుస్థాపనలు చేయడం ప్రభుత్వ అసమర్థతకు చిహ్నమని విమర్శించారు. సభలకు జనాలు రాకపోవడం రేవంత్ ప్రభుత్వం హామీలు నెరవేర్చలేకపోయినందువల్లేనని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కేసీఆర్‌కు క్రెడిట్ వెళ్లకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ముందుకు తీసుకురావట్లేదని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం సేకరించిన ఫార్మాసిటీ భూములను "ఫ్యూచర్ సిటీ" పేరిట సినీ ప్రముఖులకు అప్పగించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఫార్మా సిటీ భూములను రైతులకు తిరిగి ఇస్తామని ఇచ్చిన హామీని రేవంత్ రెడ్డి నిలబెట్టలేదన్నారు. రేవంత్ రెడ్డి ఫుట్ బాల్ ఆడుతున్న విషయం మీద వ్యాఖ్యానిస్తూ, "ప్రజలు ఆరు నెలలు వేచిచూసారు. ఇకపై ప్రజలే రేవంత్‌ను ఫుట్ బాల్‌లా తన్నగలరు" అని విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్క కోటి రూపాయల పనైనా జరిగి ఉంటే మీడియా చెప్పాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు సుమిత్రానంద్, సుశీలా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



"

హిందువులంటే కాంగ్రెస్‌కు ద్వేషం. సీఎం రేవంత్ హిందూ దేవుళ్లను అవమానించారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నా. కాంగ్రెస్ ఎంఐఎంకి మోకరిల్లింది. తమది ముస్లింల పార్టీ అని రేవంత్ కూడా అన్నారు. బీఆర్ఎస్ కూడా హిందువులను కించపరిచింది. కానీ బీజేపీ ఇతర మతాల్ని అవమానించలేదు. హిందువులు ఇలా అవమానాన్ని భరిస్తూనే ఉంటారా లేదా ఒక్కటవుతారా.?

- కేంద్ర మంత్రి బండి సంజయ్

ఓపెన్ వాయిస్

అసంబద్ధ విధానాల 'సర్'

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ అనుసరిస్తున్న విధానాలపై తీవ్ర అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. ఈమేరకు దాఖలైన పిటిషన్లపై రెండు రోజులపాటు సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణ నిర్వహించి తదుపరి విచారణను వాయిదా వేసింది. బిహార్ రాష్ట్రంలో ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత ఇప్పుడు 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో సవరణ ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఎన్నికల నిర్వహణ పేరుతో చట్టసభల విధులను ఎన్నికల కమిషన్ తనకు తాను చేపట్టినట్టుగా కసరత్తు సాగుతోందని, రాజ్యాంగ పరిమితులను దాటి నిర్హేతుకమైన నిబంధనలతో పౌరులపై తీవ్ర భారాన్ని ఎన్నికల కమిషన్ మోపుతోందన్న అభ్యంతరాలు తలెత్తుతున్నాయి. ఓటర్ల అర్హతను నిర్ణయించడానికి 11 పత్రాలు సమర్పించాలని ఎన్నికల కమిషన్ నిబంధన విధించింది. కానీ, ఏ చట్ట ప్రకారం ఆ నిబంధన విధించారని పిటిషనర్లు నిలదీస్తున్నారు. అటువంటి చట్టాన్ని పార్లమెంట్, లేదా అసెంబ్లీలు మాత్రమే చేయాలని, వాటికి అతీతంగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోందని విమర్శిస్తున్నారు. ఈ ప్రక్రియ ఫొటో ధ్రువీకరణ కోసం కాకుండా, పౌరసత్వ తనిఖీ కోసం చేపట్టినట్టు కనిపిస్తోందని వారు ఆక్షేపిస్తున్నారు. బూత్‌స్థాయి అధికారులుగా ఉపాధ్యాయులను నియమిస్తున్నారు. వారి ద్వారానే పౌరసత్వాన్ని నిర్ధారించడం, ఆ తరువాత ఓటరుగా చేర్చాలో లేదో నిర్ణయించడం జరుగుతోంది. ఈ విధంగా పౌరసత్వాన్ని నిర్ధారించే హక్కు, లేదా రాజ్యాంగపరమైన విధి బూత్‌లెవెల్ ఆఫీసర్లుకు కట్టబెట్టడం తీవ్ర చర్చనీయాంశంగా సాగుతోంది. ఇటు, గత ఓటర్ల జాబితాలతో ఇప్పటి నమోదు ఫారాలను పోల్చిచూస్తున్నారు. అప్పటి జాబితాలలో ఓటరు ఏవైనా పొరపాట్లు చేస్తే ఆ కారణాలతో అతని సంతానానికి ఇప్పుడు ఓటు తిరస్కరించడం ఏమిటని పిటిషనర్లు ప్రశ్నిస్తున్నారు. పౌరసత్వానికి ఆధార్‌కార్డు మాత్రమే ప్రామాణికం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం కూడా సమస్యగా మారింది. చొరబాటుదారులు కానీ, ఇక్కడ పనిచేస్తున్న విదేశీయులు కానీ, రేషన్ కోసం ఆధార్ కార్డు సంపాదిస్తే వారు మన పౌరులేనని ధ్రువీకరించాలా! అని సుప్రీంకోర్టు ప్రశ్నించడం సమంజమే. కానీ, చాలా ప్రాంతాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఆధార్ కార్డు ఒక్కటే ప్రామాణికంగా ఓటర్లు భావిస్తుంటారు. వారు తమ పౌరసత్వాన్ని నిరూపించుకునే మరే అధికారిక పత్రాలు వారి వద్ద ఉండవు. చాలామంది నిరక్షరాస్యులు కావడంతో ఈ నిబంధనలు వారికి తెలియడం లేదు. ఇవన్నీ క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాల తయారీకి ప్రతిబంధకాలు అవుతున్నాయి. ఓటరు నమోదు ఫారం 6 లో పేర్కొన్న వివరాలు సరైనవో, కావో నిర్ధారించుకునే అధికారం ఇసికి ఉందని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. కానీ, ఆ నిర్ధారణే సరిగ్గా జరగడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్ఓ) అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లు నింపిన తరువాత ఆ వివరాలను 2002-2005 ఓటర్ల జాబితాలతో పోల్చిచూడడంలోనే అసలు చిక్కులు ఏర్పడుతున్నాయి. బిహార్ డేటా అక్కడి ఎన్నికల ఫలితాలను నాటకీయంగా మార్చలేకపోయినప్పటికీ, ఓటర్ల లింగ నిష్పత్తిలో గణనీయమైన తగ్గుదల చూపింది. నిజమైన ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాల కోసం పెనుగులాడుతూనే ఉన్నారు. ఓటర్ల వివరాల నమోదుకు డాక్యుమెంటేషన్ ఈ 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో వచ్చే నెలలోగా పూర్తి చేయవలసి ఉంది. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి పరిశీలించాలన్న నిబంధన కాగితాలపైనే కనిపిస్తోంది. అటు, ఓటర్లు తాము స్థానికంగా నివాసం ఉంటున్నామని ఇప్పుడు నిరూపించుకోవలసి వస్తోంది. గతంలో ఓటు వేసినా, అప్పటి ఓటర్ల జాబితాలో తన పేరు ఉన్నా సరే ఇప్పుడు పాత రికార్డులతో పనిలేకుండా తాను స్థానికుడిననే చట్టబద్ధతగా నిర్ధారించుకోడానికి రుజువు చూపించక తప్పడం లేదు. ఎన్నికల కమిషన్ చేయవలసిన ఈ బాధ్యతలన్నీ పౌరులపైనే నెట్టేయడం విమర్శలకు దారి తీస్తోంది. ఈ పరిస్థితి వల్ల చివరకు ఓటరు ప్రధాన హక్కులను తొలగించడమే అవుతుంది. ముఖ్యంగా వివాహితులైన మహిళలకు, వలసదారులకు ఇది అగ్నిపరీక్షే. స్థానిక నివాసిని గుర్తించడంలో కఠినంగా నిబంధనలు అమలు చేయాల్సిందేనని కోర్టు కూడా స్పష్టం చేయడంతో గుర్తింపు సమస్య జటిలంగా మారింది. దీని మీద కేంద్ర ఎన్నికల సంఘం పునరాలోచన చేయడం మంచిదే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ప్రతిపక్షం

హైదరాబాద్,

బుధవారం
03.12.2025

బీసీల కోసం ఢిల్లీతో యుద్ధం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం నుంచి ప్రధాన పార్టీలేవీ తప్పించుకోవటానికి అవకాశం లేని పరిస్థితిని కవిత తీసుకొస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అసలు రంగును ఆమె బయటపెట్టారు. దీంతో డ్యామేజ్ కంట్రోల్ చేసుకునేందుకు ఈ మూడు పార్టీలు బీసీ రిజర్వేషన్ల వాదాన్ని వినిపిస్తున్నాయి. అయితే, రిజర్వేషన్లు సాధించే వరకు కవిత ఎలాగు పోరాటం చేస్తారు కనుక తప్పని సరి పరిస్థితులలో అన్ని పార్టీలు ఈ విషయంలో సీరియస్ గా ఉండాల్సిందే. కనుక కచ్చితంగా భవిష్యత్ లో బీసీలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు రావాల్సిందే. ఆ పోరాటంలో కవితే ఛాంపియన్ గా ఉండటం తథ్యం.



భవాని వేముల
8297444333

స్థానిక సంస్థలలో బీసీలకు రిజర్వేషన్ విషయంలో రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు మోసపూరిత వైఖరితో కాలం వెళ్లదీస్తున్నా తెలంగాణ జాగృతి మాత్రం తన ఉద్యమాన్ని ఆపలేదు. కామారెడ్డి రైల్ రోకోతో మరోసారి ప్రధాన పార్టీల చెంప ఛెల్లుమనిపించింది. 50 శాతానికి పైగా జనాభా ఉన్న బీసీలకు న్యాయం చేయాలన్న చిత్తశుద్ధి ఏ పార్టీలోనూ కనిపించటం లేదు. ఇందులో చిత్తశుద్ధితో పోరాడుతున్న నాయకురాలెవరైనా ఉన్నారంటే తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాత్రమే. ఈ అంశాన్ని ఎత్తుకున్న నాటి నుంచి అనుక్షణం ఆ దిశగా అవకాశం ఉన్న అన్ని వేదికలలో తన గొంతు వినిపిస్తున్నారు. కానీ, నిజంగా సమస్యను పరిష్కరించ గలిగే అవకాశం ఉన్న కాంగ్రెస్, బీజేపీ మాత్రం ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ టైమ్ పాస్ చేస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా బీసీ రిజర్వేషన్ పై బరిగీసి కొట్లాడాల్సిన బీఆర్ఎస్ పార్టీ మాత్రం ఈ అంశంతో తనకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తోంది. దీంతో ఈ మూడు పార్టీల బండారాన్ని బయట పెట్టే బాధ్యతను కవిత తన భుజాలపై వేసుకున్నారు. బీసీ రిజర్వేషన్ విషయంలో వీరు చేస్తున్న డ్రామాను ఎప్పటికప్పుడు ప్రజల ముందుంచుతున్నారు.

ఓట్లు కొల్లగొట్టి, మరిచిపోయి

కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి కాంగ్రెస్ పార్టీ బీసీల ఓట్లు కొల్లగొట్టింది. ఆ తర్వాత ఈ విషయాన్ని మరిచిపోయింది. ఆ పార్టీ ఇచ్చిన హామీల మీద ఒత్తిడి తేవాల్సిన బీఆర్ఎస్ సైతం గమ్మునుండిపోయింది. దీంతో కాంగ్రెస్ కొద్ది రోజులు ఊపిరి పీల్చుకుంది. కానీ, వారికి కొరకరాని కొయ్యగా మారారు కల్వకుంట్ల కవిత. నిరంతరం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ను వారికి గుర్తు చేస్తూ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెచ్చే పని మొదలుపెట్టారు. దీంతో ఈ అంశం నుంచి తప్పించుకుందామనుకున్న కాంగ్రెస్ కు ఎటూ పాలు పోని పరిస్థితి ఏర్పడింది. నిరంతరం బీసీ రిజర్వేషన్ల అంశాన్ని కాంగ్రెస్ కు గుర్తు చేస్తూ కవిత రెండేళ్లుగా చాలా పోరాటాలే చేశారు. ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి బీసీలను జాగృతం చేశారు. రిజర్వేషన్ విషయంలో ప్రభుత్వం పై అన్ని వర్గాలు ఒత్తిడి తెచ్చేలా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆ రెండు పార్టీల వ్యూహాత్మక మౌనం

కవిత డిమాండ్ ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టింది. కవిత ఒత్తిడితో విద్య, ఉద్యోగాలకు ఒక బిల్లు, రాజకీయ రిజర్వేషన్ల కోసం రెండవ బిల్లు తీసుకురావాల్సి వచ్చింది. కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి పెట్టటంతో ఏదో కంటి తుడుపు చర్యగా బిల్లు పెట్టారు. ఇక్కడే బీజేపీ నాటకం కూడా బయట పడింది. కాంగ్రెస్ తెచ్చిన బిల్లులను అమలు చేయించాల్సి కాషాయం పార్టీ నేతలు అది తమ పని కాదన్నట్లుగా మిన్నకుండిపోయారు. తెలంగాణ ప్రజలు ఎనిమిది ఎంపీ సీట్లు గెలిపించినప్పటికీ ఆ కృతజ్ఞత కూడా చూపించలేదు. బీసీ బిల్లు విషయంలో 'కాంగ్రెస్, బీజేపీ దొందు దొందే' అన్నట్లుగా వ్యవహారం నడిపించాయి. కనీసం వారి బండారాన్ని బయట పెట్టాల్సిన బీఆర్ఎస్ కూడా వారి పాపంలో పాలు పంచుకుంటోంది. ఎక్కడ కూడా ప్రభుత్వంపై ఒత్తిడి పెట్టే కార్యక్రమాలు చేపట్టలేదు. రాష్ట్రపతి వద్ద పెండింగులో ఉన్న బీసీ బిల్లులకు ఆమోదం కల్పించాలన్న డిమాండుతో కవిత 72 గంటల నిరాహార దీక్ష చేపట్టింది. సెప్టెంబర్ 17న రైల్ రోకో కూడా నిర్వహిస్తామని హెచ్చరించారు. దీంతో అటు ప్రభుత్వం పై ఒత్తిడి పెరిగింది. ఫలితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాల్సి వచ్చింది. ఆర్డినెన్స్ గవర్నర్ వద్ద పెండింగులో ఉండిపోయింది.



రాజకీయంగా వాడుకుంటూ

చివరకు సర్పంచ్ ఎన్నికలలో బీసీలకు గతంలో కన్నా తక్కువ రిజర్వేషన్ ఇచ్చేలా జీఓ 46 ను తీసుకొచ్చినప్పటికీ బీఆర్ఎస్ పార్టీ నుంచి రావాల్సినంత నిరసన రావటం లేదు. ఇప్పటికీ కూడా కవిత మాత్రమే ఈ అంశాన్ని చాలా సీరియస్ గా తీసుకొని పోరాటం చేస్తున్నారు. కవిత పోరాట ఫలితంగానే బీసీ బిల్లుపై కనీసం బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అప్పుడప్పుడు ప్రకటనలు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. నిజంగా బీసీల విషయంలో పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే చేయగలిగే స్థానంలో ఉండి బీజేపీ ఎందుకు మౌనంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లటం లేదు. బీఆర్ఎస్ ఎందుకు చేతులెత్తేసింది. అంటే కేవలం బీసీలను మధ్య పెట్టి రాజకీయంగా వాడుకునేందుకు ప్రధాన పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయన్నది స్పష్టమవుతోంది. కవిత మాత్రం అలా కాదు. తాను ఒక అంశాన్ని ఎత్తుకున్నారంటే అది పూర్తయ్యే వరకు వదిలి పెట్టని నైజం ఆమెది. బీసీ రిజర్వేషన్ల విషయంలో కూడా ఆమె అంతే కమిట్ మెంట్ తో ఉన్నారు. అందుకే కాంగ్రెస్ మోసాన్ని ఎప్పటికప్పుడు ఎండగడుతూనే ఉన్నారు. తాజాగా 2025, నవంబర్ 28న కామారెడ్డిలోనూ రైల్ రోకో నిర్వహించారు. బీసీల అంశంలో ఢిల్లీకి మెసేజ్ ఇచ్చేందుకు రైల్ రోకో నిర్వహించారు. బీజేపీ ఎంపీలు రాజీనామా చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వచ్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

బీసీలకు ద్రోహం చేస్తున్న అంశంలో

నిజానికి కవితకు ఉన్న కమిట్ మెంట్ లో పదో వంతు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ కు ఉండి ఉంటే బీసీలకు ఎప్పుడో రిజర్వేషన్లు వచ్చేవి. బీసీలకు ద్రోహం చేస్తున్న అంశంలో ఈ పార్టీలు ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ ఏమీ కాదు. గతంలో బీఆర్ఎస్ బీసీలను ముంచితే ఇప్పుడు ఆ పాపకార్యాన్ని కాంగ్రెస్ కొనసాగిస్తోంది. బీజేపీ చేయగలిగే స్థితిలో ఉండి కూడా మొసలి కన్నీరు కారుస్తోంది. నిజంగా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ గట్టిగా అనుకుంటే 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు న్యాయం జరగటం పెద్ద విషయమేమీ కాదు. కానీ, ప్రధాన పార్టీలకు ఆ చిత్తశుద్ధి లోపించింది. ఒక్క కవిత మాత్రమే ఈ విషయంలో ఛాంపియన్ గా పోరాడుతున్నారు. ఎక్కడికి వెళ్లినా బీసీ ద్రోహ పార్టీలను జనం నిలదీస్తున్నారు. ఓ వైపు ధర్నాలు, నిరసనలు చేస్తున్నారు. మరో వైపు బీసీలందరినీ ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. తన సామాజిక తెలంగాణ లక్ష్యంలో భాగంగా బీసీలకు రిజర్వేషన్లు అనేది పెద్ద ముందడుగు అవుతుందని కవిత భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎంతో కమిట్ మెంట్ తో పోరాడుతున్నారు. కవిత నుంచి ఈ స్థాయిలో అన్ని పార్టీల మీద ఒత్తిడి లేకపోయి ఉంటే కచ్చితంగా బీసీ రిజర్వేషన్ అంశాన్ని కోల్డ్ స్టోరేజ్ లో పెట్టేవాళ్లే.

తప్పించుకోలేని పరిస్థితి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం నుంచి ప్రధా పార్టీలేవీ తప్పించుకోవటానికి అవకాశం లేని పరిస్థితిని కవిత తీసుకొస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అసలు రంగును ఆమె బయటపెట్టారు. దీంతో డ్యామేజ్ కంట్రోల్ చేసుకునేందుకు ఈ మూడు పార్టీలు బీసీ రిజర్వేషన్ల వాదాన్ని వినిపిస్తున్నాయి. అయితే, రిజర్వేషన్లు సాధించే వరకు కవిత ఎలాగు పోరాటం చేస్తారు కనుక తప్పని సరి పరిస్థితులలో అన్ని పార్టీలు ఈ విషయంలో సీరియస్ గా ఉండాల్సిందే. కనుక కచ్చితంగా భవిష్యత్ లో బీసీలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు రావాల్సిందే. ఆ పోరాటంలో కవితే ఛాంపియన్ గా ఉండటం తథ్యం.

(వ్యాస రచయిత తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి)

జర్నలిస్టుల 'బానిస బతుకులు' ఇక చాలు



వెంకగారి భూమయ్య
9848559863

తెలంగాణ రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీవ్ర నిర్లక్ష్యం, విధానపర అస్పష్టత, గందరగోళ వైఖరిని నిరసిస్తూ జర్నలిస్టుల యూనియన్ పోరాటాన్ని ఉధృతం చేసింది. స్వరాష్ట్రం సిద్ధించిన పదేండ్ల తర్వాత కూడా జర్నలిస్టుల బతుకులు మెరుగుపడకపోవడం, హామీలు కాగితాల వరకే పరిమితం కావడంపై యూనియన్ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మాదిరిగానే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నూతన పాలసీపై ఎలాంటి స్పష్టత ఇవ్వకుండా జర్నలిస్టుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోందని, ఈ గందరగోళమే తమను రోడ్డు ఎక్కేలా చేసిందని వారు ఆరోపించారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ మూడున హైదరాబాద్‌లోని సమాచార కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించ తలపెట్టిన మహా ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి, ప్రభుత్వానికి తాఖీదు జారీ చేశారు. ప్రభుత్వం ఈ విధానపర అస్పష్టత కారణంగా జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా నూతన అక్రిడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి, అర్హులైన వర్కింగ్ జర్నలిస్ట్‌లందరికీ తక్షణమే కొత్త కార్డులను జారీ చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) డిమాండ్ చేసింది. అనేక యేండ్లుగా ఎదురుచూస్తున్న ఇంటి స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించి, అర్హులైన జర్నలిస్టులందరికీ తక్షణమే ఇండ్ల స్థలాలను మంజూరు చేస్తూ స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలని కూడా కోరింది. నిలిపేసిన జర్నలిస్టుల ఆరోగ్య బీమా పథకాన్ని తక్షణం పునరుద్ధరించాలని, వృత్తి కమిటీలను ఏర్పాటు చేయాలని, సంక్షోభంలో ఉన్న చిన్న పత్రికలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై స్పష్టమైన పాలసీ నిర్ణయాలు ప్రకటించకపోతే, మహా ధర్నా ద్వారా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు గట్టి హెచ్చరిక జారీ చేశారు.

సమస్యల సుడిగుండంలో జర్నలిస్టులు

తెలంగాణ రాష్ట్ర సాధనలో వర్కింగ్ జర్నలిస్టులు కీలకపాత్ర పోషించినప్పటికీ, తమ హక్కుల సాధన కోసం నేటికీ పోరాడాల్సిన దుస్థితి ఏర్పడటంపై యూనియన్ నాయకత్వం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్రం సిద్ధించిన తర్వాత కూడా, మీడియా ప్రతినిధుల సంక్షేమానికి సంబంధించి ఎలాంటి శాశ్వత, పారదర్శకమైన విధానం అమలులోకి రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత పదేళ్ల పాలనలో కేవలం ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక హామీలు ఇవ్వడం జరిగిందే తప్ప, జర్నలిస్టుల ఆర్థిక, సామాజిక భద్రతకు భరోసా లభించలేదు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం సైతం పాత పాలకపక్షం అనుసరించిన నిర్లక్ష్య పంథాలోనే ప్రయాణిస్తుండటం, నూతన పాలసీ గురించి పదే పదే గందరగోళ ప్రకటనలు చేయడమే తప్ప, స్పష్టమైన జీఓ జారీ చేయకపోవడం జర్నలిస్టులను నిరసనలకు పురికొల్పుతోంది. ఇంటి స్థలాల మంజూరు అంశం అనేక యేండ్లుగా చర్చలలోనే ఉంది. యూనియన్ల తరపున అనేకసార్లు సర్కారుకు విజ్ఞప్తులు చేసినా, ప్రభుత్వం నుంచి సరైన స్పందన లభించలేదు. సొంత ఇల్లు లేని వేలాది మంది జర్నలిస్టులు, వారి కుటుంబాలు అద్దె ఇండ్లలో జీవితాన్ని నెట్టుకొస్తున్నారని, వృత్తిపరమైన ఒత్తిడితో పాటు, ఆర్థిక భారం వారిని మరింత కుంగదీస్తోందని నాయకులు ఆవేదన చెందారు. ప్రభుత్వం తక్షణమే భూములను గుర్తించి, అర్హులైన జర్నలిస్టుల జాబితాను పారదర్శకంగా రూపొందించి, తక్షణమే పట్టాలను పంపిణీ చేయాలని కోరారు. ఈ విషయంలో మరింత జాప్యం జరిగితే, కుటుంబాలతో సహా పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.



ఆరోగ్య బీమా నిలిపివేతతో

జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు సంబంధించి గతంలో అమలులో ఉన్న బీమా పథకాన్ని నిలిపివేయడం లేదా పునరుద్ధరణలో జాప్యం చేయడంతో వందలాది మంది జర్నలిస్టులు అత్యవసర వైద్య సేవలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరోనా వంటి సంక్షోభాల తర్వాత కూడా ఆరోగ్య భద్రతను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం ప్రభుత్వ మానవతా దృక్పథం లేమికి నిదర్శనం అని నాయకులు విమర్శించారు. ఇటు ప్రభుత్వం తక్షణమే మానవతా కోణంలో ఆలోచించి, నిలిచిపోయిన ఆరోగ్య బీమా పథకాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించి, జర్నలిస్టు కుటుంబాలకు భరోసా కల్పించాలని వారు కోరారు.

వృత్తి కమిటీలు, చిన్న పత్రికల రక్షణ

జర్నలిస్టుల వృత్తిపర సమస్యల పరిష్కారం కోసం, అలాగే రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్) కార్యకలాపాలలో పారదర్శకత కోసం వృత్తి కమిటీలను తక్షణమే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వీటిని ఏర్పాటు చేయడంలో జరుగుతున్న ఆలస్యం ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని స్పష్టం చేస్తోందని యూనియన్ నాయకులు ఆరోపించారు. అంతేకాకుండా, తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న చిన్న, మధ్యతరగతి పత్రికలను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించాలని, ప్రభుత్వ ప్రకటనల పంపిణీలో వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం డిసెంబర్ మూడవ తేదీలోగా స్పష్టమైన, పాలసీపరమైన నిర్ణయాలు ప్రకటించకపోతే, మహా ధర్నా ద్వారా తమ పోరాటాన్ని రాజీ లేకుండా కొనసాగిస్తామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు పునరుద్ఘాటించారు. కేవలం అసంపూర్ణ హామీలతో జర్నలిస్టులను మరోసారి మోసగించడానికి ప్రయత్నిస్తే, అది తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని, సమస్యల పరిష్కారం అయ్యేంత వరకు పోరాటం కొనసాగుతుందని యూనియన్ నాయకులు ప్రభుత్వానికి గట్టిగా హెచ్చరిక జారీ చేశారు.

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్)

తెలంగాణ ఆత్మత్యాగి శ్రీకాంతాచారి



రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుంది. శ్రీకాంతాచారి మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమర వీరుడు. నల్గొండ జిల్లా మోత్కూరు మండలం పొడిచేడు గ్రామానికి చెందిన కాసోజు వెంకటచారి, శంకరమ్మ దంపతుల పెద్ద కొడుకుగా సాధారణ కుటుంబంలో 1986 లో స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు15) రోజున జన్మించాడు. తండ్రి వెంకటచారి వ్యవసాయంతో పాటు వృత్తి పనులు చేస్తుంటాడు. అతడికి రవీంద్రాచారి అనే తమ్ముడు ఉన్నాడు. శ్రీకాంతాచారి ఆడుతూ పాడుతూ చలాకీగా ఉండేవాడు. సమాజసేవలో ముందుండేవాడు. ఎవరు సాయం కోరినా కాదనేవాడు కాదు. తాను దాచుకున్న డబ్బును పేదలు, స్నేహితుల కోసం ఖర్చు చేసేవాడు. స్థానికంగానే ప్రాథమిక విద్యను పూర్తి చేసిన శ్రీకాంత్ మోత్కూరు, నకిరేకల్ గ్రామాలలో చదివాడు. ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వెళ్లిన శ్రీకాంతాచారి తొలుత బీజేపీలో ఆ తరువాత టీఆర్ఎస్ లో క్రియాశీలక కార్యకర్తగా, విద్యార్థి నాయకుడిగా చురుకైన పాత్రను పోషించాడు. తెలంగాణ ఉద్యమ కార్యక్రమాలను ముందుండి నడిపేవాడు. సెలవులలో ఇంటికి వెళ్లినా, తెలంగాణ ధ్యాసే. తెలంగాణ ఉద్యమ సంబంధిత పాటలు పాడుతూ తెలంగాణ నినాదాలు చేస్తూ కవితలు రాస్తూ ఉండేవాడు. తెలంగాణ అతడి ఊతపదమైంది.

తెలంగాణ కోసం ప్రాణత్యాగం

ఈ క్రమంలో తెలంగాణ కోసం టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు చేపట్టిన ఆమరణ దీక్ష శ్రీకాంత్‌లో ఉద్యమావేశాన్ని నింపింది. తెలంగాణ ఉద్యమకారుల మీద ప్రభుత్వం దమనకాండ, అరెస్టులను చూసి శ్రీకాంత్ తట్టుకోలేకపోయాడు. ఆ ఉద్వేగంతో, కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో తన ఆత్మ త్యాగం తర్వాతైనా మొండి ప్రభుత్వంలో చలనం తీసుకు రావాలని కోరుతూ ఆత్మాహుతికి యత్నించాడు. 2009 నవంబరు 29న హైదరాబాద్ ఎల్బీనగర్ చౌరస్తాలో కేసీఆర్ అరెస్టుకు నిరసనగా జరిగిన ధర్నాలో ఒంటిమీద పెట్రోల్ పోసుకుని నిప్పంటించు కున్నాడు. ఉద్యమ జ్వాలను రగిల్చి అగ్నికి ఆహుతి అవుతూ 'జై తెలంగాణ' అంటూ నినదించాడు. తగిన న్యాయం చేయమంటూ అంబేద్కర్ విగ్రహాన్ని వేడుకున్నాడు. కాలిన గాయాలతో కామినేని, యశోద, ఉస్మానియాతో పాటు చివరకు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 3 డిసెంబర్ 2009 న రాత్రి 10.30 నిమిషాలకు తుదిశ్వాస విడిచాడు. ఐదు రోజుల పాటు మృత్యువుతో పోరాడుతూ కూడా తెలంగాణ స్మరణ చేశాడు. ' తాను బతికితే తెలంగాణ కోసం మళ్లీ చావడానికి అయినా' సిద్ధమన్నాడు. ఎగిసే మంటలలో తను బూడిదవుతుంటే టీవీలలో చూసిన నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గుండెలు రగిలిపోయాయి. ప్రతి ఒక్కరూ ఉద్యమానికి ఉద్యుక్తులయ్యేలా శ్రీకాంతాచారి ఉద్యమజ్వాల రగిలించాడు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసి అమరుడైన శ్రీకాంతాచారి తెలంగాణ ప్రజలందరి గుండెలలో త్యాగానికి ప్రతి రూపంగా శాశ్వతంగా నిలిచిపోయాడు.



(నేడు శ్రీకాంతాచారి వర్ధంతి)

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం





30 ఏళ్ల మురుగు సమస్యకు పరిష్కారం

- పరిశీలించి పరిష్కార చర్యలకు ఆదేశించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

ప్రతిపక్ష , సిటీబ్యూరో , డిసెంబర్ 2 : హిమాయత్‌నగర్ ఆదర్శనగర్ బస్తీ పరిసరాల్లో 30 ఏళ్ల మురుగు సమస్యను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమస్యకు గల కారణాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. మురుగు నీరు సాఫీగా వెళ్లక.. ఇళ్లలోకి పోటెత్తి బోరు బావుల్లోకి చేరడం, నాలాల్లో కలవడం వల్ల తాగు నీరు కలుషితమౌతోందని వచ్చిన ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. వందడగుల దూరంలో హుస్సేన్‌సాగర్ నాలా ఉండగా.. మురుగుతో పాటు వర్షం పడినప్పుడు వరద ముంచెత్తడానికి గల కారణాలను వాకబు చేశారు. హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహలక్ష్మి రామన్‌గౌడ్ కూడా ఈ పర్యటనలో ఉండి సమస్యను వివరించారు. హిమాయత్‌నగర్‌పై నుంచి వచ్చే మురుగు, వరద నీరు తమ ప్రాంతాలను ముంచెత్తుతోందని ఆదర్శనగర్ బస్తీ వాసులు కమిషనర్ ముందు వాపోయారు. 30 ఏళ్లుగా ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని ఫిర్యాదు చేశారు. సమస్యను బస్తీ వరకూ తీసుకు వచ్చి వదిలేయమని.. హుస్సేన్‌సాగర్ నాలా వరకూ పనులు పూర్తి స్థాయిలోనే చేపడతామని కమిషనర్ హామీ ఇవ్వడంతో వారంతా ఊరట చెందారు.

వెంటనే పనులు ప్రారంభించండి

మురుగు, వరద నీరు ఎటువైపు వాలుగా వెళ్తుందో పరిశీలించి వెంటనే పనులు మొదలు పెట్టాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. 6 మీటర్ల మేర కొన్ని పైపు లైన్లు దెబ్బతిన్నాయని.. వాటిని రీప్లేస్ చేస్తే సరిపోతుందని స్థానిక జలమండలి అధికారులు కమిషనర్‌కు వివరించారు. పై నుంచి వస్తున్న వరద, మురుగు నీటిని అంచనా వేసి.. తదనుగుణంగా పెద్ద పైపులు వేయాలని సూచించారు. నివాసాలు పెరుగుతున్నాయి.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పైపులైన్లు వేయాలన్నారు. వర్షాకాలం పూర్తయ్యింది కనుక వెంటనే ఈ పనులు చేపట్టాలన్నారు. హుస్సేన్ సాగర్ రిటైనింగ్ వాల్ కూడా 35 మీటర్ల మేర దెబ్బతినింది.. దీనిని కూడా పూర్తి చేయాలని సూచించారు. హైడ్రా డీఎఫ్‌వో యజ్ఞనారాయణ , జలమండలి డీజీఎం కృష్ణయ్య, జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్‌కుమార్, హైడ్రా ఎస్ఎఫ్వోలు పి.దత్తు, సీహెచ్ శ్రీనివాస్‌తో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

విద్యుత్ లైన్ మన్‌కు ఐదేండ్ల కఠిన కారాగార శిక్ష



- కరెంట్ షాక్ తో యువకుడి మృతి కేసులో కోర్టు తీర్పు

ప్రతిపక్షం, వికారాబాద్, డిసెంబర్ 2: వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మైలార్ దేవులపల్లి గ్రామంలో విద్యుత్ శాఖలో పనిచేసే లైన్మెన్ అబ్దుల్ జలీల్ ఎల్సి తీసుకోకుండా నిర్లక్ష్యం తో కుషారెడ్డి అనే యువకుడిని కరెంట్ పోల్ ఎక్కించాడు. దీంతో షాక్ తగిలి అతడు మరణించాడు. ఈ కేసులో వాదోపవాదనలు విన్న వికారాబాద్ జిల్లా ప్రిన్సిపల్ మరియు సెషన్స్ జడ్జి డా. ఎస్. శ్రీనివాస్ రెడ్డి నిందితునికి ఐదేండ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 25 వేల జరిమానా విధించారని ఎస్పీ స్నేహ మెహ్రా వెల్లడించారు. జరిమానా చెల్లించడంలో విఫలమైతే, నిందితుడు అదనంగా ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష అనుభవించవలసి ఉంటుంది.



రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన పవర్ లిఫ్టర్స్

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, డిసెంబర్ 2 : వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ ఓపెన్ స్టేట్ కాంపిటీషన్స్లో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ప్రతిభను కనబరిచి, మొదటి స్థానాన్ని సంపాదించిన పవర్ లిఫ్టర్స్ ను మంగళవారం బాచుపల్లి, కౌసల్య కాలనీలో కౌసల్య కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్, వెంకట్ బాడీ ఫిట్నెస్ జిమ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ పోటీలలో వెంకట్ బాడీ ఫిట్నెస్ జిమ్ మేనేజ్మెంట్ మరియు ఓనర్, కోచ్ సిహెచ్ వెంకటేష్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్ పోటీలలో 56 కేజీల కేటగిరీలో ప్రథమ స్థానాన్ని సంపాదిస్తే, వారి శిష్యురాలైన జంగా నాగ వనజా దేవి 75 కేజీల కేటగిరీలో రెండవ స్థానాన్ని పొందారు. వీరిద్దరూ తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ డెడ్ లిఫ్ట్, బెంచ్ ప్రెస్ విభాగాలకు ఎంపికయ్యారు. కౌసల్య కాలనీ నుండి జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ విభాగాలకు ఎంపిక అయినందుకు వెంకట్ ని, వనజని కౌసల్య కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అభినందిస్తూ సన్మానించడం జరిగింది.



లారీ ఢీ కొట్టడంతో డెలివరీ బాయ్ మృతి

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, డిసెంబర్ 2 : ముజఫ్ఫార్ నగర్, బీహార్ కు చెందిన అంజిత్ కుమార్ (23) బ్రతుకుతెరువు కోసం రెండు సంవత్సరాల కిందట హైదరాబాద్ కు వచ్చి, మల్లన్న కాలనీ, దేవరాయంజాల్ లో నివాసం ఉంటూ స్విగ్గి ఇన్‌స్టామార్ట్ లో డెలివరీ బాయ్ గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం సుమారు 05:30 గంటల సమయంలో గుండ్లపోచంపల్లి నుండి కొంపల్లి వైపు తన బైక్ (టీజీ 08 టి ఆర్ 2420) పై వస్తుండగా, కొంపల్లి బ్రిడ్జి సమీపంలో లారీ (ఏపీ 29 ఏటి 8062) పార్కింగ్ ఏరియా సమీపంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా రివర్స్ తీసుండగా అంజిత్ కుమార్ బైక్ ను ఢీ కొట్టగ, తీవ్ర గాయలతో అక్కడికక్కడే మృతి చెందాడు.

తుది మెరుగులు దిద్దుకుంటున్న బమృక్‌నుద్దౌలా

- పాతబస్తీకి మణిహారంగా 15 రోజుల్లో ప్రారంభానికి సన్నాహం
- అభివృద్ధి పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



ప్రతిపక్షం, సిటీబ్యూరో , డిసెంబర్ 2: పాతబస్తీకి మణిహారంగా చారిత్రక చెరువు బమృక్‌నుద్దౌలా నిలుస్తుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఆక్రమణలతో ఆనవాళ్లను కోల్పోయిన ఈ చెరువు హైడ్రా పునరుద్ధరణతో పూర్వ వైభవాన్ని సంతరించుకుందన్నారు. తుదిమెరుగులు దిద్దుకుంటూ మరో 15 రోజుల్లో ప్రారంభానికి సిద్ధమౌతున్న బమృక్‌నుద్దౌలా చెరువును హైడ్రా కమిషనర్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చుట్టూ బండ్ తో పాటు.. ఇన్‌లెట్లు, ఔట్ లెట్ల నిర్మాణాన్ని తనిఖీ చేశారు. చెరువుకు మూడు వైపులా నిర్మిస్తున్న ప్రవేశ మార్గాలను పరిశీలించారు. స్థానికంగా ఉన్నవారు సులభంగా చెరువు చెంతకు చేరేలా చూడాలని సూచించారు. నిజాంల కాలంలో ఈ చెరువుకు ఎంతో చరిత్ర ఉందని.. దానిని పునరావృతం చేసేలా.. చుట్టూ ఔషధగుణాలున్న మొక్కలతో పాటు.. చల్లటి నీడనిచ్చే చెట్లను నాటాలన్నారు. అన్ని వయసుల వారూ సులభంగా నడిచేలా వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని.., లైటింగ్ చెరువు చుట్టూ ఉండేలా చూడాలన్నారు. పిల్లల కోసం ప్లే ఏరియాలు, వృద్ధుల కోసం సీటింగ్ జోన్లు, ఓపెన్ జిమ్‌లు, పచ్చికబైళ్లు, పార్కులు వంటి సౌకర్యాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేసి.. హైడ్రా ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఇస్లామిక్ సంప్రదాయాలు ఉట్టిపడేలా

ఇక్కడ ప్రజలు వచ్చి కూర్చునేందుకు వీలుగా నిర్మిస్తున్నగుమ్మటాల (గజబోలు)తో పాటు.. ప్రవేశ గేట్లు ఇస్లామిక్ సంప్రదాయాలు ఉట్టిపడేలా అభివృద్ధి చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ చెరువును జాతి సంపదగా భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ క్రమంలోనే చెరువు ఆక్రమణలను గత ఏడాది ఆగస్టు నెలలో తొలగించినట్టు చెప్పారు. 4.12 ఎకరాలుగా మిగిలిపోయిన ఈ చెరువు ఆక్రమణలను తొలగించి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడంతో 18 ఎకరాల మేర విస్తరించడమైదన్నారు. వరద కట్టడితోపాటు.. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని హైడ్రా కమిషనర్ చెప్పారు. ఈ చెరువు ఔట్‌లెట్ నుంచి వెళ్లే నీరు కిందకు పోయేలా.. కాలువలను అంతే సామర్థ్యంతో నిర్మించాలని స్థానిక అధికారులకు సూచించారు. ఇప్పటికే రహదారుల విస్తరణతో పాటు నిర్మాణ పనులు చేపట్టామని జీహెచ్ ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి కమిషనర్‌కు వివరించారు.

హర్షం వ్యక్తం చేసిన స్థానికులు.

1770లో హైదరాబాదు మూడవ నిజాం సికందర్ జాకు ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్నుఉద్‌దౌలా నిర్మించిన బమృక్నుద్దౌలా చెరువు. ఈ చెరువులో వనమూలికల చెట్లు, కొమ్మలు వేసి.. ఆ దిగువున నిర్మించిన బావిలోకి ఔషధ గుణాలతో వచ్చిన ఊట నీటిని మాత్రమే నిజాంలు వినియోగించేవారని చరిత్రకారులు చెబుతున్నారు. అంతే కాదు.. ఈ చెరువు చుట్టు సువాసనలు వెదజల్లే పూల మొక్కలు విరివిగా ఉండేవని.. ఆ పూలన్నీ చెరువులో పడడంతో ఇక్కడి నీటిని సెంటు తయారీకి వినియోగించేవారని.. అరబ్ దేశాలకు ఇక్కడి నీరు తీసుకెళ్లే వారని కొంతమంది పేర్కొంటున్నారు. ఇలా ఎంతో చరిత్ర ఉన్న ఈ చెరువు మళ్లీ పునరుద్ధరణకు నోచుకోవడం చాలా ఆనందంగా ఉందని పలువురు సంబర పడుతున్నారు. పాతబస్తీలో ఇలాంటి అభివృద్ధి చాలా అవసరం. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించడం శుభ పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని హైడ్రా ఎంతో సమర్థవంతంగా పూర్తి చేసిందని కొనియాడారు. చారిత్రక చెరువు పునరుద్ధరణతో పాతబస్తీకి కొత్త వెలుగులు అందిస్తున్నారని కొనియాడారు.



హైడ్రా కమిషనర్ ను కలసిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్

ప్రతిపక్షం, సిటీబ్యూరో, డిసెంబర్ 2: షేక్ పెట్ లో సర్కార్ స్థలాల ఆక్రమణలపై విచారణ చేపట్టనున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. షేక్ పేట్ సర్వేనెంబర్ 327 లోని సక్కుబాయి నగర్ మ్యూచువల్లీ ఎయిడెడ్ సొసైటీ పేరుతో లేఅవుట్ వేశారు.. అక్కడ పార్కును పరిరక్షించాలని ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు రాగా క్షేత్రస్థాయిలో ఆ సంస్థ విచారణ చేపట్టింది.. ఈ క్రమంలో అక్కడ స్మశాన వాటిక చారిత్రాత్మక బుల్కాపూర్ నాలా కూడా ఆక్రమణలు కుంచించుకుపోయినట్లు అధికారులు గుర్తించి ఈ అంశంపై లోతుగా విచారణ చేపట్టాలని కమిషనర్ నిర్ణయించింది..ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ సర్వే నంబర్ 327 లోని సక్కుబాయి లేఔట్ పై సమగ్ర విచారణ జరిపి ఎలాంటి అవకతవకలు లేకుండా స్థానిక ప్రజలందరికీ న్యాయం చేకూర్చాలని హైడ్రా కమిషనర్ ను ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కోరారు.



సీఎం సహాయ నిధి ద్వారా అనేక మందికి లబ్ధి

- కొలన్ హనుమంత్ రెడ్డి

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, డిసెంబర్ 2 : ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అనేక మంది లబ్ధి పొందుతున్నారని, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయాలను సమర్థంగా వినియోగించుకోవాలని కొలన్ హనుమంత్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 129 డివిజన్ షాపూర్ నగర్ వాసులు టి. ప్రవళిక గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స సరిపడా స్థోమత లేక కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హనుమంత్ రెడ్డిని సంప్రదించారు. ఆయన స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రవళికకు రూ.2,50,000, అలాగే నిజాంపేటకు చెందిన పి.కీర్తికి రూ. 20,000 మంజూరి చేయించారు. మంజూరైన ఆర్థిక సహాయాన్ని మంగళవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చెక్కుల రూపంలో ఇద్దరు లబ్దిదారులకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాంగ్రెస్ సిద్దనోల సంజీవరెడ్డి, లక్ష్మణ్, అజాం తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

- మార్కెట్ వైస్ చైర్మన్ అలీ ఖాన్ బాబర్

ప్రతిపక్షం, షాద్ నగర్, డిసెంబర్ 2: గ్రామాలు ప్రగతి వైపు వేగంగా పయనించాలన్నా, పల్లెల్లో ఉన్న నిరుపేదలు ఉపాధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ధి చేకూరాలన్నా కాంగ్రెస్ పార్టీ ఒక్కటే ప్రత్యామ్నాయమని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, గిరిజన ఆదివాసీ కోఆర్డినేటర్ పి. రఘు నాయక్, సీనియర్ నేతలు అగ్గనూరు బస్వం, ఎండీ ఇబ్రహీంలు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గ్రామాల్లో గెలిపించుకుంటే పూర్తిస్థాయి అభివృద్ధి గ్రామాల్లో జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, దీంతో కాంగ్రెస్ పార్గీ వారిని గెలిపిస్తే గ్రామాల అభివృద్ధి, ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రతిపక్షం పార్టీలకు చెందిన వారిని గెలిపించుకుంటే ఎలాంటి అభివృద్ధి ఉండదని, గ్రామ ప్రజలకు ప్రభుత్వ పథకాలు సైతం అందవన్న విషయాన్ని గ్రామస్తులు గ్రహించాలని వారు కోరారు. గ్రామీణ ప్రజలు ఆలోచించి కాంగ్రెస్ మద్దతుదారులైన సర్పంచ్లను గెలిపిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ దిశగా ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థులకు ఘనవిజయాన్ని అందించాలని ఈ సందర్భంగా వారు కోరారు. గ్రామీణ స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే ప్రభుత్వ సహాయ సహకారాలు ఎంతగానో అందుతాయని అదేవిధంగా గ్రామాలు బాగుపడే ప్రసక్తి ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంగనూరు బస్వం మహమ్మద్ ఇబ్రహీం తదితరులు ఉన్నారు



తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ప్రతిపక్షం, సికింద్రాబాద్, డిసెంబరు 2: పది రోజుల్లో త్రాగునీటి సమస్య పరిష్కరిస్తామని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన బన్సీలాల్ పేట డివిజన్ లోని బండ మైసమ్మ నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సి బ్లాక్ లో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నదని తెలిపారు. అంతేకాకుండా ఇక్కడ మొత్తం 266 కుటుంబాలు ఉండగా ఒక్క సంప్ మాత్రమే ఉన్నదని, అదనంగా మరో సంప్ నిర్మించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ నీటి సరఫరా లో జరుగుతున్న ఇబ్బందులను గుర్తించి 10 రోజుల్లోగా సమస్య శాశ్వత పరిష్కారం చూపాలని వాటర్ వర్క్స్ జీఎం వినోద్ ను ఆదేశించారు. అదేవిధంగా అదనపు సంప్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ నివసించే వారు అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా త్వరితగతిన సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. షాపుల ద్వారా వచ్చే ఆదాయాన్ని కమిటీ ఖాతాలో జమచేసి నిర్వహణ కోసం వినియోగించాలని అన్నారు. మిగిలిన ఇండ్లను కూడా లబ్ధిదారులకు అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని కోరగా, తాను ఈ విషయమై ఇప్పటికే కలెక్టర్ కు లేఖ వ్రాయడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ కుర్మ హేమలత, డిసు డాకు నాయక్, ఇఇ సుబ్రమణ్యం, వాటర్ వర్క్స్ జియం వినోద్, హౌసింగ్ డిఇ సంధ్య, డబుల్ బెడ్ రూమ్ వాసులు రాజ్ కుమార్, రాజు, నర్సింగ్, రుక్కుద్దీన్, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ప్రేమ్ కుమార్, లక్ష్మీపతి, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రస్తుతం ఉన్న జనరేషన్‌కు పెళ్లి గురించి సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. నేటి తరం పిల్లలకు మనం సలహాలు ఇవ్వలేం. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. పిల్లలు చాలా తెలివిగా ఉంటున్నారు, అన్ని విషయాల్లో మనల్ని మించిపోయారు. అలాగే పెళ్లంటే ఇలానే ఉండాలి అని చెప్పడానికి సరైన నిర్వచనాలు లేవు. ఒకరికొకరు కష్టసుఖాల్లో తోడుండాలంతే.

- సీనియర్ బాలీవుడ్ నటి జయా బచ్చన్

ప్రాంతీయం



అనుకూలంగా ఉండే మిల్లర్లకు మాత్రమే ధాన్యం కేటాయింపు

- **జిల్లా సివిల్ సప్లయ్ అధికారిపై లోకా యుక్తలో రాచాల ఫిర్యాదు**

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 2: తనకు అనుకూలంగా ఉండే మిల్లర్లకు మాత్రమే ధాన్యం కేటాయిస్తూ... నిబంధనలను పాటిస్తున్న మిల్లులకు మాత్రం బియ్యం కేటాయించకుండా జిల్లా సివిల్ సప్లయ్ అధికారి.విశ్వనాథ్ వివక్ష చూపుతున్నారని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మెన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ఆరోపించారు.మంగళవారం ఆయన వనపర్తి జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కాశీ విశ్వనాథ్ పై బషీర్ బాగ్ లోని రాష్ట్ర లోకా యుక్తలో ఫిర్యాదు చేశారు.అనంతరం రాచాల యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ... జిల్లాలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారిపై ఆధారాలతో సహా లోకాయుక్త లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.యంత్రాలు, విద్యుత్ కనెక్షన్ లేని రైస్ మిల్లులకు సైతం బియ్యాన్ని కేటాయించడంతో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కాశీ విశ్వనాథ్ పై ఏప్రిల్ నెలలో జిల్లా కలెక్టర్ , విజిలెన్స్ డిజి , సివిల్ సప్లయ్ కమిషనర్ కు కూడా ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ ఆయన పై ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు.తనకు అనుకూలంగా ఉండే మిల్లర్లకు మాత్రమే ధాన్యం కేటాయిస్తూ...నిబంధనలను పాటిస్తున్న మిల్లులకు బియ్యం కేటాయించకుండా వివక్ష చూపుతున్నారని ఆరోపించారు.అధికారి అవినీతికి సహకరిస్తున్న ఉన్నతాధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరినట్లు తెలిపారు.కొంత మంది అధికారుల చర్యల కారణంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న అలాంటి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని రాచాల కోరారు.ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు గాలిగల్ల సాయిబాబా, చింటు తదితరులు ఉన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 2 : మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2023 లో జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడైన ఆమె భర్త మహ్మద్ హుస్సేన్ (60) కు కోర్టు జీవిత ఖైదు, రూ.500 జరిమానా కూడా విధించిందని సైబరాబాద్ క్రైమ్స్ డిసిపి ఎ. ముత్యంరెడ్డి తెలిపారు.డిసిపి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ కేసు క్రైమ్ నెం.73/2023, సెక్షన్ 302 ఐపిసి మేరకు నమోదు కాగా, ఎస్.సీ నంబర్ .598/2023 పై తీర్పు వెలువడిందన్నారు.20022023న ఫిర్యాదురాలు సఫియా బేగం తన మరదలు హుస్సేన్‌బీతో కలిసి ఆస్పత్రి నుండి ఇంటికి చేరుకున్న తర్వాత ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న నిందితుడు హుస్సేన్, తన భార్య హుస్సైన్‌బీ వద్ద మద్యం తాగడానికి రూ.80 అడిగాడు. డబ్బుల్లేవని ఆమె చెప్పడంతో కోపోద్రిక్తుడైన నిందితుడు కర్రతో తన భార్య హుస్సైన్‌బీ యొక్క కాలు పై కొట్టుచుండగా, అడ్డుకునేందుకు వచ్చిన ఫిర్యాదురాలైన సఫియా బేగంను తోసివేశాడు. తర్వాత భార్య హుస్సైన్‌బీని గుడిసెలోకి లాగి తీసుకెళ్ళి, మోర్టార్ రాయి తీసుకుని ఛాతిపై, ముఖంపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు.ఫిర్యాదురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొయినాబాద్ ఇన్ స్పెక్టర్ డీ.కే. లక్ష్మీ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు సేకరించి, మరుసటి రోజు 21022023న నిందితుడిని అరెస్టు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపించామన్నారు. అనంతరం చార్జ్‌షీట్‌ను దాఖలు చేశామని తెలిపారు.వాదనలు, సాక్ష్యాధారాల పరిశీలన పూర్తయ్యాక ఎల్.బీ.నగర్‌లోని 8 అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి నిందితుడైన మహ్మద్ హుస్సేన్‌కు జీవిత ఖైదు శిక్షను ఖరారు చేశారని తెలిపారు.

ప్రశాంతంగా కొనసాగిన నామినేషన్ ప్రక్రియ

- **సర్పంచ్ నామినేషన్లు 107 దాఖలు**
- **వార్డు సభ్యుల నామినేషన్ 364 దాఖలు**



ప్రతిపక్షం , మొయినాబాద్, డిసెంబర్ 1 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్లు రెండో రోజు ప్రశాంతంగా కొనసాగింది. మండలంలో 19 గ్రామ పంచాయతీలకు 104 సర్పంచ్ నామినేషన్లు దాఖలయ్యాయి. అదేవిధంగా 166 వార్డు సభ్యులకు 364 నామినేషన్ దాఖలు అయ్యాయని మండల అభివృద్ధి అధికారిని సంధ్య వెల్లడించారు.



గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- **కనకమామిడి గ్రామ సర్పంచ్ అభ్యర్థి మర్రి గీత రవీందర్ రెడ్డి**

మొయినాబాద్, ప్రతిపక్షం, డిసెంబర్ 2: కనకమామిడి గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చదిద్దుతానని తనను సర్పంచ్ గెలిపించాలని కనకమామిడి గ్రామ సర్పంచ్ అభ్యర్థి మర్రి గీత రవీందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ.. తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను గ్రామస్థులందరికి అందే విధంగా కృషి చేస్తానని చెబుతున్నారు. గ్రామంలోని యువతకు ఉపాది కల్పించేందుకు కృషి చేస్తానవి. పేర్కొన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కరించేందుకు పని చేస్తానన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే గ్రామ రూపురేఖలు మారుస్తానని చెప్పారు.

డీపీఆర్ లేని పథకాన్ని ఏ విధంగా పూర్తి చేస్తారు?

- **కమిషన్లు దండుకోవడానికే మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం**
- **మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి**



ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, డిసెంబర్ 2: డీపీఆర్ లేని మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ఏ విధంగా పూర్తి చేస్తారని నారాయణపేట జిల్లా అన్నారు. పట్టణ కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమిషన్లు దండుకోవడానికి మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ప్రారంభించారని. ఇప్పటి వరకు డీపీఆర్ కూడా లేదని ముందు 1600 కోట్లు అని ఇప్పుడు రెండువేల ఎనిమిది వందల కోట్లు అని తరువాత 4200 కోట్లని ఇప్పుడేమో 5400 కోట్లకు ప్రాజెక్టును ప్రారంభించామన్నారని అన్నారు. ఈ ప్రాజెక్టుపై ఇప్పటివరకు ఎన్ని డబ్బులు డ్రా చేసింద్రు ప్రజలకు చెప్పాలని బిల్లులు మాత్రం తీసుకొని కమిషన్ల డబ్బులు తీసుకున్నారని ఇక్కడ ఉన్న మంత్రి మాట్లాడుతూ ఒక్క లక్ష ఇరవై ఐదు వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చామని అనడం అస్యాస్పదమని ఎస్ రాజేందర్ రెడ్డి అన్నారు. ఇలా ఎన్ని రోజులు అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని కాంగ్రెస్ నాయకులను ఆయన హెచ్చరించారు. ఇప్పటి వరకు జిల్లాల్లో ఉన్న ప్రాజెక్టులలో తట్టెడు మన్ను కూడా తీయలేదని ఒకటి మాత్రం వాస్తవం అని మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంపై కమిషన్ల రూపంలో 700 నుంచి 800 కోట్ల రూపాయలు డ్రా చేసుకున్నారని కల్వకుర్తి నెట్టెంపాడు బీమా కోయిల్ సాగర్ జూరాల ఈ ప్రాజెక్టుల ఆయకట్టును ఏమన్నా పెంచిండ్రా ప్రజలకు చెప్పాలని ముఖ్యమంత్రి ఎడ్యుకేషను ఇరిగేషన్ అని మాట్లాడుతున్నాడు గత 10 సంవత్సరాలలో గురుకులాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారో ఈ రెండు సంవత్సరాలలో ఎన్ని ఇంతమంది విద్యార్థులు ఉన్నారొ ముఖ్యమంత్రి చెప్పాలని తెలంగాణలో వందమంది విద్యార్థులు చనిపోతే అడిగే నాధుడే లేడని పురుగుల అన్నంతో విద్యార్థుల అవస్థ పడుతున్నారని గురుకుల పాఠశాలలో మూతపడి టీచర్ ఉద్యోగాలు లేక గురుకులాల బిల్లులు కట్టక తాళాలు వేసి మూతపడ్డాయి అన్నారు. నారాయణపేటకు అగ్రికల్చర్ కాలేజీ తీసుకొని వస్తే ఆ కాలేజీ ని వనపర్తిలో పెట్టిన మాట వాస్తవం కాదని ఆయన హెచ్చరించారు. ముందు ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని వరి కొనుగోలు కేంద్రాలు లేక రైతులు అవస్థ పడుతున్నారని నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు నారాయణపేట జిల్లాలో ఎన్ని రోడ్లు వేశారని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని తెచ్చింది కేసీఆర్ అని పాలమూరుకు నీళ్లు వస్తే కాంగ్రెస్ వాళ్ల కళ్ళకు నీళ్లు వస్తున్నాయని ఒక మంత్రి మాట్లాడుతూ ఆయన ఆర్ అండ్ బి మినిస్టర్ అని అనల సివిల్ సప్లై మినిస్టర్ అని అనాలన మాకు అర్థం కావడం లేదని ఇప్పటివరకు రాష్ట్రంలో పెన్షన్లు ఎందుకు పెంచలేదని గత ప్రభుత్వంలో ఇచ్చిన 2000 పెన్షన్లనే కొనసాగిస్తున్నారని రేషన్ కార్డులు ఇచ్చింది గత ప్రభుత్వమని ఆరు గ్యారంటీలు, 425 హామీలు అమలు చేయకుండా విజయోత్సవ సంబరాలు ఏ విధంగా జరుపుకుంటారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిట్టెం సుచరిత రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిన్న అనుమంతు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ అన్వర్, నరసింహారెడ్డి, జుట్ల సాగర్ తదితరులు పాల్గొన్నారు.



నేటి నుండి మూడవ విడత నామినేషన్ల స్వీకరణ

- **అన్ని ఏర్పాట్లు పూర్తి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 2: పంచాయతీ మూడవ విడత నామినేషన్ల స్వీకరణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మొదటి, రెండవ విడతలలో 17 మండలాలలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల షెడ్యూల్‌ను అనుసరిస్తూ సజావుగా పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ నెల 3 నుండి 5వ తేదీ వరకు మూడవ విడతగా కల్హేర్, కంగ్టి ,మనూరు, నాగల్ గిద్ద, నారాయణఖేడ్, నిజాంపేట్, సిర్గాపూర్, న్యాల్కల్ మండలాల పరిధిలోని 234 గ్రామ పంచాయతీలు,1960 వార్డు స్థానాలకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చనితెలిపారు. డిసెంబర్ 05 చివరి తేదీ అని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సాఫీగా జరిగేలా అన్ని వర్గాల వారు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.



అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాలి

- **ముత్తంగిలో మూడు కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 2 : అభివృద్ధి కార్యక్రమాల అంశంలో పరిశ్రమలు తమ సామాజిక సేవ పథకం ద్వారా మరిన్ని నిధులు కేటాయించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగిలో శాండ్విక్ పరిశ్రమ సౌజన్యంతో కోటి రూపాయలతో చేపట్టిన ఆర్వో వాటర్ ఏటీఎం, బయో కంపోసిట్ కేంద్రం, అంగన్వాడి ప్రాథమిక పాఠశాలలపై ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్, సోలార్ స్ట్రీట్ లైట్స్, ఎలక్ట్రిక్ చెత్త సేకరణ ఆటోలను ఆయన ప్రారంభించారు. అనంతరం ముత్తంగి డిఎస్ కాలనీ నుండి పాశమైలారం 100 ఫీట్ల రహదారి వరకు రెండు కోట్ల పది లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సిసి మరియు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముత్తంగి అభివృద్ధి కోసం శాండ్విక్ పరిశ్రమ అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. రాబోయే రోజుల్లో గ్రామ అభివృద్ధి కోసం మరిన్ని నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అందించే నిధులతోపాటు నియోజకవర్గంలోని వివిధ పరిశ్రమల సిఎస్ఆర్ నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల మధ్య మెరుగైన రవాణా సౌకర్యం అందించేందుకు అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ అజయ్ రెడ్డి, శాండ్విక్ పరిశ్రమ సిఎస్ఆర్ రెడ్డి రవి అరోరా, సీనియర్ నాయకులు శ్రీనివాస్, శ్రీనివాస రెడ్డి, మేరాజ్ ఖాన్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కాలనీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా

- **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

ప్రతిపక్షం , సిటీబ్యూరో , డిసెంబర్ 2 : కాలనీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా డివిజన్ పరిధిలోని శ్రీ సాయి శివనగర్ లో 90 లక్ష రూపాయల నిధులతో చేపట్టిన రోడ్డు పనులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎన్నో యేండ్ల నుండి తమ కాలనీ కి రోడ్డు లేక నరకయాతన పడుతున్నాం అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రోడ్డు మంజూరు చేయడం అభినందనీయం అని వారు తెలిపారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్ కాలనీ వాసులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలి

- **మేడ్చల్ ట్రాఫిక్ సిఐ మధుసూదన్**



ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, డిసెంబర్ 2: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే ప్రమాదాలు జరుగుతాయని మేడ్చల్ ట్రాఫిక్ సిఐ మధుసూదన్ అన్నారు. మేడ్చల్ పట్టణంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలో పౌరుల ప్రయోజనం కొరకు ఏర్పాటు చేయబడినవని వాహనదారులు, కాలినడకన వెళ్లే వారికి ప్రమాదాలు జరగకుండా నిబంధనలు రూపొందించబడ్డాయని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయని వివరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ మధుసూదన్ విద్యార్థులకు స్పష్టంగా అర్థమయ్యేందుకు ప్రొజెక్టర్ పై పలు ప్రమాదాలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించి విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ పరశురాం, కళాశాల కరస్పాండెంట్ కమలాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ దేవరాజ్, డైరెక్టర్ లు గణేష్, సత్యనారాయణ, అధ్యాపకులు విద్యార్థులు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



ఐపీఎల్-2026 వేలంలో నేను పాల్గొనట్లేదు. ఈ ఏడాది వేలంలో పాల్గొనకూడదని నిర్ణయించుకున్నా. ఐపీఎల్ తనను క్రికెటర్‌గా, వ్యక్తిగా తీర్చిదిద్దింది. వరల్డ్ క్లాస్ టీమ్‌మేట్స్, ఫ్రాంచైజీలతో పనిచేయడం తన అదృష్టమని, ఏళ్లుగా మద్దతిచ్చిన అభిమానులకు ధన్యవాదాలు చెప్పారు. త్వరలో అభిమానులను కలుస్తా.

- ఆస్ట్రేలియన్ క్రికెటర్ మ్యాక్స్‌వెల్

పంచాయతీ ఎన్నికలపై మంత్రి వివేక్ ప్రత్యేక దృష్టి

- నాయకుల, కార్యకర్తల అభిప్రాయాల సేకరణ
- గెలుపు గుర్రాలకే మద్దతు



ప్రతిపక్షం బ్యూరో, మంచిర్యాల, డిసెంబర్ 2: పంచాయతీ ఎన్నికలపై రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన గనులశాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి ప్రత్యేక దృష్టి సారించారు. దీనిలో భాగంగా గెలుపు గుర్రాలకే మద్దతిచ్చేందుకు ఆయన ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో 102 గ్రామ పంచాయతీలు ఉండగా సుమారు పంచాయతీలు గెలుపే లక్ష్యంగా వ్యూహ రచన చేస్తున్నారు. ఆశావహుల జాబితాను పరిశీలిస్తున్నారు. నాయకుల, కార్యకర్తల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. చేరికలపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలుస్తుంది. మెజార్టీ పంచాయతీలు గెలువడం ద్వార రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆయన విజయానికి సులువుగా ఉంటుందని ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఆయన చెన్నూర్, బీమారం, జైపూర్, మందమర్రి, కోటపల్లి మండలాలకు సంబంధించి నాయకులతో కార్యకర్తలతో విడివిడిగా సమావేశమయ్యారు. ఈ నియోజకవర్గ విషయాన్ని పక్కన పెడితే మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా మెజార్టీ స్థానాలను గెలిపించాలని ప్రణాళికలు చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా తీసుకెళ్లి పంచాయతీలో గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆయన నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష బీఆర్ ఎస్ పార్టీ పని అయిపోతుందని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుంభకోణాల వల్ల రాష్టంలో ఆర్థిక పరిస్థితి దివాల తీసిందనే విషయాలను తెలుపుతూ ఆ పార్టీ బలపరిచిన అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించాలని మంత్రి కోరుతున్నారు.

కాంగ్రెస్ మోసాన్ని ఎండగడుతూ ఓట్ల నడగాలి



ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 2: కాంగ్రెస్ మోసాన్ని ఎండగడుతూ, బీఆర్ఎస్ పార్టీ సంక్షేమాన్ని గుర్తు చేస్తూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లాలని తెలంగాణ స్టేట్ బీఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ ఫౌండేషన్ చైర్మన్ జుబైర్ పాషా అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు సోపానం అన్నారు. పదేళ్ళలో కేసీఆర్ చేసిన అభివృధి సంక్షేమ పథకాలే మన అభ్యర్థులను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. రెండేళ్ల నుండి కాంగ్రెస్ పాలనలో పల్లెల్లోని ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోయామని ప్రజలు స్పష్టమైన అవగాహనతో ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టే ధైర్యం లేక ఇన్ని రోజులు కాలయాపన చేసిందని ఎద్దేవా చేశారు.



నామినేషన్ ప్రక్రియ పరిశీలన

- రాష్ట్ర ఎన్నికల పరిశీలకురాలు భారతీ లక్పతి నాయక్

చేగుంట, ప్రతిపక్షం, డిసెంబర్ 2: నామినేషన్ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు భారతి కల్పతి నాయక్ పరిశీలించారు. చేగుంట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో చివరి రోజు కొనసాగుతున్న నామినేషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ వార్డు సభ్యుల నామినేషన్లను రోజువారీ రికార్డులో పొందుపరిచాలన్నారు. ఆమినేషన్లు వేసిన వారి వివరాలను ఆన్లైన్లో ద్వారా వేగవంతంగా అప్లోడ్ చేయాలని ఆమె సూచించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించ రాదని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పి నరేందర్ గౌడ్, ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసిల్దార్ శివ ప్రసాద్, చేగుంట ఎస్సై చైతన్య రెడ్డి పాల్గొన్నారు.



గ్రామాభివృద్ధే ధ్యేయం

- సర్పంచ్ అభ్యర్థి మహేశ్వరి దేవరాజు

ప్రతిపక్షం, మిడిదొడ్డి, డిసెంబర్ 2: మిడిదొడ్డి మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్న మహేశ్వరి దేవరాజు గ్రామాభివృద్ధే ధ్యేయం అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు విశ్వసించి తనకు ఆశీర్వాదం చేస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ఇంకా పరిష్కారం కావాల్సిన అనేక మౌలిక వసతుల సమస్యలు ఉన్నాయని, ఎన్నికైన వెంటనే రహదారుల అభివృద్ధి, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు ప్రాధాన్యతనిస్తానని అన్నారు. రైతులకు అవసరమైన సహాయం అందించేలా వ్యవసాయ సంబంధిత చర్యలు, పేద కుటుంబాల కోసం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని అభ్యర్థి తెలిపారు. అంతకుముందు తొగుట మండలం పెద్ద మాసాన్ పల్లి ఎల్లమ్మ తల్లి, మిడిదొడ్డి మండల కేంద్రంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పర్యటనలో పాల్గొన్నారు.



సర్పంచ్ పదవికి గంగిరెద్దుల మహిళ నామినేషన్

ప్రతిపక్షం, నంగునూరు, డిసెంబర్ 2: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ముండ్రాయి గ్రామ సర్పంచ్ పదవికి గంగిరెద్దుల సామాజిక వర్గానికి జిడ్డి చామంతి మంగళవారం తమ నామినేషన్ వేశారు. ముండ్రాయి గ్రామ సర్పంచ్ పదవి బీసీ మహిళ కేటగిరీకి రిజర్వు అయ్యింది. ముండ్రాయి గ్రామ పరిధిలోని గంగిరెద్దుల కాలనీకి చెందిన జిడ్డి చామంతి గ్రామ ప్రజలు, గంగిరెద్దుల సంఘం నాయకులు, యువకులు, విద్యార్థులు మేధావుల మద్దతుతో సర్పంచి పదవికి పోటీకి దిగారు. మంగళవారం గ్రామస్తులతో కలిసి సిద్దిపేట హనుమకొండ రహదారిపై ముండ్రాయి స్టేజి వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం మద్దతుదారులతో కలిసి పాలమాకులలోని గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో గంగిరెద్దుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకయ్య, మెండె మల్లేశం, జిడ్డి సారయ్య, గంగిరెద్దుల సంఘం రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల తనిఖీల్లో రూ. 30 లక్షలు స్వాధీనం



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 2:- గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాలను తనిఖీ చేయడం జరుగుతుందని, అందులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం మక్కరాజీపేట్ జంక్షన్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ తనిఖీల సందర్భంగా భారీ మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై చైతన్య రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.దాచారం గ్రామం, గజ్వేల్ మండలానికి చెందిన దంపతులు గుండెల్లి శిరీష, యాదగిరి ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా, వారి వద్ద ఉన్న సరైన పత్రాలు లేని రూ. 30,59,500 నగదును పోలీసులు గుర్తించారు. నగదు గురించి స్పష్టమైన వివరణ ఇవ్వకపోవడంతో, ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసు నమోదు చేసి, స్వాధీనం చేసిన నగదును తదుపరి విచారణ కోసం సంబంధిత అధికారులకు అప్పగించారు. ఎన్నికల సమయంలో అక్రమ నగదు రవాణా, ఓటర్లను ప్రలోభపరచే ప్రయత్నాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన తనిఖీలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. అత్యవసరం అనుకుంటే పెళ్లిళ్లగానే ఏదైనా పండుగ గాని డబ్బులు తీసుకెళ్లాలని కంటే 50 వేలకు మించి తీసుకపోరాదని పోలీసులు తెలిపారు.

ఎన్నికల్లో మద్దతు ఇవ్వడం లేదని ఆత్మహత్యాయత్నం

ప్రతిపక్షం, నంగునూరు, డిసెంబర్ 2: తన కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు తనకు మద్దతు ఇవ్వడం లేదని మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైనమిది. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మండలం ఘనపురం గ్రామంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం ఘనపురం గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గణపురం ఎల్లయ్య ఘనపురం సర్పంచ్ పదవికి నామినేషన్ వేశాడు. సర్పంచ్ గా పోటీ చేస్తున్న తనకు కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు మద్దతు ఇవ్వకుండా ప్రత్యర్థికి మద్దతు ఇస్తున్నారని ఎల్లయ్య మనస్తాపానికి గురయ్యాడు. తీవ్ర మనస్థాపంతో తన సోదరుని ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి సిద్దిపేటలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.



హరీష్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు

ప్రతిపక్షం, గజ్వేల్ (కుక్కునూరు పల్లి), డిసెంబర్ 2: మండల పరిధిలోని రాయవరం గ్రామంలో మంగళవారం రోజు బీఆర్ఎస్ పార్టీలోకి రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సమక్షంలో భారీ ఎత్తున చేరికలు జరిగాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన తాజా మాజీ ఉప సర్పంచ్ గుర్ర మహేందర్, కమ్మరి రవి, బీఎస్పీ మండల అధ్యక్షుడు బక్కోళ్ల కర్ణాకర్, రాయవరం గ్రామ బీఎస్పీ విలేజ్ ప్రెసిడెంట్ ఎడబాట్ల రాజు, గుర్ర పరశురాములు, గ్రామ వైస్ ప్రెసిడెంట్ పెర్క రంగస్వామి, రాగం అనిల్, రసం కార్తీక్ తో పాటు పలువురు యువజన నాయకులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గం పార్టీ ఇంచార్జ్ వటేరు ప్రతాప్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు దేవి రవీందర్, రాయవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు దేవి శ్రీశైలం పాల్గొన్నారు.



7న 'కలవార' పుస్తకావిష్కరణ సభ

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, డిసెంబర్ 2: తెలంగాణ రచయితల వేదిక సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో కవి మహమూద్ పాషా రచించిన "కలవార" కవిత్వ సంకలనం పుస్తకావిష్కరణ ఈ నెల 7న నిర్వహి స్తున్నట్లు తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి తెలిపారు. తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్కపెల్లి యాదగిరి, జిల్లా అధ్యక్షుడు మహమూద్ పాషా, ప్రధాన కార్యదర్శి స్రవంతి మహిపాల్, పప్పుల రాజిరెడ్డి, అంకూరి ఉమాశంకర్, ఏసురాజు, మోర మోహన్ తదితరులతో కలిసి మంగళ వారం పుస్తకావిష్కరణకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈనెల 7వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించే పుస్తకావిష్కరణ సభలో కొత్త కవిత్వ ధోరణులు, సాహిత్య సృజన, సమకాలీన కవిత్వం వంటి అంశాలపై చర్చ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.



సైబర్ నేరాలపై అవగాహన

- ఐటీ ఉద్యోగి వంశీకి మొదటి బహుమతి

ప్రతిపక్షం బ్యూరో , సిద్దిపేట, డిసెంబర్ 2: సైబర్ క్రైమ్ భారిన పడకుండా, సైబర్ ఫ్రాడ్ నివారణ కోసం పోలీసులు ప్రజలకు అవగహన కల్పిస్తున్నారు. సిద్దిపేట పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ఐటీ ఉద్యోగులకు, ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో నాగులబండ ఐటీ టవర్ లోని వోల్టా రైడ్ ఐటీ ఉద్యోగి తమన్నబోయిన వంశీ ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి బహుమతి గెలుచుకోగా, రెండవ స్థానంలో షేక్ సలీం నిలవడంతో వారిని సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్ ప్రశంసాపత్రం, మొమెంటోలు అందజేసి అభినందించారు. సైబర్ క్రైమ్ భారిన పడకుండా ప్రజలకు అవగహన కల్పించాలని ఐటీ ఉద్యోగులకు ఏసీపీ సూచించారు. కార్యక్రమంలో పలువురు ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీరో టిల్లేజ్ ప్రొద్దుతిరుగుడు సాగుపై అవగాహన



ప్రతిపక్షం తొగుట, డిసెంబర్ 2: తొగుట మండలంలోని గుడికందుల గ్రామంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జీరో టిల్లేజ్ పద్ధతిలో ప్రొద్దుతిరుగుడు సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం శాస్త్రవేత్త పల్లవి జీరో టిల్లేజ్ పద్ధతి, పంట వైవిధ్యీకరణ ప్రాముఖ్యత, ప్రొద్దుతిరుగుడు పంట యాజమాన్యంపై రైతులకు విపులంగా వివరించారు. తెలంగాణలో నీటి వసతి మెరుగు పడడంతో వానాకాలం, యాసంగి రెండూ వరి సాగుకు సాగర్ ప్రాధాన్యం పెరిగిందని, వరుసగా వరి పంటలు సాగు చేయడం వల్ల చౌడు నేలలు, మురుగు నీటి నిల్వ, చీడపీడలు, తెగుళ్ల పెరుగుదల వంటి సమస్యలు వస్తున్నాయని ఆమె అన్నారు. ఈ పరిస్థితుల్లో పంట వైవిధ్యీకరణ అత్యవసరమని సూచించారు. వానాకాలం వరికి ప్రత్యామ్నాయంగా యాసంగిలో ప్రొద్దుతిరుగుడు పంటను తీసుకోవడం ద్వారా భూసారం పెరగడంతో పాటు ఎరువుల వినియోగం, చీడపీడల ఉధృతి, సాగు ఖర్చు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. ప్రొద్దుతిరుగుడు పంట తక్కువ కాలంలో పెరిగే సామర్థ్యంతో ఏ సీజన్‌లోనైనా సాగు చేయడానికి అనుకూలమని, వానాకాలం వరి కోత అనంతరం నవంబర్-డిసెంబర్ నెలల్లో జీరో టిల్లేజ్ పద్ధతిలో సులభంగా విత్తుకోవచ్చని వెల్లడించారు. విత్తన శుద్ధి, సరైన రకాల ఎంపిక, కలుపు నివారణ, ఎరువుల యాజమాన్యం, నీటి వినియోగం, సస్య రక్షణ వంటి అంశాలను పల్లవి గారు ప్రాముఖ్యతగా వివరించారు. ముఖ్యంగా నెక్రోసిస్ వైరస్, ఆల్టర్నేరియా ఆకుమచ్చ, బూడిద తెగులు వంటి సమస్యలకు సమర్థవంతమైన నివారణ చర్యలపై రైతులకు ప్రాయోగిక సూచనలు అందించారు. జీరో టిల్లేజ్ పద్ధతిలో సాగు చేసిన ప్రొద్దుతిరుగుడు పంట ద్వారా ఎకరాకు 8-9 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధ్యమవుతుందని, సాగు ఖర్చు సుమారు రూ.17,000-18,000 మాత్రమే అవుతుందని తెలిపారు. ప్రస్తుత మద్దతు ధరల ప్రకారం రైతులు ఎకరాకు రూ.35,000-40,000 వరకు నికరాదాయం పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. యాసంగి వరితో పోలిస్తే ఈ పద్ధతిలో ప్రొద్దుతిరుగుడు సాగు చేసేటప్పుడు పంట కాలం నెలరోజులు తగ్గడం వల్ల కూలీల ఖర్చు, ఎరువుల ఖర్చు రూ.4,500-5,000 వరకు తగ్గుతుందని, తక్కువ నీటితో అధిక దిగుబడిని పొందవచ్చని వివరించారు. నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా అదనంగా రూ.8,000-10,000 వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు జీరో టిల్లేజ్ ప్రొద్దుతిరుగుడు సాగుపై ఆసక్తిని వ్యక్తం చేసి, కొత్త పద్ధతులు తమకు ఎంతో తోడ్పడతాయని అభిప్రాయపడ్డారు.

డాక్టరేట్ అందుకున్న విద్యావేత్త థామస్



ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, డిసెంబర్ 2: ఉన్నత విలువలతో కూడిన ఉత్తమ విద్యను బోధిస్తూ.. పేద విద్యార్థుల్లో అక్షరజ్యోతులను వెలిగిస్తున్న విద్యావేత్త థామస్ను డాక్టరేట్ వరించింది. థామస్ సిద్దిపేట గాయత్రి హైస్కూల్ ప్రిన్సిపల్, విద్యావేత్తగా దక్షిణ భారతదేశంలో గొప్పవిద్యాసంస్థల్లో గత 30 సంవత్సరాలుగా సేవలందిస్తూ పేద విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. విద్యాభివృద్ధికి థామస్ చేస్తున్న సేవల గాను ఏషియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ మణిపూర్ వారు సముచితంగా గౌరవించి ఆయనకు మంగళవారం డాక్టరేట్ ప్రధానం చేసి సత్కరించింది. థామస్ పురస్కారం అందుకున్న సందర్భంగా విద్యా సంస్థల యజమాన్యాలు, విద్యావేత్తలు ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు. అంతకుముందు ఉపాధ్యాయులు విద్యార్థులు ఆయనను ఘనంగా సన్మానించారు.



కాంతార ఛాప్టర్-1 చిత్రంలో రిషబ్ అద్భుతమైన నటనను హైలైట్ చేయడం మాత్రమే నా ఉద్దేశం. ఎలాంటి దురుద్దేశం లేదు. అలాంటి సీన్ చేయడం ఎంత కష్టమో ఓ నటుడిగా నాకు తెలుసు. ప్రతి సంస్కృతి, సంప్రదాయాన్ని నేను గౌరవిస్తా. ఎవరి మనోభావాలనైనా దెబ్బతీసి ఉంటే క్షమాపణలు కోరుతున్నా.

- బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్

ప్రాంతీయం



సిద్ధిపేట యువ ప్రతిభ 'కీర్తన'కు ఘన సన్మానం

- అంతర్జాతీయ వేడుకల్లో రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు

ప్రతిపక్షం, సిద్దిపేట, డిసెంబర్ 2: సత్య సాయి బాబా శతజయంతి జన్మదినోత్సవాల సందర్భంగా కర్ణాటక లో జరిగిన అంతర్జాతీయ వేడుకల్లో రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించిన సిద్దిపేట యువతి మంతూరి కీర్తనను సిద్దిపేట ప్రెస్ క్లబ్లో గజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆగస్టు 16 నుంచి నవంబర్ 23 వరకు 100 రోజులపాటు 100 దేశాల కళాకారులు పాల్గొన్న 'వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ కల్చరల్ ఫెస్టివల్' ప్రపంచంలోనే అతి దీర్ఘ సాంస్కృతికోత్సవంగా గిన్నిస్ రికార్డు సృష్టించింది. అలాగే 65కు పైగా దేశాల సంగీత విద్వాంసులు, విద్యార్థులతో నిర్వహించిన 'సాయి సింఫనీ వరల్డ్ ఆర్కెస్ట్రా' అత్యధిక జాతీయతలతో కూడిన ఆర్కెస్ట్రాగా మరో గిన్నిస్ రికార్డు నమోదు చేసింది. ఈ రెండు కార్యక్రమాల్లోనూ మంతూరి కీర్తన పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా కీర్తన మాట్లాడుతూ ఈ విజయం సద్గురు మాధుసూదన సాయి దూరదృష్టికి నిదర్శనం అని, తల్లిదండ్రులు గురువుల ప్రోత్సాహానికి ఎప్పటికీ కృతజ్ఞతలు తెలియజేస్తానని అన్నారు.సిద్దిపేటలో జరిగిన సన్మాన కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కనకచంద్రము కీర్తనకు శాలువా కప్పి ఘన సత్కారం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దరిపల్లి నగేష్, కీర్తన తండ్రి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో, రామగుండంలో కమిషన్ల పాలన

- ప్రశ్నించిన ప్రతిపక్షాలను బద్నాం చేసే కుట్రలు
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



ప్రతిపక్షం, గోదావరిఖని, డిసెంబర్ 2 : రాష్ట్రంలో,రామగుండంలో కమిషన్ల పాలన నడుస్తోందనీ, ప్రశ్నించిన ప్రతిపక్షాలను బద్నాం చేసే కుట్రలు చేస్తున్నారని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్, సీనియర్ నాయకులు కౌశిక హరి అన్నారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ లో మాట్లాడుతూ ఇకపై థర్మల్ పవర్ ప్లాంట్ పెట్టం,గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ లు నెలకొల్పుతామని చెప్పారని సిఎం మాట్లాడిన విషయంపై మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడితే రామగుండంలో హరీశ్ రావు పవర్ ప్లాంట్ వద్దంటున్నా రని అబద్ధపు మాటలు చెబుతూ దిష్టి బొమ్మ దగ్ధం చేస్తారా అని అగ్రహం వ్యక్తం చేశారు.దమ్ముంటే ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి స్థానిక ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీష్ రావు అడిగిన వాటిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకానీ రూపాయికి పావలా కూడా పనికిరాని పలుకని నాయకులు మాజీ మంత్రిపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడతారా... ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. ఎన్టీపీసీ యాజమాన్యం ఒక యూనిట్ కు 4 రూపాయల 70 పైసలకే ఇవ్వడానికి సిద్ధంగా ఉండగా,మంత్రివర్గ కేబినెట్ ఇచ్చిన డి.పి.ఆర్ 10,800 కోట్ల ప్రకారం యూనిట్ కు 7రూపాయల 40 పైసలు పడుతుందని అలాంటప్పుడు కమిషన్ల కోసమేనా థర్మల్ పవర్ ప్లాంట్ లు అని మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించడం జరిగిందన్నారు. పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి కోసం బీఆర్ఎస్ పార్టీపై అబద్ధపు ప్రచారం చేయడం మానుకోవాలని హితవుపలికారు.రామగుండంలో జరుగుతున్నది దౌర్జన్యం,అవినీతి, కూలగొట్టడం మైసమ్మ గుడుల కూల్చివేత లు మాత్రమేనని ఆరోపించారు.తమ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి కనబడిన వాటిని రోడ్డు వెడల్పు,అభివృద్ధి పేరుతో కూల్చివేస్తూన్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో అంతా మోసమేనని,ఆరు గ్యారంటీలను అటకెక్కించారని, 42 శాతం బీసీ రిజర్వేషన్లుఅంటూ బిల్లు పెట్టీ,ఆర్డినెన్స్ తీసుకువచ్చి తీరా సర్పంచ్ ఎన్నికల్లో 17 శాతమే ఇచ్చారని తీవ్ర ఆరోపణలు చేశారు.ప్రతిపక్షాలు ధర్నాలు చేస్తే కేసులు పెట్టే పోలీసులు,అధికార పార్టీ నాయకులు మాజీ మంత్రి దిష్టి బొమ్మ దగ్ధం చేస్తే ఎందుకు కేసులు పెట్టడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఇసుక, బూడిద,మట్టి అమ్ముకొని బతుకడమే పనిగాపెట్టుకున్నారని ఆరోపించారు.కూల్చివేతలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నరన్నారు.ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కౌశిక హరి, గోపు ఐలయ్యయాదవ్, బాదే అంజలి, గాధం విజయ, కల్వచర్ల కృష్ణవేణి, కవితా సరోజినీ, నూతి తిరుపతి, నారాయణదాసు మారుతి, బుర్రి వెంకటేష్, శ్రీనివాస్, రామకృష్ణ, కిరణ్ జీ, జక్కుల తిరుపతి, సాగర్ తిమోతి, గుంపుల లక్ష్మి, గుర్రం పద్మ, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక కాంగ్రెస్‌లో అంతర్గత అసంతృప్తి

- సీనియర్ నేత సంజీవరెడ్డి ఆవేదన



ప్రతిపక్షం, సిద్దిపేట, డిసెంబర్ 2: దుబ్బాక నియోజకవర్గంలో పార్టీ కోసం సంవత్సరాల పాటు కష్టపడ్డ కార్యకర్తల కంటే కొత్తగా చేరిన వారికి అధిక ప్రాధాన్యం లభిస్తున్నందున తీవ్ర ఆవేదన వ్యక్తమవుతున్నట్టు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంజీవరెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీని ఎదిరించి నిలిచిన తమలాంటి సీనియర్ నాయకులకు ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆయన విమర్శించారు. అధికారంలో ఉన్న పార్టీ వైపు వెళ్లేవారే పదవులు, ప్రయోజనాలు పొందుతున్నారనే పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. చెరుకు శ్రీనివాస్ రెడ్డి వల్ల దుబ్బాక నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ నష్టపోతుందన్నారు. రాహుల్ గాంధీ పార్టీ సీనియర్ నేతలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించినప్పటికీ, స్థానికంగా ఆ నిర్ణయం అమలు కాకపోవడం బాధాకరమని సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని నియోజకవర్గాల పరిస్థితిని సమీక్షించి, పార్టీ కష్టకాలంలో జెండా పట్టిన నిజమైన కార్యకర్తలకు పదవులు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



భగవద్గీత పారాయణంలో బంగారు పతకం

ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 2: సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపల్ కు చెందిన ఎన్సీ సంతోష్, సంజన దంపతులు భగవద్గీత పారాయణంలో బంగారు పతకం అందుకున్నారు. యావత్తు ప్రపంచ వ్యాప్తంగా గత సంవత్సర కాలం పాటు జరిగిన భగవద్గీత పారాయణ కార్యక్రమంలో 700 శ్లోకలను కంఠస్థం చేసినందుకు కర్ణాటక రాష్ట్రం మైసూర్ లోని దత్త పీఠం ఆవరణలో ఏర్పాటు చేసిన పోటీల్లో ఎన్సీ సంతోష్ సంజన దంపతులు సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు.



ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలి

- జిల్లా ఎస్పీ -శ్రీనివాస రావు
- సమస్యాత్మక గ్రామాల్లో అవగాహన కార్యక్రమం


ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్2: గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఓటరు ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని జిల్లా ఎస్పీ డీవీ. శ్రీనివాస రావు సూచించారు. ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలైన టేక్మాల్ మండలం శాబాద్ తాండ, సీఎం తాండ, ఎల్లిపేట్, ఎల్పుగొండ గ్రామాలకు చెందిన ప్రజలకు శాబాద్ తాండ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో, పాపన్నపేట మండలం కొత్తపల్లి, అబ్లపూర్,అన్నారం గ్రామాలకు చెందిన ప్రజలకు కొత్తపల్లి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి విభేదాలు, వర్గపోరు సృష్టించకుండా కలిసిమెలిసి ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు వస్తూ పోతూ ఉంటాయని, గ్రామంలో ప్రతిరోజూ ఒకరినొకరు చూసుకుంటూ జీవించాల్సి ఉంటుందని, అందువల్ల ప్రజలు ఐక్యతను పాటించాలని సూచించారు. ఓటు హక్కును ప్రశాంతంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో నగదు, మద్యం, ఇతర ఉచిత పంపిణీలపై కట్టుదిట్టమైన నిఘా పెట్టినట్లు ఎస్పీ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించి, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, అల్లాదుర్గ్ సీఐ రేణుక రెడ్డి, ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, మెదక్ రూరల్ సీఐ జర్జ్, పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

రైస్ మిల్లర్ల దోపిడీకి రైతులు అల్లాడిపోతున్నారు

- రైతు సంఘాల సమాఖ్య మాజీ అధ్యక్షుడు గడీల బైరవరెడ్డి



ప్రతిపక్షం, సిద్దిపేట, డిసెంబర్ 2: మొంథా తుఫాన్ ప్రభావంతో తీవ్ర నష్టాల పాలైన రైతులు మరోవైపు రైస్ మిల్లర్ల దోపిడీకి గురవుతున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య మాజీ అధ్యక్షుడు గడీల బైరవరెడ్డి అన్నారు. ఆరుగాలం కష్టపడి, ఎండబెట్టి, తూర్పాలు చేసుకుని మార్కెట్ యార్డులకు తీసుకొచ్చి మిల్లులకు పంపిన వడ్లపై మిల్లర్లు అతిగా తగ్గింపు బస్తాలు కోత పెడుతూ రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్, నల్గొండ, సూర్యాపేట, కామారెడ్డి జిల్లాల్లో మిల్లర్లు వడ్లపై తేమ, నూక, తాలు పేర్లతో 9 బస్తాలు, 6 బస్తాలు, 3 బస్తాలు వరకు తరుగు తీస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ తరుగు అంగీకరించకపోతే టోకెన్ చిట్టీ ఇవ్వడానికి కూడా నిరాకరిస్తున్నారని రైతులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఈ దోపిడీపై ప్రభుత్వం ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై రైతు సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ తక్షణమే జోక్యం చేసుకుని మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులను రక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



లక్ష పుష్పాలతో లక్ష్మీ నరసింహునికి అర్చన

ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 2: ఆలయ వేద పండితులు, అర్చకులు, పురోహితుల వేదమంత్రాలతో మంగళవారం వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారి సన్నిధిలో లక్ష పూలతో పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించగా భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామి దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు, చైర్మన్ రవీందర్ దంపతులు, ధర్మకర్తలు సురేందర్ రెడ్డి దంపతులు, చందా నాగరాజు, కొత్తపల్లి శ్రీనివాస్, గాలి కిష్టయ్య, కర్రె పద్మా వెంకటేష్, మరియు సిబ్బంది సుధాకర్, నరేందర్, పాండు పాల్గొన్నారు.



మంబోజిపల్లి చెక్‌పోస్ట్ తనిఖీ చేసిన ఎస్పీ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 2: గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంబోజిపల్లి పోలీస్ చెక్‌పోస్ట్‌ను మంగళవారం మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీల రిజిస్టర్‌ను పరిశీలించి, సిబ్బంది వాహన తనిఖీలు చేస్తున్న విధానాన్ని ప్రత్యక్షంగా గమనించారు. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టాలని ఎస్పీ సూచించారు. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై ఎన్నికల నియమావళి ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నేటి నుండి మూడవ విడత నామినేషన్లు

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 2: గ్రామ పంచాయితీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరిగే మూడవ విడత నామినేషన్ స్వీకరణ ప్రక్రియకి పూర్తి ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం నుండి జరగబోవు మూడో విడత నామినేషన్ ప్రక్రియ లో భాగంగా కొల్చారం ఎంపీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ నెల3 నుండి 5 వరకు 7 మండలాలకు సంబంధించిన 183 గ్రామపంచాయతీలు, 1528 వార్డులకు జరిగే మూడవ విడత నామినేషన్ ప్రక్రియకు సంబంధించి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తాసిల్దార్ శ్రీనివాసా చారి, ఎంపీడీవో,రిటర్నింగ్ అధికారులు రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మిమ్స్' ను సందర్శించిన అమెరికా వైద్య బృందం

- ముఖ్య అతిథిగా హాజరైన వైయస్ చౌదరి



ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, డిసంబర్ 2. ప్రపంచ ప్రఖ్యాతి గడించిన అమెరికాలోని మినిసోటాకు చెందిన వైద్య విజ్ఞాన సంస్థ మయో క్లినిక్ కు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంటిరియాలజిస్టు డా. శాంతి స్వరూప్ వేగి బృందం మేడ్చల్లోని మెడిసిటీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యే యలమంచలి సత్యన్నారాయణ చౌదరి (వైయస్ చౌదరి), ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కు చెందిన అధ్యాపక బృందంతో పాటూ యాజమాన్యం కూడా పాల్గొన్న ఈ ప్రత్యేక సమావేశంలో మయో వైద్య విజ్ఞాన సంస్థకు చెందిన ప్రతినిధి బృందం సంస్థకు చెందిన పలు విషయాలపై అవగాహన కలిపించారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైయస్ చౌదరి మాట్లాడుతూ ఎన్నో ఒడిదొడుకులను దాటుకొని మిమ్స్ చాలా అభివృద్ధి చెందిందని ప్రశంసించారు. దనార్జనే లక్ష్యంగా కాకుండా నాణ్యమైన వైద్య సేవలను అవసరమైన వారికి అందించడానికి సంస్థ ఎంతో కృషి చేస్తోందని అన్నారు. అనంతరం మయో క్లినిక్ కు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంటిరియాలజిస్టు డా. శాంతి స్వరూప్ వేగి మాట్లాడుతూ ప్రస్తుత పర్యటన వ్యక్తిగత స్థాయిలో జరిగినప్పటికీ మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ను సందర్శించి ఇక్కడి విషయాలపై అవగాహన కలిపించుకోవడంతో హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో దీనిని మరింత అభివృద్ధి చెందించడానికి అవసరమైన రీతిలో మయో క్లినిక్ వారితో సంప్రదించి కలసి పనిచేసే దిశగా దృష్టి సారిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో లోటస్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు డా. వియస్వి ప్రసాద్, మిమ్స్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె శివరామ కృష్ణ, ప్రిన్సిపాల్ డా. దేవేంద్ర సింగ్, వైస్ ప్రిన్సిపాల్ డా. శైలేంద్ర, హాస్పిటల్ కు చెందిన వైద్య విభాగాలకు చెందిన అధిపతులు పాల్గొన్నారు.



ఉత్తమ సేవలందించిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు

- ఎయిడ్స్ డే పురస్కరించుకొని జిల్లా ఆస్పత్రిలో కార్యక్రమం

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 2: వరల్డ్ ఎయిడ్స్ డే ను పురస్కరించుకొని మంగళవారం మెదక్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో పని చేస్తున్న సిబ్బందికి ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలను డీఎంహెచ్ఓ డాక్టర్ ధనసరి శ్రీరామ్ అందజేశారు. జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ అల్లంకి సునీత దేవి, అడిషనల్ డీఎమ్ ఈ సిబ్బందిని వారు చేస్తున్న సేవలకు అభినందించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. మెడికల్ కాలేజ్ ఏర్పడిన నాటి నుంచి హెచ్ఐవీ రోగులకు, వ్యాధులకు సంబంధించి చికిత్స ప్రత్యేక ప్రొఫెసర్ల ద్వారా మెరుగైన సేవలు అందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డెర్మటాలజీ ప్రొఫెసర్ డాక్టర్ విజయ శేఖర్, మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ కోమల్, ఈఎన్టీ ప్రొఫెసర్ డాక్టర్ రవి శంకర్, డాక్టర్ కిరణ్, డీఎస్ఆర్సీ కౌన్సిలర్ రాజేశ్వర్, ఐసీటీసీ కౌన్సిలర్ కే గోపి, పీపీటీసీ కౌన్సిలర్ సుధాకర్, స్టాఫ్ నర్స్ సౌందర్య, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్‌ను భారత్ కోల్పోవడంలో గంభీర్‌ను ప్రొటెక్ట్ చేయను. అతడు 100% బాధ్యత వహించాలి. నేను కోచ్‌గా ఉన్నప్పుడు ఇది జరిగి ఉంటే ఓటమికి మొదటి బాధ్యతను తీసుకునే వాడిని. నిజానికి టీమ్ కూడా అంత ఘోరంగా లేదు. కానీ గువాహటిలో 100-1 నుంచి 130-7కి పడిపోయారు. ఆటగాళ్లు మరింత బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది.
- టీమిండియా మాజీ కోచ్ రవిశాస్త్రి

ప్రాంతీయం

హుస్నాబాద్ మున్సిపాలిటీని రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 2: హుస్నాబాద్ రాష్ట్రంలోని ఆదర్శ మున్సిపాలిటీ గా నిలపడానికి అందరూ కష్టపడి పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పట్టణంలో పెండింగ్ పనులు, పూర్తయిన పనులు ఇతర అంశాలపై హుస్నాబాద్ మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.పట్టణంలో జరుగుతున్న సీసీ రోడ్లు , డ్రైనేజీ నిర్మాణాలు,కమ్యూనిటీ హాల్ లు , ఎల్లమ్మ చెరువు సుందరీకరణ , డివైడర్ ల మధ్య సెంట్రల్ లైటింగ్ ,మొక్కల పెంపకం ,జంక్షన్ ల సుందరీకరణ పనుల పురోగతి పై ఆరా తీశారు. పెండింగ్ పనుల ఆలస్యం పై మంత్రి పొన్నం ప్రభాకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు పనులు ఆలస్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీసీ రోడ్ల పెండింగ్ పనులు డిసెంబర్ 31 లో పూర్తి చేయాలని గడువు విధించారు. ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు మార్చి 31 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సిద్దేశ్వర ఆలయం వద్ద సీసీ రోడ్డు పనులకు టెక్నికల్ ఇష్యూ లేకుండా సమస్య పరిష్కారం చేయాలన్నారు. పద్మశాలి , గౌడ , బంజారా , మైనార్టీ , వైశ్య, విశ్వ బ్రాహ్మణ, రెడ్డి , మున్నూరు కాపు ,రజక, యాదవ కమ్యూనిటీ హాల్ లో పెండింగ్ లో ఉన్నాయని ఎస్సీ కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభం కావాల్సి ఉందని వాటి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన

హుస్నాబాద్ పట్టణంలోని సిద్ధేశ్వరాలయంలో మహా శివునికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.. అనంతరం రేపు హుస్నాబాద్ లో జరగబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు.. సభ ప్రాంగణంలో స్టేజి పనులు వేగవంతం చేయాలని సూచించారు.. పార్కింగ్ ప్రదేశాలు సందర్శించారు. వచ్చే వాహనాలు ,పోయే వాహనాలకు ప్రత్యేక మార్గాలపై పోలీసులకు సూచించారు.. పట్టణం మొత్తం పార్టీ జెండాలతో అలకరించాలని పార్టీ నేతలకు సూచించారు..

సీఎం శంకుస్థాపన చేసిన పనులు ఇవే

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసే అభివృద్ధి కార్యక్రమాలు హుస్నాబాద్ లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ కి ,అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్,గిరిజన గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లు , హుస్నాబాద్ మున్సిపాలిటీ పలు అభివృధి కార్యక్రమాలకు, అధునాతన డ్రైవింగ్ ట్రాక్ తో కూడిన ఆర్టీఏ కార్యాలయానికి , ఇందిరా మహిళా శక్తి బజార్ కు ,ఉమ్మాపూర్ లో అర్బన్ ఫారెస్ట్ పార్క్ ,హుస్నాబాద్ టూ అక్కన్నపేట వరకు 4 లేన్ రోడ్డుకు , రాజీవ్ రహదారి నుండి కొత్తపల్లి , హుస్నాబాద్ వరకు 4 లేన్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు.అనంతరం హుస్నాబాద్ అక్కన్నపేట రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించనున్నారు.

బహిరంగ సభ ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి

ఇప్పటికే హుస్నాబాద్ పట్టణంలో కాంగ్రెస్ జెండాలు , కటౌట్ల తో అందంగా అలంకరణ..బహిరంగ సభకు భారీ ఎల్ ఈ డీ స్క్రీన్ లు ,పార్కింగ్ ప్రదేశాలు. సభకి తరలి వచ్చే జనాలకు మంచి నీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్స్ వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. దేశ ఐక్యత కోసం అభివృద్ధి కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబాన్ని కావల్సుకొని సమాజం ముందు బధనం చేసే కుట్ర జరుగుతుందన్నారు.నేషనల్ హెరాల్డ్ కేసులో ఏమి లేదు కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. రాహుల్ గాంధీ వెంట దేశం మొత్తం ఉంది బయపడే ప్రసక్తే లేదన్నారు.బీజేపీ వైఫల్యాలు చర్చకు రాకుండా ఉండడానికి చర్చ జరుగుతుందన్నారు.కేంద్ర బిజెపి ప్రభుత్వం ను అడుగుతున్న రిజర్వేషన్ల అంశం మీ దగ్గర పెండింగ్ లో ఉందన్నారు.స్థానిక సర్పంచ్ ల ఎన్నికల్లో బలహీన వర్గాలకు అన్యాయం జరిగిందని స్పష్టత ఉంది..ప్రభుత్వం తరుపున అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఇబ్బంది కలుగుతుందన్నారు. అందుకు సంబంధించిన మార్గం సుగమం చేయడానికి తెలంగాణ లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి బీజేపీ నేతలు చొరవ తీసుకొని దేశంలోనే ఆదర్శ రాష్ట్రం గా తెలంగాణ నిలవాలన్నారు.

పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలి

ఎక్కడో కోనసీమ లో కొబ్బరి చెట్లు ఎండిపోతే ఆంధ్రప్రదేశ్ కి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి తెలంగాణ వాళ్ళ దిష్టి తగిలింది అంటే ఆయన వివేకవంతుడ.. లేక అవివేకవంతుడా. మిత్రపక్షంకు బాధ్యత వహిస్తున్న తెలంగాణ బీజేపీ నాయకత్వం ఆయన వ్యాఖ్యలపై స్పందించాలన్నారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గారు స్పందించాలన్నారు.స్వయంగా బీజేపీ పొత్తు ఉంది కాబట్టి రెండు రాష్ట్రాల మధ్య వైషమ్యాలు కలిగేలా మాటలు మాట్లాడడం దురదృష్టకరమన్నారు.



నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఇంచార్జి కలెక్టర్

- బోయినపల్లి ఏఎంసీలో ధాన్యం కొనుగోళ్ల పరిశీలన

ప్రతిపక్షం, రాజన్న సిరిసిల్ల, బోయినపల్లి, డిసెంబర్ - 2: గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు. బోయినపల్లి లోని ఆర్ఓ కేంద్రంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను తనిఖీ చేశారు. నామినేషన్ తోపాటు అభ్యర్థి నూతన బ్యాంక్ ఖాతా కచ్చితంగా ఉండాలని, అన్ని వివరాలు నింపాలని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించిన తరువాత వారితో ఎన్నికల నియమావళి, వ్యయం వివరాల అందజేతపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం హెల్ప్ డెస్క్ పరిశీలించి, అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. బోయినపల్లి జడ్పీ హై స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని తనిఖీ చేసి, చేయాల్సిన ఏర్పాట్లపై ఎంపీడీఓ కు సూచనలు చేశారు.

లారీలు అందుబాటులో ఉండాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అవసరమైన మేర లారీలు అందుబాటులో ఉండాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బోయినపల్లి మండల కేంద్రంలోని ఏఎంసీ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతం, తూకం తనిఖీ చేశారు. అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన టార్పాలిన్, వసతులు కల్పించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే సమీప రైస్ మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీ వేగంగా పూర్తి చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం నిలువలకు అనుగుణంగా లారీలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చంద్ర ప్రకాశ్. జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ నారాయణ రెడ్డి, ఎంపీడీఓ జయశీల తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ పై శిక్షణ

ప్రతిపక్షం, రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ - 2: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ పై తహసీల్దార్లు, ఎంపీఓలు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ట్రైనర్లు పీ పీ టీ ద్వారా మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొనే వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉంటుందని తెలిపారు. వారికి సంబంధిత అప్లికేషన్లు ఎంపీడీఓ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని, వాటిని ఎస్ఈసీ నిబంధనల ప్రకారం నింపి అందజేయాలని సూచించారు. శిక్షణలో శిక్షణ నోడల్ అధికారి శేషాద్రి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి లక్ష్మీరాజం, ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.





చొప్పదండి జాగృతిలో చేరికలు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 2: చొప్పదండి మండలంలో మంగళవారం చొప్పదండి మండల ఇంచార్జ్ రంగరవేణి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జాగృతిలో మండల కేంద్రానికి చెందిన డాక్టర్ మమత రెడ్డి, రాంచంద్రారెడ్డిలపాటు, మ్యాకల అరుణ్, గోగులకొండ మధు, గోగులకండ మహేందర్, గొల్లపల్లి రమేష్, బోడ రాకేష్ రెడ్డి తదితరులు చేరారు. వారికి జాగృతి జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గంలో జాగృతి బలోపేతంలో భాగంగా పలువురు నాయకులు కవిత నాయకత్వంలో పనిచేస్తామని ముందుకు రావడం ఆహ్వానించదగ్గ విషయమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షులు కుతాడు శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు చంటి శ్రీనివాస్, చొప్పదండి మండల అధ్యక్షులు పిట్టల సత్యం తదితరులు పాల్గొన్నారు.



ప్రణాళిక ప్రకారం చదివి.. ఉన్నత స్థానాలకు ఎదగాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- బోయినపల్లి మోడల్ స్కూల్ లో ఆకస్మిక తనిఖీ

ప్రతిపక్షం, రాజన్న సిరిసిల్ల, బోయినపల్లి, డిసెంబర్ - 2: ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. బోయినపల్లి మోడల్ స్కూల్ లో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు, విద్యాలయం ఆవరణ, మధ్యాహ్న భోజనం మెనూ, తయారీని పరిశీలించారు. మెనూ ప్రకారం ఈ రోజు ఏ ఆహార పదార్థాలను సిద్ధం చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. 7 వ తరగతి గదిలో ఇంగ్లీష్ పాఠం కొనసాగుతుండగా, పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి రోజూ స్కూల్ కు రావాలని విద్యార్థులకు సూచించారు. సిలబస్ ఫిబ్రవరిలో పూర్తి చేయాలని, వార్షిక పరీక్షలకు సాధన చేయించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులందరూ అన్ని పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని, ఇంగ్లీష్ లో అనర్గళంగా మాట్లాడేలా సిద్ధం కావాలని పిలుపు ఇచ్చారు.



ఆర్ ఓ కేంద్రాలను తనిఖీ చేసిన

ఎన్నికల పరిశీలకులు

ప్రతిపక్షం, రాజన్న సిరిసిల్ల, ఇల్లంతకుంట, డిసెంబర్ - 2: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పలు ఆర్ఓ కేంద్రాలను జిల్లా సాధారణ పరిశీలకులు రవి కుమార్ మంగళవార తనిఖీ చేశారు. ఇల్లంతకుంట మండలంలోని పొత్తూరు, పెద్దలింగాపూర్ గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాలను జిల్లా సాధారణ పరిశీలకులు పరిశీలించారు. ఆయా ఆర్ ఓ కేంద్రాల్లో నామినేషన్లు, హెల్ప్ డెస్క్ ఇతర ఏర్పాట్లను పరిశీలించి, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇల్లంతకుంట ఎంపీడీఓ శశికళ సిబ్బంది ఉన్నారు.



మహా ధర్నా ఎవరికోసం? ఎందుకోసం?

- డబ్ల్యూజేఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్ ప్రశ్నలు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 2: జర్నలిస్టుల సమస్యల పేరిట జరుగుతోన్న మహా ధర్నా అసలు ఎవరి ప్రయోజనాల కోసం? ఎందుకోసం? అని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్ ప్రశ్నించారు. తమ అసమర్ధతను, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కొందరు నాయకులు నాటకాలు ఆడుతున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు.కరీంనగర్ లో జరిగిన డబ్ల్యూజేఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులు ప్రభుత్వానికి దూరమయ్యే పరిస్థితులకు కొందరు నాయకులే కారణమని అన్నారు. అక్రిడిటేషన్లు రెండేళ్లుగా రాకపోవడంపై రూపకల్పన కమిటీ, సమాచారం శాఖపై ఆయన ప్రశ్నలు గుప్పించారు.మీడియా అకాడమీ విచ్చిన్న బాధ్యతలు, సమాచార శాఖ వైఫల్యాలు జర్నలిస్టుల సమస్యలను మరింత తీవ్రం చేశాయని కరుణాకర్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం పనులకు మద్దతు కూడగట్టడంలో విఫలమైన కొందరు తమ పదవులు కాపాడుకునేందుకు కొత్త డ్రామాలతో ముందుకు వస్తున్నారని ఆరోపించారు.జర్నలిస్టు సంఘాల పేరుతో మోసగాళ్ల నాటకాలు జరగనివ్వమని, అలాంటి వారు డ్రామా కంపెనీలు నడపడం మంచిదని ఆయన ఎద్దేవా చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దారం జగన్నాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి గుడాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మొగురం రమేష్, కోశాధికారి చిటుమల్ల మహేందర్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలకు చెక్ పెట్టే దిశగా నూతన ఆవిష్కరణ

- పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా



ప్రతిపక్షం, గోదావరిఖని, డిసెంబర్ 2: రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు, ప్రజల్లో అవగాహన పెంపుదలకు లక్ష్యంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో "ఫ్రాడ్ క ఫుల్ స్టాప్" పేరుతో 6 వారాల రాష్ట్ర వ్యాప్త సైబర్ భద్రత ప్రచార కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం తెలంగాణ డీజీపీ,టీజీసిఎస్ బి డైరెక్టర్ షికాగోయల్,సీనియర్ అధికారులు,విద్యార్థులు ,ఇతర ప్రముఖులు ప్రారంభించారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు రామగుండం కమీషనరేట్ పరిధిలో రామగుండం కమీషనర్ అంబర్ కిషోర్ ఝా కమీషనరేట్ లోని పోలీస్ అధికారులు తమ పరిధిలోని విద్యార్థులు మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జూమ్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.సైబర్ నేరాలపై విద్యార్థుల అవగాహన కోసం ప్రత్యేకంగా ఆన్లైన్ వర్క్‌షాప్ నిర్వహించారు.అనంతరం ఆన్ లైన్ ప్రతిజ్ఞ తీసుకోవడం,ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఆరు వారాలపాటు సైబర్ సారథి@1930, స్కాం సే బచావో, పైసా పైలం, హర్ స్క్రీన్ సురక్షిత్, మేరా లాగిన్ మేరా రూల్ మహిళారక్షణ పిల్లల సంరక్షణ, 1930 హెల్ప్‌లైన్, గోల్డెన్ అవర్ రిపోర్టింగ్ ప్రాముఖ్యత,ఏఐ ఆధారిత నివేదన వేగవంతం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అన్నారు. సైబర్ మోసాల నివారణకు సమయానికి ఫిర్యాదు చేయడం,అవగాహనతో వ్యవహరించడం అత్యంత కీలకం. ప్రతి పౌరుడు జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలి. 'ఫ్రాడ్ ఫుల్ స్టాప్' తెలంగాణలో సైబర్ భద్రతను మరింత బలోపేతం చేసే ముఖ్య కార్యక్రమం" అన్నారు. ప్రజలలో అవగాహన కల్పించడం కోసం టి జి సి ఎస్ బి పోస్టర్లు, ఆడియో క్లిప్‌లు,జింగిల్స్,ఇతర అవగాహన అంశాలు ముఖ్యమైన ట్రాఫిక్ జంక్షన్లు,రైల్వే స్టేషన్లు,బస్ స్టాండ్‌లు,పోలీస్ స్టేషన్లు, మార్కెట్లు ఇతర ముఖ్యమైన ప్రజా సంబందింత ప్రాంతాలలో ఏర్పాటు చేస్తాం అని,సోషల్ మీడియాలో అవగహన ప్రచారం, ఎన్సిసి,ఎన్ఎస్ఎస్ క్యాడేట్స్, సైబర్ క్లబ్స్ ద్వారా ప్రతి కాలేజీ నుండి ఇద్దరు సైబర్ వాలంటీర్లు ఎంపిక చేసి,ప్రతి కాలేజీ నుంచి మొత్తం 5 మంది విద్యార్థులు,ఒక టీచర్ ఈ క్లబ్ లో భాగస్వామ్యం చేసి వీరి ద్వారా తమ కాలేజీలోనే కాకుండా ఇతర పబ్లిక్ ప్రదేశాల్లో కూడా సైబర్ సెక్యూరిటీబ్యూరోతో సమన్వయంతో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులలో అవగాహన కల్పిస్తూ చైతన్య పరుస్తూ రామగుండం పోలీస్ కమీషనరేట్ ఆరు వారాల పాటు ఒక్కో వారం ఒక్కొక టీం తో పోలీస్ స్టేషన్ స్థాయి ప్రతి స్టేషన్ లో వారానికి ఒక అవగాహన కార్యక్రమం, సైబర్ వారియర్స్ ద్వారా అధికారులతో సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సైబర్ మోసం జరిగిన వెంటనే 1930కు కాల్ చేయండి. ప్రజలు జాగ్రత్తగా ఉంటేనే సత్ఫలితం ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం లో అడిషనల్ డీసీపీ అడ్మిన్,గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్,సిసిపిఎస్ ఏసీపీ రంగారెడ్డి,ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సిసిపిఎస్ ఇన్స్పెక్టర్ కృష్ణ మూర్తి, ఆర్ ఎస్ ఐ.మారుతీ,ఎన్ సిసి, ఎన్ఎస్ఎస్ క్యాండేట్స్, తదితరులు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తా

- అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థి పోచయ్య ముదిరాజ్



ప్రతిపక్షం, మనోహరాబాద్, డిసెంబర్ 2: కాళ్లకల్ గ్రామంలోని ఆరవ వార్డును అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి దండు పోచయ్య ముదిరాజ్ అన్నారు. సోమవారం నామినేషన్ ను పురస్కరించుకొని గ్రామంలో పెద్ద సంఖ్యలో గ్రామ, వార్డు ప్రజలతో ర్యాలీ తీస్తూ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి దండు పోచయ్య ముదిరాజ్ మాట్లాడుతూ వార్డు అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తూముకుంట నర్సారెడ్డి, అధికారుల సహకారంతో వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, గ్రామ పంచాయతీలోనే ఉత్తమ వార్డుగా తీర్చిదిద్దుతానని తెలిపారు. వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను తీర్చడంతో పాటు పలు అభివృద్ధి పనులు చేస్తానని ప్రజలకు తెలిపారు. పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడటం, యువతకు ఉపాధి అవకాశాలు, క్రీడా మౌలిక వసతులు, మహిళల శ్రేయస్సుకోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటాను. వార్డు ప్రజలు మీ సహకారాన్ని అందించి గెలిపించాలని కోరారు.

“



ప్రపంచవ్యాప్తంగా భారీగీ తగ్గుతున్న సంతానోత్పత్తి రేటు తీవ్ర ఆందోళనకరంగా ఉంది. ఇదే ధోరణి ఇలానే కొనసాగితే మానవ జాతి క్షీణించి.. అంతరించిపోయే ప్రమాదం ఉంది. జెరోధా కో-ఫౌండర్ నిఖిల్ కామత్ "నువ్వూ పిల్లలను కనాల్సిందే". మనిషి మనుగడ కోసం సంతానం కొనసాగించాలి. పిల్లలను కనాలి.

- వ్యాపార దిగ్గజం ఎలాన్ మస్క్

ప్రాంతీయం



టీబీ నియంత్రణకు స్క్రీనింగ్ నిర్వహించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్2 : టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో పట్టణ పరిధిలోని బోడగుట్ట, సోమిడి వడ్డేపల్లి, లష్కర్ సింగారం, పెద్దమ్మ గడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, హసన్ పర్తి, కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందితో ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 1,98,000 ప్రభావిత గ్రూపులకు చెందిన వారిని పరీక్షించి అవసరమైన పరీక్షలు నిర్వహించవలసి ఉండగా1,30,049 మందికి స్క్రీనింగ్ నిర్వహించడం జరిగింది. స్క్రీనింగ్ తక్కువగా నిర్వహించిన వడ్డేపల్లి, లష్కర్ సింగారం , కడిపికొండ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులను ఇందుకు గల కారణాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ దేశంలో టీబీ నిర్మూలన లక్ష్యంగా ఈ కార్యక్రమం టీబీ ముక్త్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో టీబీ నియంత్రణ కార్యక్రమాలకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని దానికి అనుగుణంగా స్క్రీనింగ్, ఎక్స్ రే, నాట్ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అందించిన మొబైల్ ఎక్స్ రే మిషన్ ను పరిశీలించి ప్రణాళిక ప్రకారం ఎక్కడైతే ఎక్స్ రే పరీక్షలు తక్కువగా నిర్వహించారో అక్కడి ప్రజలకు అవగాహన కల్పించి ఎక్స్ రే పరీక్షలు నిర్వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్క్రీనింగ్ బాగానే చేస్తున్నప్పటికీ పట్టణ పరిధిలో మాత్రం చాలా తక్కువగా ఉందని అన్నారు. పట్టణ ప్రాంతాలలో కూడా స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించాలని సూచించారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న సిబ్బంది, వనరులతో టిబి ముక్త్ భారత్ ,ఎన్సిడి, మాతా శిశు సంక్షేమంతో పాటు ఇతర అన్ని ఆరోగ్య కార్యక్రమాలు లక్ష్యాలను సాధించాలని, లేనట్లయితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య టీబీ ముక్త్ భారత్, గర్భిణీస్త్రీల నమోదు , ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య తక్కువగా ఉన్న ఆరోగ్యకేంద్రాల ఏఎన్ఎంలు, ఆశాలవారీగా సమీక్షించారు.



నామినేషన్ల కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు

ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్2: పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను హనుమకొండ జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు మంగళవారం పరిశీలించారు. ధర్మసాగర్ మండలం ఎల్కుర్తి, పెద్ద పెండ్యాల క్లస్టర్ల పరిధిలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా ఎన్నికల పరిశీలకులు శివ కుమార్ నాయుడు పరిశీలించారు. రెండో విడత నామినేషన్ల స్వీకరణలో రెండు రోజులపాటు, ఈరోజు ఎన్ని నామినేషన్లు వచ్చాయని రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను జిల్లా ఎన్నికల పరిశీలకులు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో హెల్ప్ డెస్క్, తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని, సూచనలు చేశారు. ఈ పరిశీలనలో ధర్మసాగర్ ఎంపీడీవో అనిల్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.చి కారణాలను తెలుసుకొని వాటిని అధిగమించి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.100 శాతం ప్రసవాలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరగడానికి ప్రోత్సహించిన ఆరుగురు ఆశాలను శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిఎంహెచ్వో డాక్టర్ మదన్ మోహన్ రావు, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, పీవోడిటి డాక్టర్ ప్రభుదాస్, డాక్టర్ జ్ఞానేశ్వర్, డెమో వి అశోక్ రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



నగర కాంగ్రెస్ అధ్యక్షుడికి నియమాక పత్రం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 2 : నిజామాబాద్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మీనాక్షినటరాజన్ నియామక పత్రాన్ని అందజేశారు. మంగళవారం హైదరాబాద్ గాంధీభవన్లో పిసిసి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ కు పిసిసి అధ్యక్షుడు మహేష్కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్ అందజేశారు.



నాగారం డంపింగ్ యార్డుకు మరో రెండు చెత్త శుద్ధి మెషీన్లు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 2 : నిజామాబాద్ నగర శివార్ నాగారం డంపింగ్ యార్డుకు మరో రెండు చెత్త శుద్ధి మెషీన్లు తెప్పించి డంపింగ్ యార్డ్ లో చెత్త శుద్ధి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనున్నట్లు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్త తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే డంపింగ్ యార్డ్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొత్తం 3,51,500 మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేసే ప్రక్రియ త్వరలోనే పూర్తి అవుతుందని తెలిపారు. ప్రస్తుతం 2 మిషిన్లు పనిచేస్తుండగా, అదనంగా మరో 2 మిషిన్లు అవసరం పడతాయని, అవి త్వరలోనే అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ చర్యలతో ప్రాంతం శుభ్రపడి, ఇందూర్ అర్బన్ అసెంబ్లీ పరిధిలోని నాగారం డంపింగ్ యార్డ్ను సందర్శించారు. నా ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం, ఈ డంపింగ్ యార్డ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు బయోమైనింగ్ ద్వారా శుభ్రపరిచే పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్త వల్ల ఇక్కడి పరిసరాలకు చాలా సమస్యలు వస్తాయని, ఈ చెత్తను తొలగించడానికి బయోమైనింగ్ పద్ధతి ఉపయోగిస్తున్నారు దీనివల్ల పొడి, తడి చెత్తను వేరు చేసి, శుభ్రపరచి, తిరిగి ఉపయోగించుకునేలా చేస్తారని అన్నారు. శుభ్రమైన, ఆరోగ్యకరమైన ఇందూర్ నా లక్ష్యమని, ఆ దిశగా పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

నామినేషన్ల స్వీకరణ విధానాలలో లోటుపాట్లు ఉంటే చర్యలు

- ఎన్నికల పరిశీలకురాలు ఆయేషా మసరత్ ఖానం



ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, డిసెంబర్ 2: గ్రామపంచాయతీ ఎన్నికల ప్రత్యేక పర్యవేక్షకురాలు ఆయేషా మసరత్ ఖానం మంగళవారం సాయంత్రం సారంగాపూర్ మండలం చించోలి (బి)ను సందర్శించారు. కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. నామినేషన్లు వేస్తున్న అభ్యర్థుల పూర్తిస్థాయి వివరాలను నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయో లేదో చూసుకోవాలని ఆదేశించారు. లోటుపాట్లు ఉన్న పత్రాలు నిరాకరణాలకు గురవుతాయన్న విషయాన్ని గుర్తించాలన్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాలను సందర్శిస్తూ పోలింగ్ కేంద్రాలు, నామినేషన్ల కేంద్రాలను పరిశీలించి తగిన విధంగా సూచనలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా జరిగేలా ముందస్తు ఏర్పాట్లు అధికారిక నియమ నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతున్నాయని చెప్పారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలు సూచనలకు అనుగుణంగా సంబంధిత సిబ్బందికి ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇస్తూ ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మూడు దఫాలుగా జరిగిన నామినేషన్ ల స్వీకరణలో ఎక్కడ కూడా ఎలాంటి లోటుపాట్లు జరగకుండా రెవెన్యూ ఇతర శాఖల సిబ్బందిలకు ఎప్పటికప్పుడు అప్రమతం చేస్తూ నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ల పర్వం ముందుకు సాగేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,అదనపు కలెక్టర్లు కిషోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్ లతోపాటు సంబంధిత ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఎన్నికల నిర్వహణ విషయంలో ప్రత్యేక చొరవత ముందుకు వెళ్తున్నారని తెలిపారు.ఇందులో అధికారులు ఉన్నారు.



బీజేపీలో భారీగా చేరికలు

ప్రతిపక్షం, సోన్, డిసెంబర్ 2 : సోన్ మండలం సంగంపేట్ గ్రామ తాజామాజీ సర్పంచ్ మారి విలాస్ తో పాటు ముఖ్య నాయకులు కస్తూరి నారాయణ, ద్యావత్ శ్రీనివాస్,ద్యావత్ ప్రశాంత్, కస్తూరి శ్రీనివాస్, తాళ్ళ ప్రవీణ్, బంక మనికిరణ్, జొర్రిగ సంతోష్, బంక అన్వేష్ , సంఘం గణేష్, సంగెం ప్రశాంత్, తో పాటు 30 మంది యువకులు, కార్యకర్తలు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సరికెల గంగన్న, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, నాయకులు అంకం శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, భీమ్ రావు, ద్యావతి ప్రశాంత్, తో పాటు మండల గ్రామ బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కంటతడి పెట్టించిన శునకం విశ్వాసం!



ప్రతిపక్షం. హన్మకొండ, డిసెంబర్ 2: తమ యజమాని ఇక లేరు అన్న విషయం పసిగట్టిన పెంపుడు కుక్క దిగాలుగా కనిపించిన సంఘటన ధర్మసాగర్ మండలం క్యాతంపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే వాగ్దేవి విద్యాసంస్థల వ్యవస్థాపకులు చందుపట్ల దేవేందర్ రెడ్డి మామ చాడా రాఘవేంద్రా రెడ్డి సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారు.కాగా దివంగత చాడా రాఘవేంద్రా రెడ్డి స్వగ్రామం ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి కాగా ఆయన ఫార్థివ దేహాన్ని మంగళవారం క్యాతంపల్లికి తరలించారు.స్వర్గీయ చాడా రాఘవేంద్రా రెడ్డి పోషణలో పెరుగుతున్న శునకానికి చివరి చూపు కోసం క్యాతంపల్లికి తీసుకువచ్చారు.తన యజమాని చనిపోయిన విషయాన్ని పసిగట్టిన సదరు శునకం ఫార్థివ దేహానికి తలకాయ పెట్టి ఏడ్చినంత పని చేసింది. స్వర్గీయ చాడా రాఘవేంద్రా రెడ్డి అంత్యక్రియలకు హాజరైన బంధువులను ఆశ్చర్యపరిచింది.అసలు దివంగత చాడా రాఘవేంద్రా రెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నందున ఈ శునకానికి అతని సేవలు దూరం కావడం,అకస్మాత్తుగా కనిపించిన తన యజమాని ప్రాణంతో లేకపోవడంతో ఆ శునకం విశ్వాసాన్ని ప్రదర్శించడం గమనార్హం! అంత్యక్రియలకు హాజరైన వందల మంది బంధువర్గం శునకం దిగాలుగా వ్యవహరించడం చూసి కంటతడి పెట్టుకున్నారు.ఇది ఇలాఉండగా దివంగత చాడా రాఘవేంద్రా రెడ్డి కి ముగ్గురు ఆడ సంతానం కావడంతో పెద్ద కూతురు శ్రీమతి చందుపట్ల వాణిదేవి ఆయన చితికి నిప్పు పెట్టారు.అశ్రునయనాల మధ్య స్వర్గీయ చాడా రాఘవేంద్రా రెడ్డి అంత్యక్రియలు ముగిసాయి.



నిర్మల్ డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, డిసెంబర్ 2: గాంధీ భవన్ లో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో పార్టీ ఏఐసిసి ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్, మహేశ్ గౌడ్ చేతుల మీదుగా నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నియామక పత్రాన్ని అందుకున్నారు. నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.



సైబర్ నేరాల నివారణపై అవగాహన

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 2: తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో హైదరాబాద్ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" కార్యక్రమాన్ని నిజామాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లో విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ లో సైబర్ సెక్యూరిటీ కార్యాలయంలో డిజిపి ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి నిజామాబాద్ నగరంలోని వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, సైబర్ వారియర్స్, స్థానిక పెద్దలు, పోలీసు అధికారులు హాజరయ్యారు. నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్ , బోధన్ డివిజన్ లో ఈ కార్యక్రమాలను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఆరు వారాలపాటు ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారని నిపుణులు తెలిపారు. దీని ప్రధాన ఉద్దేశం అన్ని జిల్లాలలో పేద, ధనిక అనే తేడా లేకుండా అందరూ ఈ సైబర్ నేరాలకు గురవుతున్నారనే ప్రధాన ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే సైబర్ నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆరు వారాలపాటు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు నిపుణులు మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ మోసగాళ్లు అనుసరిస్తున్న నూతన పద్ధతుల గురించి విద్యార్థులకు ప్రజలకు వివరించారు. ముఖ్యంగా, ఆన్‌లైన్ ఫైనాన్షియల్ మోసాలు, ఫిషింగ్ కాల్స్, సోషల్ మీడియా నేరాలు, ఓటీపీ షేరింగ్ ప్రమాదాలు వంటి వాటి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" నినాదంతో, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, అనుమానాస్పద లింకులను, కాల్స్‌ను ఎలా గుర్తించాలో తెలిపారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే, వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమం యువతలో మరియు ప్రజల్లో సైబర్ నేరాల పట్ల అప్రమత్తతను పెంచడంలో ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, ఇన్స్పెక్టర్ ముఖిద్ పాషా, సీటీసీ ఇన్స్పెక్టర్ శివరాం, ఎస్సై ప్రవలిక , ఐ.టి. సెల్ సిబ్బంది, నిజామాబాద్ లోని వివిధ కళాశాలల పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 2: నిజామాబాద్ రూరల్ మండలంలోని కొందూరు గ్రామ పంచాయతీలో నిర్వహించిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. నామపత్రాల స్వీకరణ నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేశారా, సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్ని నామినేషన్లు దాఖలు అయ్యాయి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియలో నిబంధనలను తు.చ తప్పక పాటిస్తూ, జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, అనవసర తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

నేటి నుండి మూడవ విడత నామినేషన్ల స్వీకరణ

గ్రామ పంచాయతీ మూడవ విడత నామినేషన్ల స్వీకరణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మొదటి, రెండవ విడతలలో బోధన్, నిజామాబాద్ డివిజన్లలోని మండలాలలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల షెడ్యూల్ ను అనుసరిస్తూ సజావుగా పూర్తి చేయడం జరిగిందని అన్నారు. ఈ నెల (డిసెంబర్) 3 నుండి 5వ తేదీ వరకు మూడవ విడతగా ఆర్మూర్ డివిజన్ లోని ఆలూరు, ఆర్మూర్, బాల్కొండ, భీమ్గల్, డొంకేశ్వర్, కమ్మర్పల్లి, మెండోరా, మోర్తాడ్, ముప్కాల్, నందిపేట్, వేల్పూర్, ఏర్గట్ల మండలాల పరిధిలోని 165 గ్రామ పంచాయతీలు, 1620 వార్డు స్థానాలకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో నామపత్రాలు దాఖలు చేయవచ్చని, డిసెంబర్ 05 చివరి తేదీ అని కలెక్టర్ సూచించారు. అన్ని కేంద్రాలలో హెల్ప్ డెస్క్ లు అందుబాటులో ఉంచామని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సాఫీగా జరిగేలా అన్ని వర్గాల వారు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి కోరారు.



తనపై ఉన్న అవినీతి కేసులను మూసివేయించేందుకు సీఎం చంద్రబాబు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ఫిర్యాదుదారులను బెదిరించి కేసులను ఉపసంహరించుకునేలా చేస్తున్నారు. స్కిల్, అసైన్డ్ ల్యాండ్స్, రింగ్‌రోడ్, ఫైబర్‌నెట్, లిక్కర్ సహా పలు కేసులు ఉన్నప్పటికీ.. అధికారంలోకి వచ్చిన తరువాత వాటిలో పురోగతి లేదు. గవర్నర్ చర్యలు తీసుకోవాలి.

- వైసీపీ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

విశ్వ వీక్షణం



పాత ఆరోపణలతో రాజకీయ ప్రతీకార చర్య

● 'హెరాల్డ్' కేసులో కొత్త ఎఫ్ఐఆర్ పై ఖర్గే ఆగ్రహం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 2: నేషనల్ హెరాల్డ్ కేసులో కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేయడం రాజకీయ ప్రతీకారమే అని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. చేయడానికి కొత్త ఆరోపణలేమీ లేకపోవడంతో పాత కేసులను తెరపైకి తీసుకువస్తున్నాయని విమర్శించారు. '12 యేండ్ల తర్వాత అకస్మాత్తుగా గాంధీ కుటుంబంపై కొత్త ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇది రాజకీయ ప్రతీకార చర్య, ప్రత్యర్థులను ప్రత్యర్థులను వేధించే ప్రయత్నం. దీనిని న్యాయవ్యవస్థ కచ్చింగా గుర్తిస్తుందని మేం విశ్వాసిస్తున్నాం' అని ఖర్గే పేర్కొన్నారు. కాగా, నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ దాఖలు చేసిన చార్జిషీటును పరిగణనలోకి తీసుకునే విషయంపై ఢిల్లీ కోర్టు తన నిర్ణయాన్ని డిసెంబర్ 16కు వాయిదా వేసింది. నేషనల్ హెరాల్డ్ పత్రిక నిర్వాహకులు 'అసోసియేటెడ్ జర్నలిస్ట్స్ లిమిటెడ్' కు చెందిన సుమారు రూ. రెండు వేల కోట్ల విలువ చేసే ఆస్తులను హస్తగతం చేసుకున్నారని ఈడీ ఆరోపిస్తోంది. ఈ కేసులో కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దూబే, శ్యామ్ పిట్రోడాలతోపాటు యంగ్ ఇండియన్ అనే ఒక ప్రైవేటు కంపెనీ కుట్రకు, మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఈడీ ఆరోపిస్తోంది.



కర్ణాటకలో అధికార మార్పిడి ఉండబోదు!!

● రెండో బ్రేక్‌ఫాస్ట్ భేటీ వేళ కీలక పరిణామం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, బెంగళూరు, డిసెంబర్ 2 : కర్ణాటక ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య కొనసాగుతోన్న వివాదానికి త్వరలోనే శుభం కార్డు పడనుందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. తన సొంత రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేయడంతో సిద్ధూ, డీకే పరస్పర చర్చలకు ప్రయత్నాలు ప్రారంభించారు. గతవారం సిద్ధూ నివాసంలో డీకేతో మొదటి బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం మరోసారి ఇరువురూ కలిసి అల్పాహారం చేయాలని ఇరు వర్గాల నేతలకు సూచించిన ఖర్గే, సీఎం పదవి విషయంలో చెరో రెండున్నరేండ్లు అంటూ కుదిరిన ఒప్పందాన్ని గౌరవించాలని డిమాండ్ చేశారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఖర్గే ఒత్తిడి చేయడం ఇది రెండోసారి. గత వారం కూడా పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు పరిష్కారాన్ని కనుగొనాలని సూచించారు. తర్వాత సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, తాను కలిసి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. ఈ క్రమంలో డీకేఎస్ నివాసంలో మరోసారి 'పవర్ బ్రేక్‌ఫాస్ట్' కోసం సీఎం, డిప్యూటీ సీఎం భేటీ అవుతారు. ఈ సమావేశంలో అధికార మార్పిడిపై చర్చించి, ఒక కొలిక్కి తీసుకురావాలని భావిస్తున్నారు. ఈ చర్చల అనంతరం రెండు వారాలలో డీకేను ఢిల్లీకి పిలిపించి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకత్వంతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. రాబోయే రోజులలో ఈ వ్యవహారం ఎలా ముందుకు సాగుతుందో చూడాలి.

హమాస్ తరహాలో దాడికి ప్రయత్నం

● ఎన్ఐఏ విచారణలో విస్తుపోయే నిజాలు


ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, శ్రీనగర్, డిసెంబర్ 2 : దేశ రాజధాని ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపై దర్యాప్తులో విస్మయానికి గురిచేసే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా, సహ నిందితుడు ఫోన్‌లోని డ్రోన్ ఫొటోలు హమాస్ తరహా ఆయుధాల ఆధారాలను బయటపెట్టాయి. జమ్మూ కశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాకు చెందిన జాసిర్ బిలాల్ వనీ అలియాస్ డానిష్.. తన ఫోన్‌లోని హమాస్ తరహా ఆయుధ డ్రోన్ల వాడకానికి సంబంధించిన ఆధారాలను డిలీట్ చేయడానికి ప్రయత్నించాడు. కానీ, జాతీయ దర్యాప్తు సంస్థ డానిష్ ఫోన్ నుంచి డ్రోన్ ఫొటోలను స్వాధీనం చేసుకుంది. ఈ ఫొటోలు హమాస్ వాడే డ్రోన్ల తరహాలోనే ఉన్నాయని గుర్తించింది. ఈ డ్రోన్ల ద్వారా పేలుళ్లకు పాల్పడేందుకు ఉగ్రవాదులు ప్రయత్నించినట్లు వెల్లడయ్యింది. వీటిని ఒక యాప్ ద్వారా తన సహచరులకు డానిష్ పంపినట్లు సమాచారం. ఈ యాప్‌లో కొన్ని విదేశీ నంబర్లు కూడా ఉన్నట్టు దర్యాప్తులో తేలింది. 25 కిలోమీటర్ల దూరం ప్రయాణించగల అధునాతన డ్రోన్ల తయారీకి ఉగ్రవాదులు ప్రయత్నించినట్లు గుర్తించింది. హమాస్ ఉపయోగించే గ్లైడింగ్ రాకెట్ల తరహా రాకెట్లను కూడా వీరు అధ్యయనం చేసినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ దాడి వెనుక పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే మొహమ్మద్ హస్తం ఉన్నట్టు గుర్తించిన సంగతి తెలిసిందే. ఇండొ వింగ్స్ సీఈఓ పరాస్ జైన్ ప్రకారం ఈ రాకెట్లను ఉపరితలం నుంచి లేదా చేతితోనూ ప్రయోగించవచ్చు.



తిండి, నీరు, వాహనాలు అన్నీ అక్కడి నుంచే

● రష్యా ప్రెసిడెంట్ పుతిన్ కు నాలుగంచెల భద్రత

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 2 : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ నెల 4, 5 తేదీలలో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా ఆయన భద్రత కోసం ఏర్పాటు చేస్తున్న ఏర్పాట్లు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఆయన తాగే నీరు, తినే ఆహారం మాత్రమే కాదు, ఉపయోగించే టాయిలెట్‌ను కూడా రష్యా నుంచే ప్రత్యేకంగా తీసుకురానుండటం ఆయన భద్రతా ప్రమాణాల తీవ్రతను తెలియజేస్తోంది. విదేశీ పర్యటనలలో పుతిన్ భద్రతను ప్రెసిడెన్షియల్ సెక్యూరిటీ సర్వీస్ పర్యవేక్షిస్తుంది. అధ్యక్షుడి రాకకు నెల రోజుల ముందే ఒక బృందం ఆతిథ్య దేశానికి చేరుకొని, ఆయన బస చేసే హోటల్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేస్తుంది. ఆయన వాడే సబ్బులు, షాంపూల నుంచి టూత్‌పేస్ట్ వరకు అన్నీ రష్యా నుంచే తెచ్చి హోటల్ గదిలో అమర్చుతారు. పుతిన్ మొబైల్ ఫోన్ ఉపయోగించరు. అత్యంత సురక్షిత కమ్యూనికేషన్ లైన్ ద్వారానే సంభాషణలు జరుపుతారు. ఇందుకోసం ఆయన గదిలోనే ప్రత్యేక టెలిఫోన్ బూత్ ఏర్పాటు చేస్తారు. పుతిన్ ప్రయాణించే ఇల్యూషిన్ ఐఎల్ 96300పీయూ విమానాన్ని 'ఎగిరే క్రెమ్లిన్' అని పిలుస్తారు. ఇందులో సమావేశ గదులు, జిమ్, మెడికల్ రూమ్‌తో పాటు అణుదాడికి ఆదేశాలు జారీ చేసే 'న్యూక్లియర్ కమాండ్ బటన్' కూడా ఉంటుంది. ఆయన విమానానికి యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా ఉంటాయి. సాంకేతిక సమస్యలు ఎదురైతే, ప్రత్యామ్నాయంగా మరో విమానాన్ని కూడా వెంట తీసుకువస్తారు. 'ఆరస్ సెనెట్' కారును కూడా రష్యా నుంచే తీసుకొస్తారు. ఈ కారు బుల్లెట్లు, గ్రెనేడ్లు, రసాయన దాడులను సైతం తట్టుకోగలదు. పుతిన్ చుట్టూ ఎల్లప్పుడూ నాలుగంచెల భద్రతా వలయం ఉంటుంది.



బంగారం ధరలకు రెక్కలు

● అంతర్జాతీయ పరిణామాలతో చిక్కులు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ముంబై, డిసెంబర్ 2: బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. ధరలకు ఎక్కడా బ్రేక్ పడటం లేదు. రోజూ ఎంతో కొంత పెరుగుతూనే సరికొత్త రికార్డులు నమోదు చేస్తున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక పరిణామాలతో రేట్లు పెరుగుతున్నాయి. బంగారంతో పాటు వెండి ధరలు కూడా అదే స్థాయిలో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం దాదాపు తులం బంగారం లక్షన్నరకు చేరుకోగా, సామాన్య, మధ్యతరగతి జనం షాపుల వద్దకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. దీంతో పెళ్లిళ్ల సీజన్ల సమయంలో కూడా బంగారం షాపులు వెలవెలపోయి దర్శనమిస్తున్నాయి. కస్టమర్లు రాకపోవడంతో బంగారం షాపులకు కూడా డిమాండ్ ఉండటం లేదనే చెప్పుకోవాలి. ఈ క్రమంలో బంగారం ధరలపై మరో షాకింగ్ న్యూస్ వచ్చింది. మరికొన్ని వారాలలో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆరు నుంచి ఏడు వారాల తర్వాత బంగారం ధరలు మరింత చేయనున్నాయని బిజినెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గత వారం బంగారం ధరలు మూడు శాతం పెరిగాయి. ఈ వారం పది గ్రాములకు రూ. ఐదు వేల వరకు పెరగొచ్చనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఇండియాలో పెళ్లిళ్ల సీజన్‌తో పాటు యూఎస్ సెంట్రల్ బ్యాంక్ త్వరలో వడ్డీ రేటును తగ్గించే అవకాశముంది.



గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన సాంస్కృతికోత్సవం

సిద్దిపేట యువతికి దక్కిన భాగస్వామ్యం

కత్తుల లక్ష్మారెడ్డి, సిద్దన్నపేట

కర్ణాటక రాష్ట్రంలోని ముద్దెనహళ్లి సత్య సాయి గ్రామం ప్రపంచ ఆధ్యాత్మిక, సాంస్కృతిక దృష్టిని ఆకర్షించింది. భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జన్మదినోత్సవ వేడుకలు నడుమ సద్గురు శ్రీ మధుసూదన సాయి నేతృత్వంలో జరిగిన రెండు కార్యక్రమాలు గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లో స్థానం పొందాయి. ఈ రెండు రికార్డుల్లో సిద్దిపేటకు యువతి మంతూరి కీర్తన పాల్గొని తెలంగాణకు ప్రత్యేక గౌరవంగా నిలిచింది. భగవాన్ సత్య సాయి బాబా "అందరినీ ప్రేమించండి సేవించండి" అనే శాశ్వత సందేశాన్ని ప్రపంచమంతటికి తెలిసేలా ఈ ఉత్సవాలను నిర్వహించారు. ఆగస్టు 16వ తేదీ నుంచి నవంబర్ 23 వరకు 100 రోజుల పాటు "వన్ వరల్డ్, వన్ ఫ్యామిలీ" పేరిట సాంస్కృతికోత్సవం జరిగింది. ప్రపంచంలోని 100 దేశాలకు చెందిన కళాకారులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా దేశాలకు చెందిన కళాకారులు తమ కళలతో పాటు, సంగీత, సంప్రదాయాలను ప్రదర్శించారు. సంస్కృతుల మధ్య శాంతి, ప్రేమ, సారూప్యతను నిలిపిన ఈ వంద రోజులు ప్రపంచ చరిత్రలోనే అతి దీర్ఘకాలిక సాంస్కృతిక ఉత్సవంగా నిలిచింది. గిన్నిస్ రికార్డును సొంతం చేసుకుంది. ఈ ఉత్సవాలలో సిద్దిపేటకు చెందిన మంతూరి కీర్తన కూడా భాగస్వామిగా నిలిచింది. దీంతో పాటు నవంబర్ 23 వ తేదీన సాయి కృష్ణన్ క్రికెట్ స్టేడియంలో జరిగిన సాయి సింఫనీ వరల్డ్ ఆర్కెస్ట్రా మరో అద్భుత రికార్డును వంతూరి కీర్తన నెలకొల్పింది. ప్రపంచంలోని 65 కు పైగా దేశాల నుంచి వచ్చిన 450 మంది విద్వాంసులు, 200 మంది విద్యార్థులు కలిసి ఆధ్యాత్మిక సంగీత సాహిత్యంతో ప్రేక్షకులను మైమరిపించారు. ఈ ప్రదర్శన ప్రపంచంలోనే అత్యధిక జాతీయతలకు(దేశాలకు) చెందిన కళాకారులతో నిర్వహించిన ఆర్కెస్ట్రాగా గిన్నిస్ బుక్ రికార్డులో నిలిచింది. ఈ అంతర్జాతీయ సంగీత కార్యక్రమంలో మంతూరి కీర్తన భాగ్య స్వామి అయ్యింది. సిద్ధిపేటకు చెందిన మంతూరి ప్రభాకర్, లావణ్య దంపతుల కుమార్తె మంతూరి కీర్తన నల్ల కదిరెనహళ్లి లోని శ్రీ సత్య సాయి ప్రశాంతినికేతనంలో ఎం ఏ ఇంగ్లీష్ రెండవ సంవత్సరం చదువుతోంది. ప్రభాకర్ కారు డ్రైవర్ గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ తన పిల్లలు మంతూరి కీర్తన, అజిత్ కుమార్ లను చదివిస్తున్నారు. కదిరెనహళ్లి లోని శ్రీ సత్య సాయి ప్రశాంతినికేతనంలో ఏం. ఏ. చదువుతున్న కీర్తన "కోరల్ సింఫనీ"లో పాల్గొని గిన్నిస్ రికార్డులో భాగస్వామి అయ్యింది. ఈ రెండు రికార్డుల్లో పాల్గొన్న కీర్తన మాట్లాడుతూ "ఇది పూర్తిగా సద్గురు మధుసూదన సాయి దూరదృష్టి, ఆధ్యాత్మిక నాయకత్వం వల్లే సాధ్యమైంది. ఈ స్థాయిలో భాగస్వామ్యం కావడానికి తోడుగా నిలిచిన మా తల్లిదండ్రులు, గురువుల ఉపకారం జీవితాంతం మరిచిపోలేను" అని భావోద్వేగంతో తెలిపారు. ఒక సాధారణ కారు డ్రైవర్ కుటుంబానికి చెందిన కీర్తన ప్రపంచ వేదికపై గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించడం ప్రేరణగా నిలుస్తుందని పలువురు అభినందించారు. ప్రతిభావంతులే భవిష్యత్ తరాలకు దిక్సూచి అవుతారని ప్రశంసించారు. తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి దరిపల్లి నగేశ్ తదితరులు కీర్తనతో పాటు ఆమె తండ్రి ప్రభాకర్ ను మంగళవారం సన్మానించారు.





చలికాలం జుట్టు రాలుతుందా?

చలికాలంలో రోజు రోజుకి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఈ సీజన్‌లో చర్మం, జుట్టుకు సంబంధించిన అనేక సమస్యలు ఎదుర్కొంటారు. చాలా మందికి జుట్టు రాలడం ఒక సాధారణ సమస్యగా మారుతుంది. మిగతా సీజన్లతో పోలిస్తే.. చలికాలంలో జుట్టు రాలడం ఎక్కువగా ఉంటుంది. యువతలో కూడా జుట్టు రాలే సమస్య ఎక్కువగా ఉంటుంది. అయితే శరీరం, తలలో కొన్ని సహజ మార్పుల వల్ల జుట్టు రాలడం ఎక్కువగా ఉంటుందని న్యూట్రిషనిస్ట్ లిమా మహాజన్ చెప్పారు. లిమా మహాజన్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ విషయాల్ని షేర్ చేసుకున్నారు. ఇందులో చలికాలంలో జుట్టు రాలడానికి మూడు ప్రధాన కారణాలు ఏంటో చెప్పారు. అంతేకాకుండా జుట్టు రాలడం ఎలా ఆపాలో కూడా వివరించారు. ఆ పూర్తి వివరాలపై ఓ లుక్కేద్దాం.

తలకు రక్త ప్రసరణ తగ్గడం

చలికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గినప్పుడు, శరీరం తనను తాను వెచ్చగా ఉంచుకోవడానికి అనేక విధానాలను అవలంబిస్తుందని న్యూట్రిషనిస్ట్ లిమా చెప్పారు. వీటిలో ఒకటి వాసోకాన్స్ట్రిక్షన్. అంటే చిన్న రక్త నాళాలు ఇరుకుగా మారడం. ఈ ప్రక్రియ చల్లని వాతావరణంలో తలపై కూడా జరుగుతుంది. దీని మూలంగా జుట్టు మూలాలకు ఆక్సిజన్, పోషకాలు చేరడం తగ్గుతుంది. దీంతో జుట్టు కుదుళ్ల బలహీనపడి.. హెయిర్ ఫాల్ ఎక్కువగా ఉంటుందని న్యూట్రిషనిస్ట్ చెప్పారు.

దీనిని ఎలా సెట్ చేయాలి?

ప్రతిరోజూ 4 నిమిషాలు తేలికగా తల మీద మసాజ్ చేయాలని న్యూట్రిషనిస్ట్ లిమా మహాజన్ అంటున్నారు. ఇది రక్త ప్రసరణను పెంచుతుంది. ప్రతిరోజూ 30 నిమిషాల చురుకైన నడక లేదా ఏదైనా తేలికపాటి వ్యాయామం జీవనశైలిలో భాగం చేసుకోవాలి. బయటకు వెళ్ళేటప్పుడు తలను కవర్ అయ్యేలా ఏదైనా ధరించండి. అయితే, చెమటలు ఎక్కువ పట్టేలా టైట్ గా మాత్రం ధరించవద్దు. అంతేకాకుండా రక్త ప్రసరణను పెంచే ఆహారాలు తినండి. వాల్‌నట్స్, బీట్‌రూట్, పాలకూర, దానిమ్మ, గుమ్మిడిగింజలు వంటివాటిని భాగం చేసుకోండి.

చుండ్రు, పొడి చర్మం సమస్యలు

చలికాలంలో గాలులు పొడిగా ఉంటాయి. తేమ వాతావరణం ఉంటుంది. దీని కారణంగా తలపై చర్మం సహజ తేమను కోల్పోతుంది. తలపై చర్మం ఎండిపోయినప్పుడు.. వేగంగా పొరలుగా మారడం ప్రారంభమవుతుంది. తలపై పొట్టు ఊడుతుంది. నూనెలు ఈ పొరలతో కలిసి తలపై చుండ్రు, ఈస్ట్ పెరగడానికి కారణమవుతాయి. ఫలితంగా దురద, చికాకుతో పాటు దువ్వేటప్పుడు జుట్టు రాలడం పెరుగుతుంది.

విటమిన్ డి లోపం

ఈ విటమిన్ జుట్టు పెరుగుదలకు సాయపడుతుంది. ఈ విటమిన్ లోపం జుట్టు మూలాల్ని బలహీనపరుస్తుంది. అంతేకాకుండా జుట్టు రాలడాన్ని పెంచుతుంది.

ఎలా నివారించాలి?

మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు.. వారానికి 34 రోజులు కనీసం 10 20 నిమిషాలు సూర్యరశ్మిని పొందండి. విటమిన్ డి లోపాన్ని భర్తీ చేసే ఆహారాల్ని భాగం చేసుకోండి. సాల్మన్ చేప, పుట్ట గొడుగులు, నారింజ, కాడ్ లివర్ ఆయిల్ వంటి వాటిని భాగం చేసుకోండి.







ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu



హార్దిక్ రీ ఎంట్రీ అదుర్స్

రెండు నెలల విరామం తర్వాత మళ్లీ గ్రౌండ్‌లోకి అడుగుపెట్టిన టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా.. తన పునరాగమనాన్ని ఘనంగా చాటాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (స్మాట్)లో భాగంగా ఈ బరోడా ఆటగాడు.. బంతితో నిరాశపరిచినా బ్యాట్ (42 బంతుల్లో 77*, 7 ఫోర్లు, 4 సిక్సులు)తో అదరగొట్టాడు. హార్దిక్ మెరుపులతో జింఖానా గ్రౌండ్స్ లో పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో బరోడా ఘనవిజయం సాధించింది. పంజాబ్ నిర్దేశించిన 223 పరుగుల భారీ ఛేదనను 19.1 ఓవర్లలోనే 3 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. ఇక స్మాట్‌లో హైదరాబాద్ జోరు కొనసాగిస్తున్నది. ఈ టోర్నీలో ఇప్పటికే రెండు విజయాలు సాధించిన ఆ జట్టు.. మంగళవారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఉత్తరప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో గెలిచింది. యూపీని 127 పరుగులకే కట్టడిచేసిన హైదరాబాద్.. 17.1 ఓవర్లలోనే ఛేదనను పూర్తిచేసి ఆడిన 4 మ్యాచ్‌లలో మూడో విజయాన్ని నమోదుచేసింది.

నేడే రెండో వన్డే.. టార్గెట్ సిరీస్

స్వదేశంలో దక్షిణాఫ్రికా చేతిలో ఎదురైన టెస్టు సిరీస్ పరాభవానికి ప్రతీకారం తీర్చుకునేందుకు భారత జట్టుకు చక్కని అవకాశం. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మూడు రోజుల క్రితం రాంచీలో ముగిసిన తొలి వన్డేలో ఉత్కంఠ విజయాన్ని అందుకుని 10 ఆధిక్యంలో ఉన్న టీమ్‌ఇండియా.. నేడు (బుధవారం) సఫారీలతో రెండో వన్డే ఆడనుంది. రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్) ఆతిథ్యమివ్వనున్న ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను ఇక్కడే పట్టేయాలనే పట్టుదలతో మెన్ ఇన్ బ్లూ ఉంటే.. సిరీస్ ఫలితాన్ని మూడో వన్డేకు వాయిదా వేసేలా సఫారీ జట్టు బరిలోకి దిగుతున్నది. ఈ నేపథ్యంలో ఇరుజట్ల మధ్య మరోమారు రసవత్తర పోరు జరుగనుంది. టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికి వన్డేలు మాత్రమే ఆడుతున్న రోహిత్, కోహ్లీ మీదే అభిమానుల దృష్టంతా కేంద్రీకృతమవుతున్నది. ఈ ఇద్దరి ఆట చూసేందుకు ప్రేక్షకులు స్టేడియాలకు పోటెత్తుతున్నారు. రాంచీలో సుమారు 32 వేల మంది హాజరుకాగా రాయ్‌పూర్ సైతం 'రోకో'కు సాదర స్వాగతం పలికేందుకు సిద్ధమైంది. వన్డేలకు ఆతిథ్యమివ్వడం రాయ్‌పూర్‌కు ఇది రెండోసారి మాత్రమే కావడంతో మైదానమంతా మరోసారి రోకో నామస్మరణ చేయనుంది. అభిమానుల అంచనాలకు తగ్గట్టు ఈ జోడీ సూపర్ ఫామ్‌లో ఉండటంతో భారత జట్టు సైతం ఈ దిగ్గజ ద్వయం తమ మ్యాజిక్‌ను కొనసాగించాలని ఆశిస్తున్నది. గత వన్డేలో విఫలమైన ఓపెనర్ జైస్వాల్, రుతురాజ్ ఈ మ్యాచ్‌లో అయినా రాణిస్తారో లేదో చూడాలి. బ్యాటింగ్ పరంగా భారత్‌కు బెంగేమీ లేకపోయినా రాంచీ వన్డేలో బౌలింగ్ మాత్రం వీక్‌గా కనిపించింది. ప్రత్యర్థి ఎదుట 350 పరుగుల లక్ష్యాన్ని నిలిపినా టీమ్‌ఇండియాకు విజయమేమీ సులభంగా దక్కలేదు. అయితే రాయ్‌పూర్ పిచ్ సీమర్లకు అనుకూలం. గతంలో ఇక్కడ న్యూజిలాండ్‌తో జరిగిన వన్డేలో భారత పేసర్లు నిప్పులు చెరిగారు. సఫారీ జట్టులో నాణ్యమైన పేసర్లున్న నేపథ్యంలో వారి బౌలింగ్ దాడిని భారత బ్యాటింగ్ లైనప్ ఏ మేరకు ఎదుర్కుంటుందన్నది చూడాలి.



రాబిన్ స్మిత్ కన్నుమూత

ఇంగ్లండ్ దిగ్గజ క్రికెటర్ రాబిన్ స్మిత్ (62) కన్నుమూశారు. 1988 నుంచి 1996 దాకా ఇంగ్లండ్ తరఫున 62 టెస్టులాడిన స్మిత్.. 43.67 సగటుతో 4,236 రన్స్ చేశారు. 90వ దశకంలో ఆయన ఇంగ్లండ్ బ్యాటింగ్ లైనప్‌కు వెన్నెముకగా ఉంటూ కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. వెస్టిండీస్, ఆస్ట్రేలియా పేసర్లకు తన బ్యాట్‌తో దీటుగా బదులిస్తూ ఆయన ఆడిన ఆట ఇంగ్లండ్ క్రికెట్ అభిమానులను అలరించింది. దక్షిణాఫ్రికాలో పుట్టిన స్మిత్.. ఇంగ్లండ్‌కు వలసవచ్చి ఆ దేశం తరఫున ఆడినా తన చివరి రోజులను ఆయన ఆస్ట్రేలియాలో గడిపారు.

రికార్డులు బద్దలు కొడుతున్న వైభవ్

బరిలోకి దిగితే రికార్డుల దుమ్ముదులపడమే పనిగా పెట్టుకున్న ఐపీఎల్ చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ మరో ఘనత సాధించాడు. ఇప్పటికే ఐపీఎల్‌తో



పాటు ఇటీవల ముగిసిన ఆసియా రైజింగ్ స్టార్స్‌లోనూ సెంచరీలు చేసిన 14 ఏండ్ల ఈ బీహార్ బాలుడు.. తాజాగా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (స్మాట్)లోనూ శతకం బాదాడు. తద్వారా భారత్ తరఫున ఈ ఫార్మాట్‌లో అతి పిన్న వయసులోనే అత్యధిక సెంచరీలు (3) చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు. స్మాట్‌లో సొంత రాష్ట్రం బీహార్‌కు ఆడుతున్న అతడు(108*).. మంగళవారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా మహారాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో 58 బంతుల్లో మూడంకెల స్కోరును అందుకున్నాడు. ఈ రికార్డుతో పాటు టీ20ల్లో 16 ఇన్నింగ్స్‌ల్లోనే 3 సెంచరీలు చేసిన మూడో బ్యాటర్‌గా భారత్ నుంచి మొదటి ఆటగాడిగానూ అరుదైన ఘనతను అందుకున్నాడు.

నేనైతే బాధ్యత తీసుకునే వాడిని

స్వదేశంలో భారత జట్టు టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్ కావడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. గువాహటి టెస్టులో కనీసం పోరాడకుండానే టీమిండియా చేతులెత్తేయడాన్ని మాజీలు తప్పుబడుతున్నారు. కోచ్ గౌతం గంభీర్ నేతృత్వంలో భారత జట్టు ప్రదర్శన దిగజారడంపై అందరూ అతడివైపే వేలెత్తి చూపుతున్నారు. 'ఆటగాళ్లు రాణించకుంటే సుదీర్ఘ ఫార్మాట్‌లో పూర్వ వైభవం ఇక కల్లేనా' అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ కోచ్ రవి శాస్త్రి తదనంతర పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. తాన్ కోచ్‌గా ఉండి ఉంటే టీమిండియా ఇలాంటి పరిస్థితులు రాకుండా జాగ్రత్తపడేవాడినని శాస్త్రి అన్నాడు. సొంతగడ్డపై ఇటీవలే వెస్టిండీస్‌ను వైట్‌వాష్ చేసిన భారత జట్టు అనూహ్యంగా దక్షిణాఫ్రికా చేతిలో అదే ఫలితాన్ని చవిచూసింది. స్వదేశంలో చెలరేగి ఆడాల్సిన టీమిండియా క్రికెటర్లు ఆడలేక అపసోపాలు పడ్డారు. సిరీస్ సమం చేయాల్సిన గువాహటిలోనూ అంతే దారుణమైన ఆటతో మ్యాచ్‌ను అప్పగించేయడంపై రవి శాస్త్రి మండిపడుతున్నాడు. 'గువాహటలో ఏం జరిగిందో చూడండి.. వందకు ఒక వికెట్ కోల్పోయిన టీమిండియా.. చూస్తుండగానే 130/7తో ఆలౌట్ అంచున నిలిచింది. అలాఅనీ మన జట్టు మరీ పేలవమైనదేమీ కాదు. ప్రతిభావంతులు లేరని కాదు. కొరవడిందల్లా బాధ్యత మాత్రమే. అవును.. ఆటగాళ్లకు బాధ్యత ఉండాలి. ఎందుకంటే.. మనవాళ్లు దేశవాళీలో.. ఐపీఎల్‌లో చాలాసార్లు స్పిన్ బౌలర్లను ఎదుర్కొన్నారు. కానీ, ఓపికగా, నిలకడగా ఆడలేక తేలిపోయారు' అని శాస్త్రి పాడ్‌కాస్ట్‌లో వెల్లడించాడు. టీమిండియా వైఫల్యంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న కోచ్ గౌతం గంభీర్‌ను తాను ఎంతమాత్రం వెనకేసుకురానని చెప్పేశాడు రవి శాస్త్రి. 'నేను గౌతీకి మద్దతుగా నిలవను. ఎందుకంటే 100 శాతం అతడు బాధ్యత తీసుకోవాలి. ఒకవేళ నేను కోచ్‌గా ఉన్నప్పుడు ఇలా జరిగి ఉంటే మొదటగా బాధ్యత తీసుకునేవాడిని. కోచ్‌గా ఎవరైనా చేయాల్సింది అదే. అంతేకాదు ఆటగాళ్లను అలానే వదిలేసేవాళ్లను కాదు. ఈ విషయంలో గంభీర్ అలా చేయలేదు. అందుకని అతడిని నేను వెనకేసుకురాను' అని మాజీ కోచ్ పేర్కొన్నాడు.



'అఖండ 2' టికెట్‌రేట్ల పెంపు

ఏపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్ లో వస్తున్న 'అఖండ 2: తాండవం' సినిమా కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'అఖండ' బ్లాక్ బస్టర్ తర్వాత వస్తున్న సీక్వెల్ కావడంతో సహజంగానే అంచనాలు ఉన్నాయి. డిసెంబర్ 5న విడుదల కానున్న ఈ సినిమాకు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఒక భారీ గుడ్ న్యూస్ అందింది. టికెట్ ధరల పెంపు, స్పెషల్ షోలకు సంబంధించి ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం, సినిమా విడుదలైన మొదటి పది రోజుల పాటు (డిసెంబర్ 5 నుంచి) టికెట్ ధరలు పెంచుకునే వెసులుబాటు కల్పించారు. సింగిల్ స్క్రీన్స్ లో రూ. 75, మల్టీప్లెక్స్ లలో రూ. 100 వరకు అదనంగా పెంచుకోవచ్చని జీవోలో పేర్కొన్నారు. ఇది నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్లకు పెద్ద ఊరట కలిగించే అంశం. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన సినిమా కావడంతో, ఈ పెంపు వల్ల రికవరీకి మంచి అవకాశం ఉంటుంది. అలాగే బెనిఫిట్ షోల విషయంలోనూ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. డిసెంబర్ 4వ తేదీ రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య ఒక స్పెషల్ షో వేసుకోవడానికి అనుమతి ఇచ్చింది. ఈ షో టికెట్ ధరను రూ. 600గా నిర్ణయించింది. అంటే రిలీజ్ కు ముందే అర్ధరాత్రి నుంచే 'జై బాలయ్య' నినాదాలు థియేటర్లలో మార్మోగడం ఖాయం. రోజుకు 5 ఆటలు ప్రదర్శించుకునే అవకాశం కూడా ఇచ్చారు.



ఫిబ్రవరిలో వస్తున్న 'అనుమాన పక్షి'

డీజే టిల్లుతో బ్లాక్ బస్టర్ డెబ్యు చేసిన రచయితదర్శకుడు విమల్ కృష్ణ, ఇప్పుడు యంగ్ ట్యాలెంటెడ్ రాగ్ మయూర్ హీరో గా చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్ లో హిలేరియస్ ఎంటర్టైనర్ అనుమాన పక్షి మూవీ డైరెక్ట్ చేస్తున్నారు. నిర్మాతలు రాజీవ్ చిలకా, రాజేష్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. మెరిన్ ఫిలిప్ కథానాయిక. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్ ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేశాయి. మేకర్స్ ఇప్పుడు రాగ్ మయూర్ పాత్ర ద్వారా సినిమా రిలీజ్ టైంని వెల్లడించే ప్రమోషనల్ వీడియోను విడుదల చేశారు. ఈ ప్రోమోలో రాగ్ మయూర్ అనుమాన పక్షిగా పరిచయం అయ్యారు. అతిగా ఆలోచించడం, అతిగా జాగ్రత్తగా ఉండే స్వభావంతో తన చుట్టూ ఉన్నవారిని గందరగోళపరిచే విచిత్రమైన క్యారెక్టర్ ఆకట్టుకుంది. ప్రోమోతో పాటు, చిత్ర ప్రచార కార్యక్రమాలు త్వరలో ప్రారంభమవుతాయని, ఫిబ్రవరిలో సినిమా విడుదల కానుందని తెలియజేశారు. ఖచ్చితమైన తేదీని త్వరలో అనౌన్స్ చేస్తారు. బలమైన పాత్రలతో అలరించే దర్శకుడు విమల్ కృష్ణ, ప్రత్యేకంగా రాగ్ మయూర్ కోసం రూపొందించిన యూనిక్ క్యారెక్టర్ తో వస్తున్నారు. అతని సిగ్నేచర్ స్టైల్, హాస్యభరితమైన కథ ప్రమోషనల్ వీడియోలో స్పష్టంగా కనిపిస్తుంది.

మోగ్లీ 2025 పవర్ ఫుల్ ట్రైలర్



రోషన్ కనకాల తన రెండవ చిత్రం మోగ్లీ 2025లో పూర్తిగా డిఫరెంట్ అవతార్ లో కనిపించనున్నారు. జాతీయ అవార్డు గ్రహీత సందీప్ రాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రం ఇప్పటికే బలమైన బజ్ సృష్టించింది. ఈరోజు, నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ ను లాంచ్ చేశారు. ట్రైలర్ విలన్ పాత్రను పోషించిన బండి సరోజ్ కుమార్ పరిచయంతో ప్రారంభమవుతుంది. కథనం మోగ్లీ ప్రశాంతమైన ప్రపంచానికి మారుతుంది. అతని గర్ల్ ఫ్రెండ్, చెవిటిమూగ డ్యాన్సర్, అడవిలో షూటింగ్ చేస్తున్న ఫిల్మ్ యూనిట్ లో భాగం. దర్శకుడు ఆమెతో ఫ్లర్ట్ చేయడానికి ప్రయత్నించినప్పుడు, మోగ్లీ వార్నింగ్ ఇస్తాడు. సరోజ్ కుమార్ ఆ ప్రాంతంలో పోస్టింగ్ కావడం, ఆ అమ్మాయి పట్ల అతనికి ఉన్న ఆసక్తితో ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయి. ఆమెను రక్షించాలని నిశ్చయించుకున్న మోగ్లీ యుద్ధానికి సిద్ధమవుతాడు. తన తొలి సినిమా కలర్ ఫోటోతో మనసుని ఆకట్టుకునే ప్రేమకథలను రూపొందించడంలో తన నైపుణ్యాన్ని ప్రదర్శించిన దర్శకుడు సందీప్ రాజ్, ఈసారి చాలా పెద్ద కాన్వాస్‌పై అదరగొట్టారు. చెవిటిమూగ హీరోయిన్, అసాధారణ కథానాయకుడు, రామాయణ శైలి కథనం ఈ చిత్రానికి ప్రత్యేకతని జోడించింది. రోషన్ కనకాల మోగ్లీగా పాత్రలో అదరగొట్టారు. ఈ పాత్ర కోసం కంప్లీట్ ట్రాన్స్ ఫర్మేషన్ అయ్యారు. సాక్షి మడోల్కర్ సవాలుతో కూడిన పాత్రను పోషించారు. బండి సరోజ్ కుమార్ విలన్ గా అద్భుతంగా నటించారు. అతని శక్తివంతమైన విలన్ పాత్ర కథలో హీరోయిజాన్ని పెంచుతుంది. హర్ష చెముడు తనదైన ముద్రవేశాడు. అటవీ నేపథ్యాన్ని అందమైన విజువల్స్‌తో రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీ ప్రత్యేకంగా నిలుస్తుంది. కాల భైరవ ఇంటెన్స్ స్కోర్ కథనానికి వెన్నెముకగా నిలిచింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణ విలువలు టాప్ క్లాస్ లో వున్నాయి. కోదాటి పవన్ కళ్యాణ్ ఎడిటింగ్, ప్రొడక్షన్ డిజైన్ కిరణ్ మామిడి, యాక్షన్ కొరియోగ్రఫీ నటరాజ్ మాదిగొండ అద్భుతమైన పనితీరు కనబరిచారు. డిసెంబర్ 12న విడుదల కానున్న మోగ్లీ 2025 ట్రైలర్ తో అంచనాలని భారీగా పెంచింది.

'అఖండ 2' అద్భుతమైన థియేటర్ ఎక్స్‌పీరియెన్స్ ఇస్తుంది



హీరోయిన్ సంయుక్త

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను పవర్ ఫుల్ కొలాబరేషన్ లో వస్తున్న 'అఖండ 2: తాండవం'. రామ్ ఆచంట, గోపీ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎస్ థమన్ సంగీతం అందించారు. టీజర్, ట్రైలర్ సాంగ్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. 'అఖండ 2: తాండవం' 2D, 3D రెండు ఫార్మాట్లలో డిసెంబర్ 5, 2025న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ సంయుక్త విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.

తెలుగులో ఎక్కువ సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న హీరోయిన్స్‌లో మీరే కనిపిస్తున్నారు.. ఎలా అనిపిస్తుంది?

ఆనందంగానే ఉంది. విరూపాక్ష తర్వాత చాలా సినిమాలు వచ్చా.యి నేను మాత్రం సెలెక్టెడ్ గా చేస్తున్నాను. బింబిసారా, విరూపాక్ష, సార్ భీమ్లా నాయక్ ఒకేసారి సైన్ చేశాను. అయితే రిలీజ్ టైమ్స్ డిఫరెంట్ గా అయ్యాయి. తర్వాత స్వయంభు, నారీ నారీ, ఆ తర్వాత అఖండ 2 సైన్ చేశాను. ఆ తర్వాత పూరి గారి సినిమా చేశాను. ప్రతి కథలో కంటెంట్ నచ్చి చేస్తున్నాను. ఇలాంటి కథ ప్రేక్షకులు ఇష్టపడతారు, వారికి నచ్చుతుంది అని ఉద్దేశంతోనే చేస్తాము. అది ఫైనల్ గా ఆడియన్స్ కి నచ్చితే వెరీ హ్యాపీ.

అఖండ2 ప్రాజెక్టు లోకి ఎలా వచ్చారు?

డైరెక్టర్ గారు ఈ కథ గురించి చెప్పారు. ముందు డేట్స్ ఉన్నాయో లేదో మా టీం ని అడిగాను. లేవని చెప్పారు. ఎలాగైనా ఈ సినిమా చేయాలని చెప్పాను. అప్పుడు వాళ్ళు డేట్స్ అడ్జస్ట్ చేశారు. బోయపాటి గారు చాలా గ్రేట్ విజన్ తో ఈ సినిమా తీశారు. మన ఇమాజినేషన్ కి మించి ఉంటుంది.

ఈ సినిమాలో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?

ఈ సినిమాలో నా క్యారెక్టర్ వెరీ ఇంపార్టెంట్ సీక్వెన్స్ లో చాలా కీలకంగా ఉంటుంది. నా క్యారెక్టర్ స్టయిలీష్ గా వుంటుంది. సినిమాలో సాంగ్ చేయాలని చెప్పారు. నాకు నిజంగా ఆ పాట విన్న తర్వాత చాలా నెర్వస్ గా అనిపించింది. అంత మాస్ సాంగ్ నేనెప్పుడూ చేయలేదు. తప్పకుండా సాంగ్ ని అద్భుతంగా చేయాలని నిర్ణయించుకున్నాను. రెండు రోజులు ప్రాక్టీస్ తర్వాత నా మోకాలు సహకరించలేదు. తర్వాత ఫిజియోథెరపీ తీసుకున్నాను ఆడియన్స్ థియేటర్స్ కి వచ్చిన తర్వాత వాళ్లని ఎంటర్టైన్ చేయాలి. అదే నా ఫైనల్ గోల్. నా క్యారెక్టర్ ఎందులో చాలా స్టైలిష్ గా ఉంటుంది.

తమన్ మ్యూజిక్ ఎలా ఉండబోతుంది?

ఇప్పటివరకు రిలీజ్ అయిన పాటలు అన్నిటికీ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇందులో పాటలు లార్డ్ శివ కి ట్రిబ్యూట్ లాగా ఉండబోతున్నాయి. తమన్ బ్యాగ్రౌండ్ స్కోర్ కోసం చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇందులో సంస్కృతంలో వినిపించే పదాలు అద్భుతమైన సాహిత్యం ఒక ట్రాన్స్ లో తీసుకెల్తాయి

మీ కెరీర్ లో ఎక్కువగా మైథిలాజికల్ సినిమాలు చేస్తున్నారని అనిపిస్తుంది?

ఇది నేను ప్లాన్ చేసింది కాదు. అది సహజంగా జరుగుతోంది.

మీరు చాలా స్పిరిచువల్ అని విన్నాం?

అవునండి. అది చాలా డీప్ సబ్జెక్టు. దాని గురించి మనం ప్రత్యేకంగా ఒక ఇంటర్వ్యూ నే పెట్టాలి.

తెలుగు సినిమా ఇండస్ట్రీ మీకు ఎలా అనిపిస్తుంది?

తెలుగు ప్రేక్షకులు నెక్స్ట్ లెవెల్. వాళ్ళు సినిమాని సెలబ్రేట్ చేసుకునే విధానం అద్భుతం. వాళ్ళు ఫస్ట్ డేని సెలబ్రేట్ చేసుకునే విధానం చూస్తే మనం సక్సెస్ కి ఆడిట్ అయిపోతాం.

మీ నుంచి రాబోతున్న సినిమాలు ఎలా ఉండబోతున్నాయి?

స్వయంభులో యాక్షన్ క్యారెక్టర్ చేస్తున్నాను. శర్వా నారి నారి నడుమ మురారిలో చాలా మంచి క్యారెక్టర్. అలాగే పూరి గారితో వర్క్ చేయడం బెస్ట్ ఎక్స్పీరియన్స్.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200